PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 53 | విజయవాడ, శనివారం 23 సెప్టెంబర్ 2023 | 8 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Saturday 23 September 2023 | Rs

సిటీ◆

విద్యుత్ భారాలపై పోరుకు సిద్ధం కండి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు
- రాష్ట్రాభివృద్ధికి బిజెపి అడ్డంకి
- 20 నుంచి 25 అసెంబ్లీ, 3 నుంచి 4 పార్లమెంట్ స్థానాలకు పోటీ

3

ఆసియా క్రీడలు నేటి నుంచే..
- భారత ఫ్లాగ్ బేరర్లుగా హర్మన్‌ప్రీత్, లవ్లీనా
- 655 మంది అథ్లెట్లతో భారీ బృందం

8

రెండోరోజూ అదే తీరు

- శాసనసభలో కొనసాగిన సస్పెన్షన్లు
- స్పీకర్ పోడియం చుట్టుముట్టిన టిడిపి సభ్యులు
- మార్షల్స్‌తో తోపులాట
- స్కిల్ స్కామ్‌పై ప్రారంభమైన చర్చ

స్పీకర్ పోడియాన్ని చుట్టుముట్టి ప్లకార్డు ప్రదర్శిస్తున్న టిడిపి ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

శాసనసభలో రెండో రోజు శుక్రవారం కూడా సస్పెన్షన్ల పర్వం కొనసాగింది. శుక్రవారం సభలో వీడియోలు తీయడంతో టిడిపి సభ్యులు కింజరాపు అచ్చెన్నాయుడు, బెందాళపు అశోక్‌లను ఈ సెషన్ అయ్యే వరకు స్పీకర్ తమ్మినేని సీతారామ్ సస్పెండ్ చేశారు. విజిల్స్ ఊదడంతో నిమ్మల రామానాయుడు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, వెలగపూడి రామకృష్ణలను ఒక రోజు సస్పెండ్ చేశారు. సస్పెండయిన సభ్యులను బయటకు పంపే క్రమంలో మార్షల్స్‌కు , టిడిపి సభ్యులకు మధ్య స్వల్ప తోపులాట జరిగింది. అనంతరం మిగిలిన టిడిపి సభ్యులు కూడా సభ నుంచి నిష్క్రమించారు. టిడిపి సభ్యులు సభ నుండి వెళ్లిన తరువాత స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో చోటుచేసుకున్న అవినీతిపై అధికారపక్ష సభ్యులు చర్చను ప్రారంభించారు. అంతకు మందు సభ ప్రారంభమైన వెంటనే టిడిపి సభ్యులు చంద్రబాబుపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని, సైకో పాలన పోవాలంటూ పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ స్పీకర్ పోడియాన్ని చుట్టిముట్టారు. పోడియంపైకి వెళ్ళి నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. దీంతో శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి జోక్యం చేసుకుంటూ ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపేందుకు అనేక మార్గాలున్నాయని, టిడిపి సభ్యులు వయస్సుకు తగ్గ ప్రవర్తన కాకుండా అల్లరి చేస్తున్నారని, నోటికొచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదని, నోరు అదుపులో పెట్టుకోవాలన్నారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ వారికేమి కావాలో స్పష్టంగా చెప్పకుండా సభకు అంతరాయం కలిగించడం మంచిది కాదన్నారు.

ఇది అసెంబ్లీ అని, టిడిపి ఆఫీసు కాదన్నారు. చంద్రబాబు స్కిల్ స్కామ్‌పై చర్చిద్దామని, చర్చలో మాట్లాడాలంటే అది వదిలిపెట్టి ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే చేతులు కట్టుకుని కూర్చోమన్నారు. మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ సైకో జైలులో ఉన్నాడని, ఖైదీ నెంబరు 7691 అంటూ మాట్లాడారు. దీంతో సభలో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. సభలో గందరగోళ పరిస్థితులు ఏర్పడటం, టిడిపి, వైసిపి సభ్యుల మధ్య ఉద్రిక్తత పెరుగుతుండటంతో స్పీకర్ తమ్మినేని సభ ప్రారంభమైన 15 నిమిషాలకే సభ వాయిదా వేశారు. సభ తిరిగి ప్రారంభమైన వెంటనే సైకో జగన్ డౌన్ డౌన్, సైకో పాలన పోవాలంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఇదే సందర్భంలో టిడిపి సభ్యులు కింజరాపు అచ్చెన్నాయుడు, బెందాళపు అశోక్‌లు సభను వీడియో తీశారు. వీడియోలు తీసిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ చీఫ్ విప్ ప్రసాద్‌రాజు కోరారు. వీడియోలు తీసిన ఇద్దరు సభ్యులను ఈ సెషన్ సమావేశాలు ముగిసే వరకు సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. ఈ సమయంలోనే టిడిపి సభ్యులు విజిల్స్ ఊదారు. బాలకృష్ణ కూడా విజిల్స్ ఊదుతూ కనిపించారు. దీంతో సభలో కొద్ది సేపు ఏమి జరుగుతుందో అర్థంకాని పరిస్థితి నెలకొంది. గందరగోళం మధ్యలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు చేసిన తప్పును ఇతరులపైకి నెట్టివేసి చంద్రబాబును బేషరతుగా కేసును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. దమ్ము ధైర్యం ఉంటే స్కిల్ స్కామ్‌లో చంద్రబాబు అవినీతిపై మాట్లాడదామని సవాల్ విసిరారు. దీంతో సభలో మరో సారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అదే సందర్భంలో టిడిపి ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని తిరస్కరిస్తున్నట్లు స్పీకర్ తమ్మినేని సీతారామ్ ప్రకటించారు. అనంతరం సభను మరో సారి వాయిదా వేశారు. టిడిపి సభ్యులు బయటకు వెళ్లే క్రమంలో సైకో పోవాలని, సైకో పోవాలి- సైకిల్ రావాలి, సేవ్ డెమోక్రసీ అంటూ నినాదాలు చేశారు.

అసెంబ్లీ సమావేశాలను బహిష్కరిస్తున్నాం

- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అసెంబ్లీలో జరుగుతున్న పరిణామాలకు కలతచెంది, అధికార పార్టీ సభ్యుల వైఖరిని నిరసిస్తూ ఈ సమావేశాలు ముగిసేవరకు శాసనసభ, మండలికి వెళ్లకూడదని నిర్ణయం తీసుకున్నామని పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు అన్నారు. తాము ఇచ్చిన వాయిదా తీర్మానం చదివే స్థితిలో కూడా స్పీకరు లేరని, తాము మాట్లాడుతుంటే మైకులు ఆపేస్తారని విమర్శించారు. ముఖ్యమంత్రి, మంత్రులకు మాత్రం గంటలతరబడి అవకాశమిస్తారని ఆరోపించారు. నాలుగున్నరేళ్లుగా ఇదే తంతు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. శాసనసభ, మండలిలో టిడిపి సభ్యుల సస్పెన్షన్ అనంతరం ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో కలిసి వెలగపూడిలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. శాసనసభను వైసిపి కార్యాలయం కంటే దారుణంగా మార్చిన ఘనత స్పీకరుకు దక్కుతుందని విమర్శించారు. తమను 'యూజ్‌లెస్ ఫెలోస్' అని, వైసిపి సభ్యులను తన సభ్యులు అని గౌరవంగా మాట్లాడటం ఏమిటని ప్రశ్నించారు. స్పీకరు స్థానాన్ని ఆయన ఆగౌరవపరిచారని, తమను తిట్టిన వ్యక్తి చెప్పేది ఎందుకు వినాలని అన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు టిడిపి ప్రభుత్వం చేసిన పనులు, చంద్రబాబు నాయుడుపై దుమ్మెత్తిపోయడం తప్ప ఏనాడూ అర్థవంతంగా చర్చ జరపలేదని విమర్శించారు. చంద్రబాబుపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేసి చేసిన తప్పుకు ముఖ్యమంత్రి, ప్రభుత్వం ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి అవినీతిపై చర్చిద్దామన్నారు. జగన్ చేసిన అవినీతి, ఆయనపై ఉన్న కేసులు, న్యాయస్థానాల్లో ఎదుర్కొంటున్న విచారణతో మిగతా 7లో

సిఐడి కస్టడీకి బాబు

- రిమాండ్ పొడిగింపు
- ఎసిబి కోర్టు ఆదేశం
- క్వాష్ పిటిషన్ కొట్టేసిన హైకోర్టు

ప్రజాశక్తి - యంత్రాంగం

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అరెస్ట్ అయి జ్యూడిషియల్ రిమాండ్‌లో వున్న తెలుగుదేశం అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు రెండు రోజుల పాటు సిఐడి కస్టడికి ఎసిబి కోర్టు అనుమతించింది. ఈ మేరకు శుక్రవారం మధ్యాహ్నం ఆదేశాలు జారీ చేసింది. ఐదు రోజుల కస్టడీకి ఇవ్వాలని సిఐడి కోరగా రెండు రోజుల విచారణకు న్యాయమూర్తి అనుమతించారు. రాజమహేంద్రవరం జైలులోనే బాబును విచారించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. విచారణ అధికారుల పేర్లు ఇవ్వాలని, న్యాయవాదుల సమక్షంలో విచారణ చేయాలని ఆదేశించారు. ఉదయం 9.30 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు విచారణకు అనుమతించారు. విచారణ జరుపుతున్న విడియోలు, ఫోటోలు విడుదల చేయకూడదని పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం కస్టడి ముగిసిన తరువాత వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టు ముందు హాజరు పరచాలని ఆదేశించారు. అంతకుముందు బాబు రిమాండ్‌ను రెండు రోజుల పాటు పొడిగిస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టులో చంద్రబాబు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై తీర్పు వెలువడనుండటంతో కస్టడి పిటిషన్‌పై తీర్పును మధ్యాహ్నం 2.30 గంటలకు ఎసిబికోర్టు న్యాయమూర్తి వాయిదా వేశారు. మధ్యాహ్నం 1.30గంటల ప్రాంతంలో క్వాష్ పిటిషన్‌పై తీర్పును ప్రకటించిన హైకోర్టు న్యాయమూర్తి 'పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు' ఏకవాక్య తీర్పునిచ్చారు.అనంతరం కస్టడి పిటిషన్‌పై ఎసిబి కోర్టు తీర్పునిచ్చింది.

ఈ దశలో జోక్యం చేసుకోలేం : హైకోర్టు

చంద్రబాబు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను కొట్టేస్తూ జస్టిస్ కె.శ్రీనివాస్‌రెడ్డి జారీ చేసిన తుది ఉత్తర్వులలో వివిధ అంశాలను పేర్కొన్నారు. భజనాల్ కేసు నుంచి నిహారిక ఇన్ఫ్రా కేసు వరకు సుప్రీం కోర్టు జారీ చేసిన మార్గదర్శకాల మేరకు ఈ దశలో పిటిషన్‌లో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేశారు. కేసు దర్యాప్తు దశలో ఉండగా మినీ ట్రయిల్ చేసేందుకు ఆస్కారం లేదన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసు 2021 డిసెంబర్ 09న నమోదు అయ్యిందని, దర్యాప్తు సంస్థ 140 మంది సాక్షులకుపైగా సీఐడీ విచారణ చేసిందని, నాలుగు వేలకు పైగా పత్రాలను దర్యాప్తు సంస్థ సేకరించిందని, ఇలాంటి ప్రాథమిక దశలో కోర్టుల జోక్యానికి ఆస్కారం లేదన్నారు. నిధుల దుర్వినియోగం వ్యవహారం తేలాల్సివుందని, దర్యాప్తు జరుగుతోందని గుర్తు చేశారు.

అవి ఆరోపణలే : చంద్రబాబునాయుడు

జ్యుడిషియల్ రిమాండ్ శుక్రవారం ముగియడంతో చంద్రబాబును వర్చ్యువల్ పద్ధతిలో శుక్రవారం ఉదయం ఎసిబి కోర్టు విచారించింది. ఈ సందర్భంగా సిఐడి కస్టడి కోరుతోందని, దీనిపై అభిప్రాయం తెలపాలని న్యాయమూర్తి కోరడంతో బాబు మాట్లాడుతూ తనపై ఉన్నవి కేవలం ఆరోపణలు మాత్రమే అని తెలిపారు. తనకు కనీసం నోటీసు కూడా ఇవ్వకుండా అన్యాయంగా అరెస్ట్ చేశారని కోర్టుకు తెలిపారు. జైలులో వుంచి తనను మానసిక క్షోభకు గురిచేస్తున్నారని అన్నారు. 45 ఏళ్ల సుదీర్ఘ రాజకీయజీవితం తనదని పేర్కొన్నారు. 'నాతప్పు వుంటే విచారణ జరిపి అరెస్ట్ చేయాల్సింది. అన్యాయంగా అరెస్ట్ చేశారు. ఇది నా బాధ. నా ఆవేదన . నా ఆక్రందన. ఈ వయస్సులో నాకు పెద్ద పనిష్మంట్ ఇచ్చారు. అయినా, చట్టం ముందు అందరూ సమానమేనని నమ్ముతాను. చట్టాన్ని గౌరవిస్తాను . న్యాయం గెలవాలి.' అని చంద్రబాబు న్యాయమూర్తికి తెలిపారు.

8,366 టీచర్ పోస్టులు ఖాళీ

త్వరలో భర్తీ చేస్తామన్న మంత్రి బొత్స

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 8,366 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ వెల్లడించారు. రాష్ట్రంలో మంజూరైన ఉపాధ్యాయ పోస్టులు, ఖాళీల వివరాలు చెప్పాలని మంత్రిని శాసనమండలిలో పిడిఎఫ్ సభ్యులు కెఎస్ లక్ష్మణరావు, ఐ వెంకటేశ్వరరావు, షేక్ సాబ్జీ టిడిపి సభ్యులు పి అశోక్‌బాబు, భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి, దువ్వారపు రామారావు, వేపాడ చిరంజీవిరావు, బి తిరుమల నాయుడు శుక్రవారం విడివిడిగా కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయ మంజూరు పోస్టులు 1,88,162 ఉన్నాయని మంత్రి సమాధానం చెప్పారు. వీటిల్లో 1,69,642 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని తెలిపారు. కేవలం 8,366 పోస్టులు మాత్రమే అవసరమని మంత్రి సమాధానం చెప్పారు. ఖాళీ పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. 2019 నుంచి 14,129 మంది ఉపాధ్యాయులను నియమించామని వివరించారు. రాష్ట్రంలో 20 వేల నుంచి 25 వేల పోస్టుల వరకు ఖాళీలు ఉన్నాయని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. వీటి భర్తీ కోసం వెంటనే మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు.

'జాబ్ కేలండరు' విడుదల చేయాలి : పిడిఎఫ్

జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం జాబ్ కేలండరు విడుదల చేసి ప్రతి సంవత్సరం ఉద్యోగాలు భర్తీ చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీలు డిమాండ్ చేశారు. జాబ్ కేలండరు హామీపై చర్చించాలని మండలి ఛైర్మన్ మోషేన్‌రాజుకు ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు గురువారం వాయిదా తీర్మానం అందించారు. ఈ తీర్మానాన్ని తిరస్కరిస్తున్నట్లు ఛైర్మన్ ప్రకటించారు. ప్రతియేటా జాబ్ కేలండర్ విడుదల చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందని లక్ష్మణరావు ఈ సందర్భంగా గుర్తుచేశారు. రాష్ట్రంలో గ్రూప్-1, 2, 3, 4 ప్రభుత్వ ఉద్యోగాలు 40 వేలకుపైగా ఖాళీగా ఉన్నాయన్నారు. ఇప్పటి వరకు కేవలం 10,134 పోస్టులను మాత్రమే భర్తీ చేశారన్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒక్క డిఎస్‌సి నోటిఫికేషనూ ఇవ్వలేదన్నారు.

ఎన్నికల ముంగిట పథకాల వరద
- నాలుగు రాష్ట్రాల్లో వీటి విలువ రూ. 37వేల కోట్లు
- తెలంగాణ అధికం.. ఛత్తీస్‌గఢ్‌లో అత్యల్పం

భారత్‌లో క్షీణిస్తున్న హక్కుల పరిస్థితి
- యుఎన్ ప్రత్యేక ప్రతినిధి ఫెర్నాండ్ డి వరెన్నెస్

భారత్ వృద్ధి 6.5 శాతమే..!

7

ఊరూరా కిడ్నీ బాధితులు

- పిసిపల్లి, కనిగిరి మండల వాసులను కబళిస్తోన్న వ్యాధి
- ఫ్లోరిన్ సమస్యతో ఏళ్ల తరబడి వీడని మహమ్మారి
- సాగర్ జలాలు అందించడంలో పాలకుల నిర్లక్ష్యం

దివాకరపల్లెలోని కిడ్నీ వ్యాధిగ్రస్తులు

ప్రజాశక్తి- ఒంగోలు బ్యూరో

ప్రకాశం జిల్లా కనిగిరి నియోజకవర్గంలోని, పిసిపల్లి, కనిగిరి మండల్లాలోని ప్రజలను కిడ్నీ వ్యాధి కబళిస్తోంది. కనిగిరి మండలంలో కంటే పిసిపల్లి మండలంలో పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది. దశాబ్దాల ఏళ్ల తరబడి ఈ పరిస్థితి ఉన్నా పాలకులు పట్టించుకోవడం లేదు. దీంతో, ఊరూరా కిడ్నీ వ్యాధిగ్రస్తులు పెరుగుతున్నారు. ఊరికి పది నుంచి పదిహేనుమందికిపైగా ఈ వ్యాధితో ప్రస్తుతం బాధపడుతున్నారు. చికిత్స కోసం అయ్యే ఖర్చు భరించలేకపోతున్నారు. గత పదేళ్లలో ఊరికి ఇరవై మందికిపైగా ఈ వ్యాధితో మృత్యువాత పడ్డారని, ఈ లెక్కలను పాలకులు గణాంకాల్లో చేర్చకుండా సమస్య తీవ్రతను మరుగున పరుస్తున్నారని స్థానికులు చెప్తున్నారు. పిసి పల్లి మండలంలో 18 పంచాయతీల్లోని 56 గ్రామాల్లో, కనిగిరి మండలంలో 23 పంచాయతీల్లోని 58 గ్రామాల్లో కిడ్నీ వ్యాధిగ్రస్తులు ఉన్నారు. ఈ గ్రామాల్లోని భూగర్భ జలాల్లో ఫ్లోరిన్‌తోపాటు సిలికాన్, కోబాల్ట్, క్రోమియం తదితర ఏడు రకాల ప్రమాదకరమైన మూలకాలు అధికంగా ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. నీటిలో సాధారణంగా ఫ్లోరిన్ 1.5 పిపిఎం లోపు ఉంటేనే తాగడానికి సురక్షితం. కనిగిరిలో 5.4 పిపిఎం ఉంది. బొగ్గులగొంది కాలనీలో 14 శాతం ఉంది. ఇదే అత్యధికంగా ఉన్న ప్రాంతం. పిసిపల్లి మండలం కమ్మవారిపల్లెలో 9 పిపిఎం ఉంది. మిగతా గ్రామాల్లోనూ 3.5 పిపిఎం నుంచి 5 పిపిఎం వరకూ ఫ్లోరిన్ ఉంది. ఈ నీరు తాగడానికి ఏ మాత్రమూ పనికిరాదని గతంలోనే తేల్చారు. ఈ మేరకు ఇచ్చిన నివేదికలను ప్రభుత్వాలు బుట్టదాఖలు చేశాయని ఆ మండలాల ప్రజలు చెప్తున్నారు. తాగునీటి కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంతో పరిస్థితి అదుపు తప్పిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఈ నేటినే తాగాల్సి వస్తోంది. దీంతో, ఫ్లోరోసిస్ వ్యాధి బారిన పడుతున్నారు. ఎముకల వ్యాధులతోపాటు కిడ్నీలూ దెబ్బతింటున్నాయి. భారీ తాగునీటి పథకాలు ఏర్పాటు చేసి మిగతా 2లో

ఏథెన్స్‌లోని గ్రీస్ పార్లమెంట్ ముందు జరిగిన ర్యాలీలో పాల్గొన్న వేలాది మంది కార్మికులు

కార్మిక వ్యతిరేక బిల్లుపై పెల్లుబికిన ఆగ్రహం

సమ్మెలు, ర్యాలీలతో హోరెత్తిన గ్రీస్

7

రేపు తొమ్మిది వందే భారత్ రైళ్లు ప్రారంభం

- తెలుగు రాష్ట్రాల నుంచి రెండు

న్యూఢిల్లీ : ఈ నెల 24న తొమ్మిది వందేభారత్ రైళ్లను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వర్చువల్ విధానంలో ప్రారంభించను న్నారు. ఇందులో విజయవాడ-చెన్నై, హైదరాబాద్ (కాచీగూడ)- బెంగళూరు మధ్య నడిచే రైళ్లు కూడా ఉన్నాయి. వీటితోపాటు జైపూర్-ఉదయ్‌పూర్, పాట్నా-హౌరా, రాంచీ-హౌరా, చెన్నై-తిరునెల్వెలి, పూరీ-రూర్కెలా, కాసర్‌గోడ్- తిరువనంతపురం, జమ్నానగర్- అహ్మదాబాద్ మధ్య వందేభారత్ రైళ్లను ప్రారంభించనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. విజయవాడ రైల్వే స్టేషన్‌లో జరిగే ప్రారంభోత్సవంలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాల్గొనే అవకాశాలున్నాయి. ఇందుకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లను అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతానికి ఇవన్నీ ఎనిమిది కోచ్‌లతో నడవనున్నాయి. ప్రస్తుతానికి దేశవ్యాప్తంగా 50 రూట్లలో 25 వందే భారత్ రైళ్లు నడుస్తున్నాయి.

బిజెపి ఎంపి విద్వేష వ్యాఖ్యలు



రమేష్ బిధూరి

న్యూఢిల్లీ : బిఎస్‌పి ఎంపి కున్వార్ దనిష్ అలీపై తీవ్ర అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన బిజెపి ఎంపి రమేష్ బిధూరిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రతిపక్షాలు పట్టుబట్టాయి. స్పీకర్ ఓం ప్రకాష్ బిర్లా మాత్రం మందలింపుతో సరిపెట్టారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని స్పీకర్ సుతిమెత్తగా మందలించారు. పార్లమెంట్‌లో అభ్యంతరకమైన భాషను ఉపయోగించినందుకు పార్టీ నుంచి ఎందుకు సస్పెండ్ చేయకూడదో చెప్పాలంటూ బిజెపి ఆయనకు షోకాజ్ నోటీసు ఇచ్చింది. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో భాగంగా గురువారం సాయంత్రం చంద్రయాన్-3పై చర్చ జరిగింది. ఈ చర్చలో రమేష్ బిధూరి మాట్లాడుతున్నప్పుడు బిఎస్‌పి ఎంపి అలీ కొన్ని అభ్యంతరాలు లేవనెత్తారు. దీంతో బిధూరి తీవ్రమైన మత దూషణలకు పాల్పడ్డారు. పార్లమెంట్ నుంచి బిధూరిని సస్పెండ్ చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. బిధూరికి వ్యతిరేకంగా స్పీకర్‌కు దనిష్ అలీ స్వయంగా ఫిర్యాదు చేశారు. స్పీకర్‌కు అందజేసిన లేఖలో బిధూరి తనపై ఉపయోగించిన అభ్యంతరకరమైన పదాలను అలీ లిస్ట్ చేశారు. 'ఇది చాలా దురదృష్టకరం. ఇలాంటి సంఘటన నూతన పార్లమెంటు భవనంలో, స్పీకర్‌గా మీ నాయకత్వంలో జరగడం విచారకరం. ఒక మైనార్టీ సభ్యుడిగా నాకు హృదయ విదారకంగా ఉంది' అని లేఖలో తెలిపారు. బిధూరి వ్యాఖ్యలను లోక్‌సభ ప్రత్యేకాధికారాల కమిటీకి సూచిం చాలని డిమాండ్ చేశారు. బిజినెస్ రూల్స్ ప్రవర్తనలోని 222, 226, 227 నిబంధనలను గుర్తు చేశారు. స్పీకర్‌కు ఫిర్యాదు చేసిన అనంతరం విలేకరులతో అలీ మాట్లాడారు. 'మనం ప్రజాస్వామ్యానికి తల్లి అని చెప్పుకుంటాము. ప్రజాస్వామ్యంలో ఆలయంగా భావించే పార్లమెంట్‌లో ఒక ఎన్నికైన ఎంపిపై ముల్లా, కత్వా (సున్తీ), ఉగ్రవాదులు వంటి పదాలు ఉపయోగించారు. ఇది నా మనసును ఎంతగానో బాధించింది. రాత్రి నిద్దర కూడా పట్టలేదు' అని తెలిపారు. బిధూరి వ్యాఖ్యలపై ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. బిధూరి మతపరమైన దూషణలపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పశ్చాత్తాపాన్ని వ్యక్తం చేయడం సరిపోదని, బిధూరిని లోక్‌సభ నుండి సస్పెండ్ చేయాలని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ డిమాండ్ చేశారు. మొహువా మొయిత్రా (టిఎంసి), అసదుద్దీన్ ఒవైసీ (ఎఐఎంఎం) తదితర ప్రతిపక్ష ఎంపీలు కూడా బిధూరిని లోక్‌సభ నుండి సస్పెండ్ చేయాలని కోరారు.

ఆరుగురు మాజీ ఎమ్మెల్యేలకు శాసనసభ సంతాపం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఇటీవల మృతిచెందిన మాజీ ఎమ్మెల్యేలకు శుక్రవారం శాసనసభ సంతాపాన్ని తెలియజేసింది. సంతాప తీర్మానాన్ని స్పీకరు తమ్మినేని సీతారాం ప్రవేశపెట్టారు. యర్రా నారాయణస్వామి, పాటిల్ నీరజారెడ్డి, దొమ్మేటి వెంకటేశ్వర్లు, తాడ్డి సన్యాసినాయుడు, అల్లూరి కృష్ణంరాజు, కాకర నూకరాజుకు సభ సంతాపాన్ని వ్యక్తం చేసింది. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని సభ తెలియజేసింది.

సుప్రీంను ఆశ్రయించనున్న చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తనపై సిఐడి నమోదు చేసిన కేసును కొట్టి వేయాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేయడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించాలని టిడిపి నిర్ణయించింది. ఈమేరకు పార్టీ సీనియర్ నాయకులు నిర్వహించిన చర్చల్లో సోమ లేదా మంగళవారాల్లో సుప్రీంకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేయాలని నిర్ణయించారు. దీనికోసం టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ మరికొన్ని రోజులు ఢిల్లీలోనే ఉండాలని నిర్ణయించుకున్నారు. ఈమేరకు సుప్రీంకోర్టులో సీనియర్ న్యాయవాదులతో చర్చలు జరుపుతున్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

24న కొరటాల శతజయంతి సభ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రైతు వ్యవసాయ కార్మిక ఉద్యమ నాయకులు కొరటాల సత్యనారాయణ శతజయంతి సభ ఈ నెల 24న వడ్డేశ్వరంలోని కొరటాల, బాపనయ్య భవన్లో జరపనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలురైతు సంఘం రాష్ట్ర కమిటీలు తెలిపాయి. ఈ మేరకు శుక్రవారం ఉమ్మడిగా ప్రకటన విడుదల చేశాయి. సాధారణ కమ్యూనిస్టుగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన కొరటాల సత్యనారాయణ సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర కార్యదర్శిగా, పొలిట్‌బ్యూరో సభ్యులుగా ఎదిగారని ఆయా సంఘాల నాయకులు పేర్కొన్నారు. వ్యవసాయ కార్మిక, చేనేత, రైతు ఉద్యమంలో ఎనలేని కృషి చేశారని తెలిపారు. కొరటాల అభిమానులు, ఉద్యమ శ్రేయోభిలాషులు, రైతు, వ్యవసాయ కార్మిక, కౌలురైతు సంఘాల నాయకులు కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లోనూ సభలు జరపాలని నాయకులు కోరారు.

అక్రమ కేసుపై గళమెత్తిన టిడిపి ఎంపిలు : లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుపై పార్లమెంటులో టిడిపి ఎంపిలు గళమెత్తారని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. చంద్రబాబును తప్పుడు కేసులో అరెస్టు చేయించిన జగన్ తీరుపై దేశమంతా చర్చకు వచ్చేలా చేశారని ఎంపిలను శుక్రవారం అభినందించారు. భవిష్యత్తు కార్యాచరణ, అనుసరించాల్సిన వ్యూహంపై ఎంపిలు కేశినేని నాని, గల్లా జయదేవ్, కె రామ్మోహన్‌నాయుడు, కనకమేడల రవీంద్రకుమార్‌తో ఢిల్లీలో సమావేశమయ్యారు. చంద్రబాబు అక్రమ అరెస్టును పార్లమెంటులో చర్చకు తెచ్చి దేశం దృష్టికి తీసుకెళ్లేందుకు గట్టిపోరాటం చేశారని ప్రశంసించారు. వైసిపి ఎంపిల హేళనలు, మాటల దాడులను తట్టుకుని సమర్థవంతంగా పార్టీ వాణిని వినిపించారని కొనియాడారు.

ఉచిత బీమా కంపెనీ ఏర్పాటుకు కేంద్రానికి ప్రతిపాదన : కాకాని

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో రైతులకు ఉచిత పంటల బీమా సదుపాయాన్ని కల్పించేందుకు ప్రభుత్వమే బీమా కంపెనీని ప్రారంభించేందుకు చర్యలు చేపట్టినట్లు వ్యవసాయశాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం శాసనమండలిలో వ్యవసాయ రంగం పురోగతి-రాష్ట్ర ప్రభుత్వ చర్యలపై జరిగిన లఘు చర్చకు మంత్రి గోవర్ధన్‌రెడ్డి సమాధానం ఇచ్చారు. కేంద్ర ఇన్సూరెన్సు రెగ్యులేటరీ అథారిటీకి ప్రతిపాదనలు పంపామని ఆయన పేర్కొన్నారు. కేంద్రం నుంచి ఇంకా అనుమతి రాకపోడంతో ప్రస్తుతం యూనివర్సల్ కవరేజ్ మోడల్‌ను అమలు చేస్తున్నట్టు తెలిపారు. 2019 నుంచి 2021 వరకు వైఎస్ఆర్ పంటల బీమా పథకం అమలు చేశామని, 2022 నుంచి కేంద్ర ప్రభుత్వ అభ్యర్థన మేరకు కేంద్ర ప్రభుత్వంతో కలిసి ప్రధాన మంత్రి ఫసల్ బీమాను అమలు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

తప్పు జరిగిందనే రచ్చ

- 'స్కిల్' స్కామ్‌పై చర్చలో మంత్రి బుగ్గన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో తప్పు జరిగింది కాబట్టే ప్రజల దృష్టిని మళ్ళించడానికి టిడిపి రచ్చ చేస్తోందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. శాసనసభలో శుక్రవారం స్కిల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్‌పై చర్చ జరిగింది. ఈ సందర్భంగా బుగ్గన మాట్లాడుతూ ఈ అవినీతిని మొదట కేంద్ర ప్రభుత్వ సంస్థలు గుర్తించి చర్యలు కూడా తీసుకున్నాయని చెప్పారు. ఐటి, జిఎస్‌టిలు స్కామ్ జరిగనట్లు గుర్తించాక సీమెన్స్ ఇండియా ఎమ్‌డి, డిజిటెక్ ఎమ్‌డిలను ఇడి అరెస్ట్ కూడా చేసిందన్నారు. ప్రజాధనాన్ని షెల్ కంపెనీల ద్వారా కోట్టేసిన ఈ కేసులో రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోకూడదని అంటే ఎలా అని ప్రశ్నించారు. చంద్రబాబునాయుడి అరెస్ట్ అంశంలో సభలో చర్చకు పిలిచినా టిడిపి ఎందుకు రావడంలేదని అన్నారు. స్కిల్‌డెవలప్‌మెంట్ కేసులో తప్పు జరిగిందనే చర్చకు రాకుండా తెలుగుదేశం రచ్చ చేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో ప్రభుత్వ డబ్బును కాజేసేందుకే స్కిల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్‌ను ఏర్పాటు చేసినట్లు ఫైళ్లు నడిపిన తీరును చూస్తే అర్థం అవుతుందన్నారు. ఇందుకోసం గంటా సుబ్బారావు అనే ప్రైవేట్ వ్యక్తిని తెచ్చి ఎమ్‌డిగా పెట్టుకున్నారని తెలిపారు. సీమెన్స్‌తో చేసుకున్న అగ్రిమెంట్‌లో తేదీ కూడా లేదన్నారు. అగ్రిమెంట్ సీమెన్స్‌తో చేసుకుంటే నిధులను నేరుగా డిజైన్‌టెక్ అనే డొల్లకంపెనీకి విడుదల చేశారని తెలిపారు. అగ్రిమెంట్ ప్రకారం సీమెన్స్ కంపెనీ 90శాతం నిధులను ఖర్చు చేస్తే ప్రభుత్వం 10శాతం ఇవ్వాలని వుందన్నారు. అయితే సీమెన్స్‌నుండి ఒక్క పైసా రాకుండానే 2015-16లో రూ 371 కోట్లు డిజైన్‌టెక్‌కు రిలీజ్ చేశారని తెలిపారు. డిజైన్‌టెక్ అందులో నుండి రూ 58.9 కోట్లను సీమెన్స్‌కు బదిలీ చేసి రూ 241 కోట్లను షెల్ కంపెనీలకు మళ్లించారని అన్నారు. ఐటి శాఖ నోటీసుల ఆధారంగా చంద్రబాబునాయుడు పిఎ శ్రీనివాసరావుకు సిఐడి నోటీసు ఇస్తే మరుసటిరోజే విదేశాలకు పారిపోయారని అన్నారు. నైపుణ్యానికి సంబంధించిన స్కిల్స్ ఇంటర్‌నెట్‌లో ఉచితంగా లబిస్తాయని అలాంటివి పరిగణలోకి తీసుకోకుండా రూ 3,281కోట్లతో కట్టుకథలను తయారు చేసి రూ 371 కోట్ల ప్రజాధనాన్ని దోచుకున్నారని విమర్శించారు. . కేంద్రం కూడా చర్యలు తీసుకున్న ఈ కేసులో చంద్రబాబునాయుడు అరెస్ట్ చేయకుండా సన్మానాలు చేయాలా అని ప్రశ్నించారు.

విజనరీ కాదు ప్రిజనరీ : కన్నబాబు

చంద్రబాబు నాయుడు చట్టాలలో వున్న లొసుగులను అడ్డంపెట్టుకొని ఇన్నేళ్లూ తానో విజనరీ అంటూ తప్పించుకు తిరిగారని, చంద్రబాబునాయడు విజనరీ కాదు ప్రిజనరీ అని స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో తేలిందని వైసిపి ఎమ్మెల్యే కురసాల కన్నబాబు విమర్శించారు. శాసనసభలో స్కిల్‌డెవలప్‌మెంట్‌పై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. చంద్రబాబునాయుడి రాజకీయ జీవితం అంతా అవినీతిమయమేనని అన్నారు. ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికన దొంగ అని చంద్రన్న కానుకలో బెల్లం కొనుగోళ్లలోనూ అక్రమాలకు పాల్పడ్డారని విమర్శించారు. స్కిల్ డెవలప్‌మెంట్‌లో కేబినెట్‌లో తీర్మానించిందికాదని మరోలా ఒప్పందం చేసుకున్నారని అన్నారు. చంద్రబాబునాయుడు కేబినెట్‌ను కూడా తప్పుదోవ పట్టించారని అన్నారు. ఈ కేసులో ఇప్పటికే 10మందిని అరెస్ట్ చేసి 17 మంది వాంగ్మూలాలను రికార్డు చేశారని అన్నారు.

హవాలా ద్వారా డబ్బులు చేరాయి

- మాజీ మంత్రి పేర్ని నాని

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబునాయుడుకు హవాలా ద్వారా డబ్బులు ముట్టాయని వైసిపి ఎమ్మెల్యే పేర్ని నాని అన్నారు. సీమెన్స్‌తో ఒప్పందం జరిగితే డిజిటెక్‌కు ఎలా డబ్బులు చెల్లిస్తారని ప్రశ్నించారు. ఐఎఎస్ అధికారుల అభ్యంతరాలను ఏవి పరిగణలోకి తీసుకోలేదని అన్నారు. ఈ కేసులో నిబంధనల ప్రకారం నిధుల విడుదల జరగలేదని కోర్టుముందు వాంగ్మూలం ఇచ్చిన వారు ఇపుడు మాట మారుస్తున్నారని విమర్శించారు. ఈ కేసుతో తమకు సంబంధంలేదంటున్న చంద్రబాబునాయుడు 13 చోట్ల సంతకాలను చేశారని తెలిపారు.

అంధ ఉద్యోగులకు పరీక్షలు

- ప్రభుత్వం కీలక నిర్ణయం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

దృష్టిలోప వైకల్యం ఉన్న ఉద్యోగులకు ప్రభుత్వ నిబంధనలు, ఇతర అంశాలపై అవగాహన పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం బ్రెయిలీ లిపితో తయారుచేసిన పుస్తకాలను కూడా సిద్ధం చేసి వారికి అందించాలని నిర్ణయించింది. ఇదే సమయంలో వారికి శాఖాపరమైన (డిపార్ట్‌మెంటల్ ఎగ్జామ్స్) పరీక్షలు నిర్వహించాలని కూడా నిర్ణయించింది. రాష్ట్ర వ్యాప్తంగా అనేక శాఖల్లో పెద్ద సంఖ్యలోనే దృష్టిలోపం ఉన్న వికలాంగులు పనిచేస్తున్నారు. వారికి పదోన్నతులు కల్పించాలంటే ప్రభుత్వ పరిపాలనా నిబంధనలు అర్థం చేసుకోవడంలో ఇబ్బందులు నెలకొంటున్నాయి. ఈ నేపథ్యంలోనే వారికి బ్రెయిలీ లిపిలో నిబంధనల పుస్తకాలు అందించాలని నిర్ణయించారు. ఈ బాధ్యతలు అంగవికలురు సంక్షేమాన్ని కూడా చూసే మహిళా సంక్షేమ శాఖకు అప్పగించారు.

స్పీకరు పోడియం ముందు రెడ్ మార్క్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

శాసనసభలో సభ్యులు పదేపదే నిబంధనలు పాటించకుండా స్పీకరు పోడియంపైకి వస్తుండటంతో సభ్యులు ఎవరూ చొచ్చుకు రాకుండా రెడ్ మార్క్ వేశారు. శాసనసభ్యుల నిబంధనావళిలో ఈ అంశాన్ని చేరుస్తూ గత సమావేశాల్లో స్పీకరు తమ్మినేని సీతారాం తీసుకున్న నిర్ణయాన్ని ఈ సమావేశంలో అమలు చేస్తూ పోడియం ముందు రెడ్ మార్క్‌ను వేశారు. శాసనసభ్యులు ఎవరైనా రెడ్ మార్క్ దాటితే ఆటోమెటిక్‌గా చర్యలు తీసుకునేలా రూపొందించారు. అలాగే శాసనసభలో పనిచేసే ఉద్యోగులకు ప్రత్యేక డ్రెస్ కోడ్‌ను ఈ సమావేశాల్లో అమలు చేశారు. అందరూ విధిగా కోటు వేసుకుని వచ్చేలా చర్యలు తీసుకున్నారు.

మండలిలోనూ అదేతీరు

- విజిల్స్ వేసిన టిడిపి ఎమ్మెల్సీలు
- ముగ్గురిని సస్పెండ్ చేసిన చైర్మన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

శాసనమండలిలోను శుక్రవారం గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. అధికార, ప్రతిపక్ష సభ్యులు పోటాపోటీ నినాదాలు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి వ్యతిరేకంగా టిడిపి సభ్యులు నినాదాలు చేయగా, ప్రతిపక్షనేత చంద్రబాబు నాయుడుకు వ్యతిరేకంగా వైసిపి సభ్యులు నినాదాలు చేశారు. శుక్రవారం శాసనమండలి ప్రారంభమైన వెంటనే చంద్రబాబు నాయుడు అరెస్టుపై చర్చించాలని టిడిపి సభ్యులు చైర్మన్ మోషేన్‌రాజుకు వాయిదా తీర్మానం అందించారు. ఈ తీర్మానాన్ని తిరస్కరిస్తున్నట్లు చైర్మన్ ప్రకటించడంతో టిడిపి సభ్యులు ప్లకార్డులతో వెల్‌లో నుంచి చైర్మన్ పోడియంపైకి వెళ్లారు. చంద్రబాబును విడుదల చేయాలంటూ నినాదాలు చేశారు. సభలో గందరగోళం ఏర్పడంతో చైర్మన్ సభను కాసేపు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభం కాకముందే టిడిపి సభ్యులు చైర్మన్ పోడియం వద్దకు వెళ్లకుండా మార్షల్స్ అడ్డుగా నిలబడ్డారు. ప్రారంభం కాగానే చైర్మన్ వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించగా మార్షల్స్ నెట్టివేశారు. టిడిపి సభ్యులు వెంటతెచ్చుకున్న విజిల్స్‌ను ఊదారు. సభ్యుల ప్రవర్తన సరికాదని మంత్రులు అంబటి రాంబాబు, బొత్స సత్యనారాయణ అన్నారు. టిడిపి సభ్యులు అరాచకం సృష్టిస్తున్నారని, వీరిని సస్పెండ్ చేయాలని ప్రభుత్వ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు చైర్మన్‌ను కోరారు. ఈ సమయంలోనే వైసిపి సభ్యులు వారి స్థానాల వైపు వెనుక వరుసలో నిలబడి చంద్రబాబుకు వ్యతిరేకంగా ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేయడంతో గందరగోళం ఏర్పడింది. దీంతో చైర్మన్ మరోసారి సభను వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన తరువాత సభ సంప్రదాయాలు పాటించని సభ్యులను సస్పెండ్ చేయాలని మంత్రి ఆదిమూలపు సురేష్ ప్రతిపాదించారు. దీంతో టిడిపి సభ్యుడు శ్రీకాంత్‌ను సెషన్ మొత్తం, అనురాధా, బిటి నాయుడులను ఒక రోజు పాటు సస్పెండ్ చేస్తున్నట్లు చైర్మన్ ప్రకటించారు. అనంతరం మార్షల్స్ వారిని బలవంతంగా బయటకు తీసుకెళ్లారు.

పోలవరం నిర్వాసితులకు పరిహారం చెల్లించాలి

- పిడిఎఫ్ ఎమ్మెల్సీల డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మీడియాతో మాట్లాడుతున్న లక్ష్మణరావు, సాబ్జి, ఐవి, వర్మ

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల కుటుంబాలకు ఆర్‌ఆర్ ప్యాకేజీ కింద పరిహారం ఎప్పుడు చెల్లిస్తారో చెప్పాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీలు డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టు 41.15 మీటర్ల కాంటూర్ లెవల్ పరిధిలోకి వచ్చే నిర్వాసితులు, వారి గ్రామాల వివరాలు, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ వివరాలు చెప్పాలని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబును ఎమ్మెల్సీలు షేక్ సాబ్జీ, కెఎస్ లక్ష్మణరావు, ఇళ్ల వెంకటేశ్వరరావు శుక్రవారం శాసనమండలిలో కోరారు. ఈ సందర్భంగా సాబ్జీ మాట్లాడుతూ.. ప్రాజెక్టు ప్రారంభానికి ముందే నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ చెల్లించాల్సి ఉండగా జరగలేదన్నారు. రూ.35 వేలకోట్లు ఆర్‌అండ్‌ఆర్ కింద నిర్వాసితుల కుటుంబాలకు చెల్లించాల్సి ఉందన్నారు. కానీ ఇప్పటి వరకు కేవలం రూ.836.64 కోట్లు మాత్రమే ప్రభుత్వం చెల్లించిందన్నారు. ఇది కేవలం 2-3 శాతం కంటే మించి లేదన్నారు. 2025 డిసెంబరు నాటికి పోలవరం పూర్తిచేస్తామని మంత్రి చెబుతున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఈ ప్రాజెక్టుకు ఎంత చెల్లించింది? ఇందులో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద ఎంత? ఇంకా ఎంత చెల్లించాల్సి ఉంది? అని కోరారు. నిర్వాసితుల కుటుంబాలు ఎన్ని ఉన్నాయో చెప్పాలని, వీరికి పరిహారం ఎప్పుడు చెల్లిస్తారో చెప్పాలని కోరారు. గతేడాది వచ్చిన వరదలకు నిర్వాసితులు కొండ ప్రాంతాల్లో తలదాచుకున్నారని వివరించారు. 36 మీటర్లకే కుకునూరు మండలంలో రీహబిటేషన్ గ్రామాల్లో నీరు చేరిందని, ఇక మిగిలిన వారి పరిస్థితి ఎలా ఉంటుందో ఆలోచించాలని అన్నారు. అత్యంత ప్రాముఖ్యత అంశంగా ప్రభుత్వం భావించి నిర్వాసితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల సిపిఎం నిర్వహించిన పోలవరం పాదయాత్రలో తాము పాల్గొన్నామని లక్ష్మణరావు చెప్పారు. యాత్ర సందర్భంగా జలవనరులశాఖ మంత్రి విజయవాడలో, రాజమండ్రిలోనూ సమావేశం ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. నిర్వాసితులకు నష్టపరిహారం పొందే సమయంలో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. అధికారులు వారిని పదేపదే తిప్పుతున్నారని తెలిపారు. పరిహారం అందించేందుకు ప్రత్యేక యంత్రాంగం ఏర్పాటు చేయాలని కోరారు.

నిర్మాణంలోపు పరిహారం చెల్లింపు : మంత్రి అంబటి

41.15 లెవల్‌లో మునిగే గ్రామాలన్నిటికీ పరిహారం చెల్లించిన తరువాత ప్రాజెక్టులో నీటిని నింపుతామని జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. ఇది దశలవారీ జరుగుతుందని, ప్రాజెక్టు నిర్మాణంలోపు పూర్తవుతుందన్నారు. 41.15 మీటర్ల కంటే ముందే కొన్ని గ్రామాలు మునిగాయని చెబుతున్నారని, దీనిపై రైడర్ ద్వారా తాము శాస్త్రీయంగా సర్వే చేస్తున్నామని చెప్పారు. పాదయాత్ర నిర్వహించిన సందర్భంగా తమ దృష్టికి కొన్ని సమస్యలను తీసుకొచ్చారని, వీటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. 41.15 కింద లెవల్ కింద 20,946 నిర్వాసిత కుటుంబాలకు గానూ 14,418 కుటుంబాలకు రూ.836.64 కోట్లు చెల్లించామని చెప్పారు. 2025 డిసెంబరు నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తిచేసేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తుందన్నారు.

బాలకృష్ణపైనే వైసిపి గురి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో టిడిపిలో చురుకైన పాత్ర పోషిస్తున్న హిందూపురం శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణపై మంత్రులు, వైసిపి ఎమ్యెల్యేలు విమర్శల దాడిని పెంచారు. తొలిరోజు శాసనసభలో బాలకృష్ణ మంత్రులను చూసి మీసం తిప్పగా, రెండోరోజు విజిల్స్ ఊదారు. చంద్రబాబు అరెస్టు తరువాత నారా లోకేష్ ఢిల్లీ వెళ్లడంతో బాలకృష్ణ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఉంటూ ఎప్పటికప్పుడు పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. తద్వారా కేడర్‌లో నిరాశను పాగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. బాలకృష్ణతోపాటు ఎన్‌టిఆర్ కుటుంబ సభ్యులు కూడా ప్రస్తుతం పార్టీ సీనియర్ నాయకులతో నిత్యం జరిపే అంతర్గత చర్చల్లో పాల్గొంటున్నారు. మంగళగిరి కేంద్ర కార్యాలయం నుంచి నిర్వహించే రాజకీయ వ్యూహ కమిటీ చర్చల్లో బాలకృష్ణను సీనియర్ నేతలు ఎప్పటికప్పుడు సంప్రదించడం పార్టీలో ఆయన ప్రాధాన్యత పెరిగినట్టు అయింది. వైసిపి నిరంకుశంగా వ్యవహరిస్తోందని, ఇక మీదట తాము ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుంటామని బాలకృష్ణ ఇప్పటికే ప్రకటించారు. ఈ పరిణామాలను వైసిపి నేతలు నిశితంగా గమనిస్తున్నారు. రాజమండ్రిలో పవన్‌కల్యాణ్, లోకేష్‌తో కలిసి చంద్రబాబుతో ములాఖత్‌లో పాల్గొన్నప్పటి నుంచి గత పది రోజులుగా బాలకృష్ణ టిడిపిలో పూర్తిస్థాయిలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. సిఎం జగన్ లక్ష్యంగా బాలకృష్ణ కూడా విమర్శల దాడిని పెంచారు. పార్టీ కార్యకర్తలు మనోధైర్యం కోల్పోకుండా ఎన్‌టిఆర్ కుటుంబం మొత్తం పార్టీ నాయకులకు, కార్యకర్తలకు భరోసాగా నిలబడ్డారు. మరోవైపు రాజమండ్రిలో లోకేష్ భార్య బ్రాహ్మణి ప్రభుత్వంపై చేసిన విమర్శలపై కూడా పలువురు మంత్రులు ఎదురుదాడి చేశారు. మంత్రి అంబటి రాంబాబు, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డి బాలకృష్ణపై పలు విమర్శలు చేశారు. ప్రతిపక్ష నాయకుడిగా చంద్రబాబు కూర్చునే సీట్లో బాలకృష్ణ కూర్చోగా ఇదే అంశంపై మంత్రి అంబటి, బియ్యపు మధుసూదన్ రెడ్డి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. అంతేకాకుండా గతంలో బాలకృష్ణ.. సినీ నిర్మాత బెల్లంకొండ సురేష్‌పై కాల్పులు జరిపారని కూడా పేర్కొన్నారు. బాలకృష్ణకు మెంటల్ అని తమపైనా కాల్పులు జరుపుతారేమోనని మధుసూదన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కేవలం ప్రభుత్వంపై బురద జల్లడం కాదని, తన బావ తప్పు చేయలేదని బాలకృష్ణ అసెంబ్లీలో మాట్లాడలేదని మంత్రి రోజా ఎద్దేవా చేశారు. మీసం తిప్పడం కన్నా చర్చలో పాల్గొంటే బాగుండేదని అన్నారు. బాలకృష్ణ చంద్రబాబు కుర్చీలోనే కూర్చోవాలని తాము కోరుకుంటున్నామని, కానీ ఆయన విజిల్స్ వేసి సభను అవమానిస్తున్నారని మంత్రి అంబటి వ్యాఖ్యానించారు.

సిఎం కుటుంబానికి ప్రత్యేక భద్రత

- అసెంబ్లీలో బిల్లుకు ఆమోదం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రితోపాటు కుటుంబ సభ్యులకు పూర్తిస్థాయి రక్షణ కల్పించేందుకు శుక్రవారం రాష్ట్ర శాసనసభలో ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక భద్రతా బిల్లును ప్రవేశపెట్టారు. హోంశాఖ మంత్రి తానేటి వనిత ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక భద్రతా చట్టం-2023గా ఈ బిల్లును ప్రతిపాదించగా, సభ ఆమోదించింది. ఈ చట్టం మేరకు ముఖ్యమంత్రి కుబుంబ సభ్యులు అనగా భార్య, భర్త, పిల్లలు, తల్లిదండ్రులు వుంటారు. ఈ చట్టం మేరకు ఏర్పడే గ్రూప్‌కు ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక భద్రతా గ్రూప్ (ఎపిఎస్‌పిజి)గా పిలుస్తారు. ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులు ప్రయాణాల్లో వున్నా రక్షణ కల్పించేలా ఈ చట్టాన్ని రూపొందించారు. ఈ గ్రూప్ సభ్యుల శారీరక, మానసిక అంశాలపై ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చేలా ఈ బిల్లును రూపొందించారు.

వైద్యారోగ్యశాఖలో వైద్య విధాన పరిషత్తు విలీనం

ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక భద్రతా బిల్లుతోపాటు శాసనసభలో మరో రెండు బిల్లులను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్తు యాక్ట్-1986కు సవరణలు చేస్తూ వైద్యారోగ్యశాఖలోకి విలీనం చేసే బిల్లును వైద్యారోగ్యశాఖ మంత్రి విడదల రజనీ ప్రవేశపెట్టారు. ఈ బిల్లు ద్వారా ఎపి వైద్య విధాన పరిషత్తులోని ఉద్యోగులకు మరింత మేలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ ఆధార్ (టార్గెటెడ్ డెలివరీ ఆఫ్ ఫైనాన్షియల్ అండ్ అదర్ సబ్సిడీస్, బెనిఫిట్స్ అండ్ సర్వీసెస్) బిల్లును ఐటిశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ శాసనసభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లు వల్ల వ్యక్తుల గుర్తింపు కోసం ఆధార్ వినియోగంపై చట్టబద్ధత లభిస్తుంది.

టిడిపి హయాంలో స్కాంలపై చర్చిస్తాం

- పర్యాటకశాఖ మంత్రి ఆర్‌కె రోజా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి హయాంలో స్కిల్ డెవలప్‌మెంట్ స్కీం, తాత్కాలిక సచివాలయ భవన నిర్మాణం, రాజధాని రింగ్ రోడ్డు, చంద్రన్న తోఫాల్లో జరిగిన స్కాంలన్నిటిపైనా అసెంబ్లీ సమావేశాల్లో చర్చిస్తామని పర్యాటకశాఖ మంత్రి ఆర్‌కె రోజా అన్నారు. శుక్రవారం ఆమె మీడియాపాయింట్‌లో మాట్లాడుతూ.. ఈ స్కాంలపై చర్చించే ధైర్యం లేక టిడిపి సభ్యులు సభలో అల్లరి సృష్టించి బయటకు వెళ్లిపోయారన్నారు. బాలకృష్ణ దమ్ముంటే స్కిల్ స్కాంపై చర్చించేందుకు ముందుకు రావాలన్నారు. స్కిల్ స్కాంలో రాష్ట్ర ఖజానాకు కన్నంపెట్టిన చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు, యువతకు క్షమాపణ చెప్పాలన్నారు.

అసెంబ్లీలో టిడిపి వికృత చేష్టలు

- మంత్రి శ్రీనివాస వేణుగోపాలకృష్ణ

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును రక్షించుకునేందుకు అసెంబ్లీ నిబంధనలకు విరుద్ధంగా టిడిపి సభ్యులు విజిల్స్ వేస్తూ, వీడియోలు తీస్తూ వికృత చేష్టలకు పాల్పడ్డారని పౌర సంబంధాలశాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ విమర్శించారు. చంద్రబాబుకు కేటాయించిన సీటుపైకి ఎక్కి నిబంధనలకు విరుద్ధంగా బాలకృష్ణ నాట్యం చేస్తూ.. విజిల్స్ వేశారని, అచ్చెన్నాయుడు వీడియోలు తీశారని అన్నారు. చంద్రబాబుకు జైలులో హాని తలపెడతారని టిడిపి చేసే ఆరోపణల్లో వాస్తవం లేదని, చంద్రబాబుకు ఏ చిన్న హానీ జరిగినా లోకేష్‌కు, బాలకృష్ణకు మాత్రమే లాభం కలుగుతుందని అన్నారు.

చట్టసభలంటే టిడిపికి గౌరవం లేదు

- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

స్కిల్ స్కాంపై చర్చ ఉందని తెలిసి టిడిపి సభ్యులు సభలో రకరకాల విన్యాసాలు చేశారని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఆరోపించారు. స్కాంపై నోటితో సమాధానం చెప్పలేక విజిల్స్‌తో విన్యాసాలు చేసినా ప్రభుత్వం సంయమనం పాటించిందన్నారు.

తప్పు చేసినందునే పిటిషన్ కొట్టివేత

- విద్యాశాఖ మంత్రి బొత్స

తప్పు చేశారు కాబట్టే స్కిల్ స్కాంలో చంద్రబాబు క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసిందని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఈ స్కాంపై చర్చలో పాల్గొంటే దొరికిపోతామనే భయం టిడిపి నేతలను పట్టుకుందన్నారు. విలువైన సభా సమయాన్ని టిడిపి సభ్యులు వృథా చేశారన్నారు.

రాష్ట్ర ఖజానాను దోచేశారు

- ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

రాష్ట్ర ఖజానాను దోచిన దొంగ చంద్రబాబు అని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ విమర్శించారు. టిడిపి సభ్యులు శాసనసభ, శాసనమండలిలో ప్రజా సమస్యలపై చర్చించే అవకాశం లేకుండా రచ్చ చేశారన్నారు. ఈ స్కాంలో అరెస్టు చేస్తారనే భయంతోనే లోకేష్ ఢిల్లీ వెళ్లి దాక్కున్నారన్నారు. ఈ సందర్భంగా అధికార పార్టీ ఎమ్మెల్సీలు పివివి సూర్యనారాయణ, బి కళ్యాణ చక్రవర్తితో కలిసి చంద్రబాబు గజదొంగ నెంబరు 7691 ప్లకార్డులను ఆయన ప్రదర్శించారు. ఎమ్మెల్సీ పోతుల సునీత మాట్లాడుతూ.. చంద్రబాబు పాపం పండి జైలుకు వెళ్లారన్నారు. ఎమ్మెల్యే కిలారు రోశయ్య మాట్లాడుతూ.. టిడిపి నేతలు శాసనసభ, శాసనమండలి సభా సమయాన్ని వృథా చేశారని విమర్శించారు.

దేవాదాయ భూముల సంరక్షణకు కమిటీలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దేవాదాయశాఖ పరిధిలోని భూముల సంరక్షణతోపాటు హిందూ మత సంస్థల ఆధీనంలోని ఆస్తులను రక్షించడం, మెరుగైన నిర్వహణ కోసం ప్రభుత్వం రాష్ట్ర, జిల్లాస్థాయి భూ కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇందుకోసం జిఓ ఎంఎస్ నెంబరు 60ను సాధారణ పరిపాలనశాఖ విడుదల చేసినట్లు ప్రభుత్వం పేర్కొంది. రాష్ట్రస్థాయి కమిటీకి సిసిఎల్ఎ అధ్యక్షులుగా, సభ్య కన్వీనరుగా దేవాదాయశాఖ కమిషనరుతోపాటు సభ్యులుగా 9 మంది ఇతర ప్రభుత్వ అధికారులతో జిల్లాస్థాయి భూ కమిటీలను ఏర్పాటుచేశారు. దేవాదాయశాఖ రికార్డులను రెవెన్యూ రికార్డులతో అనుసంధానం చేస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. సంస్థల విలువైన భూముల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయబోతున్నట్లు దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. భూములను బహిరంగ వేలం ద్వారా లీజుకు ఇవ్వనున్నట్లు శుక్రవారం శాసనసభలో విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి అడిగిన ప్రశ్నకు ప్రభుత్వం సమాధానంగా చెప్పింది.

ఊరూరా కిడ్నీ బాధితులు

(మొదటి పేజీ తరువాయి)

ఫ్లోరిన్ బాధిత ప్రాంతాలకు సాగర్ నీటిని అందించాలని నాలుగు దశాబ్దాల క్రితం అధికారులు రూపొందించిన ప్రణాళికలు నేటికీ కార్యరూపం దాల్చలేదు. ఈ సమస్యపై కేంద్రానికి నివేదికలు వెళ్లినా ఫలితం లేకపోయింది. ప్రస్తుతం బబుల్ వాటర్ కొని తాగుతున్నా కిడ్నీ వ్యాధి అదుపులోకి రావడం లేదు. ఫ్లోరిన్‌ను ఫిల్టర్ చేసే యంత్రాలు ఇక్కడ లేవు. వాటిని పెట్టాలంటే భారీ ఖర్చుతో కూడుకుంది. సాగర్ నుంచి కొద్దిపాటి నీటిని కనిగిరి పట్టణానికి అధికారులు అందిస్తున్నారు.

బబుల్స్ నీరు తాగినా ఇదే పరిస్థితి

బోర్లలో నీటిని తాగడం వల్ల కిడ్నీల వ్యాధులు వస్తున్నందున గత ఐదారేళ్లుగా బబుల్స్ నీటిని తాగుతున్నారు. గ్రామాలకు వాహనాలు వచ్చి నీటిని అమ్ముతుంటాయి. ప్రతి ఇంటికీ రెండు, మూడు బబుల్స్ వేసుకుంటారు. వీటిని పాతిక రూపాయలకుపైగా పెట్టి కొంటున్నారు. ఈ నీరు తాగినా కిడ్నీ వ్యాధి తగ్గడం లేదు. అంటే, కొన్న నీటిలోనూ ఫ్లోరిన్ ఉంది. ఈ నీరు కూడా సమీపంలోని గ్రామాల నుంచే ప్లాంట్లు పెట్టి అమ్ముతున్నారు.

పిసిపల్లిలో 20 మంది బాధితులు

పిసిపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఫ్లోరిన్ మరింత ప్రమాదంగా మారింది. ఈ మండలంలోని ప్రతి గ్రామంలోనూ పది నుంచి 15 మంది వరకూ కిడ్నీ బాధితులు ప్రస్తుతం ఉన్నారు. పిసిపల్లిలో ప్రస్తుతం 20 మంది కిడ్నీ బాధితులు ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. పిసిపల్లి, మారెళ్ల, దివాకర్‌పల్లి, చెర్లోపల్లి, వరిమడుగు, వేపగంపల్లి, కొత్తపల్లి, గుంటుపల్లి తదితర గ్రామాల్లోని తాగు నీటిలో ప్రమాదకర మూలకాల ఎక్కువగా ఉన్నట్లు చెప్తున్నారు.

114 మంది రోగులు నమోదు

కనిగిరి ప్రాంత కిడ్నీ రోగులకు ఉచితంగా డయాలసిస్ చేసేందుకు ఇక్కడ కేంద్రాన్ని ప్రభుత్వం పెట్టింది. ఈ కేంద్రంలో ప్రస్తుతం 114 మంది రోగులు నమోదు చేసుకున్నారు. వీరికి అవసరమైనప్పుడు డయాలసిస్ చేస్తున్నారు. వంతుల వారీగా ఇక్కడ రోగులకు ఈ చికిత్స అందిస్తున్నారు.

మందులకు నెలకు రూ.5 వేలకు పైగానే..

డయాలసిస్ మాత్రం ఉచితంగా చేస్తున్నారు. నెలనెలా పరీక్షలు చేయించుకోవాలి. అందుకు ఒంగోలు వెళ్లాల్సి వస్తోంది. నెలకు పరీక్షలకు రూ.5 వేలు ఖర్చవుతోంది. మందులకు మరో రూ.నాలుగు వేలు కావాలి. నాకు కిడ్నీలో క్రియాటిన్ పది శాతం ఉంది. మందులు, పరీక్షలు ప్రభుత్వాస్పత్రిలో లేవు.

- కోటేశ్వరరావు, కిడ్నీ బాధితుడు, దివాకరపల్లె

ప్రాణాలు తోడేస్తుందయ్యా...

ఈ వ్యాధి కేవలం నీళ్ల వల్లనే వచ్చిందయ్యా. ప్రాణాలు తోడేస్తోంది. నిలుచున్నా కాళ్ల నొప్పులు. కిడ్నీల్లో క్రియాటిన్ శాతం 10.5 ఉంది. డయాలసిస్‌పైనే ఉన్నాను. సురక్షిత తాగునీరు అందిస్తే దీన్నుంచి బయటపడతాం.

- కొండయ్య, కిడ్నీ బాధితుడు, దివాకరపల్లె

మా ఇంట్లో ఇద్దరు చనిపోయారు

మా ఇంట్లో మా ఇద్దరు తమ్ముళ్లూ కిడ్నీ వ్యాధితో చనిపోయారు. ఇప్పుడు నాకూ ఈ వ్యాధి వచ్చింది. కుటుంబాల్లో ఏ పనులూ చేసుకోలేకపోతున్నాం. ఊరు వదిలిపోతే తప్ప, ప్రాణాలు నిలిచేలా లేవు. సాగర్ నీరు ఇస్తేనే ఈ సమస్యకు పరిష్కారం.

- పోలినేని మాలకొండయ్య, కిడ్నీ బాధితుడు, దివాకరపల్లె

వేడుకగా గరుడసేవ

ప్రజాశక్తి - తిరుమల

శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఐదోరోజు ఉదయం మోహినీ అలంకారంలోనూ, రాత్రి గరుడ వాహనంపై మలయప్పస్వామినూ సందర్శకులకు శ్రీవారు దర్శనమిచ్చారు. ఎక్కువగా తమిళ సందర్శకులు, తిరుపతి స్థానికులతోనే గరుడసేవ సందడి కనిపించింది. ఆశించిన మేర జనం రాలేదనే చర్చ జరిగింది. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, ఇఒ ఎవి ధర్మారెడ్డి, బోర్డు సభ్యులు యానాదయ్య, ఢిల్లీ స్థానిక సలహా మండలి అధ్యక్షులు వేమిరెడ్డి ప్రశాంతి, జెఇఒలు సదా భార్గవి, వీరబ్రహ్మం, సివిఎస్ఒ నరసింహ కిషోర్ పాల్గొన్నారు.

వాహన బేరర్లకు పంచెలు పంపిణీ

తమిళనాడుకు చెందిన దాత తంగదొరై రెండు లక్షల విలువైన 120 పంచెలను భూమన కరుణాకర్‌రెడ్డి, ధర్మారెడ్డి ద్వారా శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో సేవలందిస్తున్న వాహన బేరర్లు, మేళం సిబ్బందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, పేష్కార్ శ్రీహరి, పారుపత్తేదార్ తులసీప్రసాద్ పాల్గొన్నారు.

సదుపాయాలు పరిశీలన

గరుడసేవను చూడటానికి తిరుమల నాలుగు మాడ వీధుల్లో వేచి ఉన్న సందర్శకులకు కల్పిస్తున్న సదుపాయాలను ఇఒతో కలిసి టిటిడి చైర్మన్ పరిశీలించారు. ఆహారం పాలు, కాఫీ, టీ, తాగునీరు అందుతున్నాయా అని గ్యాలరీల్లోని సందర్శకులతో మాట్లాడారు. గ్యాలరీలో వేచి ఉండే ప్రతి సందర్శకునికీ గరుడ వాహనంపై ఉన్న మలయప్పస్వామివారి దర్శనం చేయించిన తరువాతే స్వామివారు ఆలయానికి వేంచేస్తారని తెలిపారు. దాదాపు 1500 మంది శ్రీవారి సేవకులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

విద్యుత్ భారాలపై పోరుకు సిద్ధం కండి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు
- రాష్ట్రాభివృద్ధికి బిజెపి అడ్డంకి
- 20 నుంచి 25 అసెంబ్లీ, 3 నుంచి 4 పార్లమెంట్ స్థానాలకు పోటీ

విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న వి శ్రీనివాసరావు, చిత్రంలో బాబూరావు

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు)

విద్యుత్ సర్దుబాటు పేరుతో ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారం, ప్రజా ఉద్యమాలపై నిర్బంధాన్ని నిరసిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో 27న రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల వద్ద చేపట్టనున్న ధర్నాలు, ఆందోళనలను జయప్రదం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కోరారు. గుంటూరు జిల్లా మంగళగిరి రత్నాల చెరువులో సిపిఎం విస్తృత సమావేశానికి హాజరైన ఆయన మీడియాతో మాట్లాడారు.విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తామని గత ఎన్నికల ముందు వైసిపి హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రభుత్వం వచ్చాక గత నాలుగు సంవత్సరాలుగా టారిఫ్ పెంపు, స్లాబుల మార్పిడి, ట్రూఅప్ ఛార్జీలు, విద్యుత్ సుంకం, సర్ ఛార్జీల ఇలా పలు రూపాల్లో ప్రజలపై రూ. వేలకోట్ల భారం మోపారని తెలిపారు. అదాని కోసమే రాష్ట్ర ప్రభుత్వం ఇది అంతా చేస్తోందని విమర్శించారు. టెక్నాలజీ పెరిగిన తరుణంలో యూనిట్ విద్యుత్ రూపాయికి అందించవచ్చని తెలిపారు. విద్యుత్ సమస్యలపై పోరాటానికి ప్రజలు సిద్ధం కావాలని కోరారు. మరోవైపు రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా నిర్బంధం పెరిగిందని, సమస్యల పరిష్కారం కోసం ఆందోళనలు చేయాలన్నా కోర్టు పర్మిషన్లు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అసెంబ్లీ జరుగుతున్నందున 25న అంగన్‌వాడీ ధర్నాకు అనుమతి ఇవ్వలేమని కోర్టు చెప్పడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. పార్లమెంటు జరిగే సమయంలో ఢిల్లీలో అనేక ఆందోళనలు చేశామని గుర్తు చేశారు. రాష్ట్రంలో వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు బిజెపితో అంటకాగుతూ రాష్ట్రానికి తీరని ద్రోహం చేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రం అభివృద్ధి చెందకపోవడానికి బిజెపినే కారణమన్నారు. మోడీ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అన్ని బిల్లులకు వైసిపి, టిడిపి మద్దతు తెలుపుతున్నాయని తెలిపారు. రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిన బిజెపి పట్ల వారి వైఖరి తెలియజేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా స్వతంత్రంగా ఎదగడానికి సిపిఎం కృషి చేస్తోందని అన్నారు. 20 నుండి 25 వరకు అసెంబ్లీ స్థానాలకు, మూడు లేదా నాలుగు పార్లమెంట్ స్థానాలకు పోటీ చేస్తామని తెలిపారు. ప్రజా ఉద్యమాల ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పనిచేస్తామని అన్నారు. వైసిపి టిడిపిలు రాష్ట్ర ప్రయోజనాల కోసం బిజెపిని విడిచి, రాష్ట్రాభివృద్ధి కొరకు పాటుపడాలని కోరారు.

విద్యారంగ సమస్యలపై 26న చలో కలెక్టరేట్ : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. ఈ నెల 26న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహించను న్నట్లు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ తెలిపింది. ఈ మేరకు విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కె ప్రసన్నకుమార్ శుక్రవారం పోస్టరును ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్రంలోని విద్యారంగ సమస్యలపై చర్చ జరపాలని డిమాండ్ చేశారు. ఇంటర్ విద్యార్థులకు ఇప్పటికీ పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలను అందించలేని స్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. సంక్షేమ వసతి గృహాలు సరిపడా లేవని, ఉన్నవాటిలో అరకొర వసతులే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చలో కలెక్టరేట్ కార్యక్రమంలో భాగంగా ప్రతి జిల్లాలో విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోపి, సిహెచ్ వెంకటేశ్వరరావు, నాయకులు మదన్ పాల్గొన్నారు.

353 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి - సీలేరు

గుట్టుచప్పుడు కాకుండా తరలుతున్న గంజాయిని అల్లూరి సీతారామరాజు జిల్లా పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ రామకృష్ణ కథనం ప్రకారం మహారాష్ట్రకు చెందిన కమరున్నీసా సికిందర్, సీలేరు పంచాయతీకి చెందిన కొర్ర జగ్గారావు, కొర్రా ధారబాబు, వంతల త్రినాధ, సీసా లైకాన్, ఒడిశా రాష్ట్రం మల్కనగిరి జిల్లా యువకుడు వెంకటేష్, చంద్రుపల్లికి చెందిన కిల్లో రాజు గంజాయి కొనుగోలు చేసి మైదాన ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో పోలీసులు సీలేరులోని టిఆర్‌సి క్యాంపు వద్ద తనిఖీలు చేపట్టారు. నిందితుల నుంచి సుమారు 353 కిలోల గంజాయి, టయోటా కారు, రూ.మూడు వేల నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కొర్రా ధారబాబు, కమరున్నీసా సికిందర్ పరారయ్యారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు గ్రాస్ శాలరీ అమలు

- ఎన్‌హెచ్‌ఎం జెఎసి రాష్ట్ర సమావేశం డిమాండ్

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో

ప్రభుత్వ ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు గ్రాస్ శాలరీ అమలు పరిశీలించాలని, ఈలోగా ఎంటిఎస్ అమలు చేయాలని ఎన్‌హెచ్‌ఎం జెఎసి తీర్మానించింది. ఎపి నేషనల్ హెల్త్ మిషన్ జాయింట్ యాక్షన్ కమిటీ (ఎన్‌హెచ్‌ఎం జెఎసి) రాష్ట్ర సమావేశం శుక్రవారం విజయవాడలో జరిగింది. హెచ్‌ఆర్ పాలసీ అమలు రెగ్యులర్ చేయాలని, ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ ప్రకారం ఎన్‌హెచ్‌ఎంలో అందించిన సేవలన్నిటినీ పరిగణనలోకి తీసుకుని ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని, వైద్యారోగ్యశాఖలోని ఇతర కాంట్రాక్టు ఉద్యోగులతో సమానంగా ఒకే కేడర్, ఒకే వేతనం అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని జెఎసి కోరింది. వీటితోపాటు మరో ఆరు అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని నేషనల్ హెల్త్ మిషన్ కమిషనర్‌కు లేఖ రాసింది. రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను ఢిల్లీ, హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్, అస్సాం, హర్యానా, ఒడిశా రాష్ట్రాల్లోలాగా రెగ్యులర్ చేయాలని పేర్కొంది. ముఖ్యమంత్రి హామీ మేరకు ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం, మినిమం టైం స్కేల్ అమలు చేయాలని తెలిపింది. 'జెఎసి ప్రతినిధులతో సంప్రదించి ఇచ్చిన జిఒ నెంబర్ 60 ప్రకారం వేతనాలు నవంబరు 2022 నుంచి ఎరియర్స్ చెల్లించాలి. హెచ్‌ఆర్ పాలసీ, హెల్త్ ఇన్సూరెన్స్, జనరల్ ఇన్సూరెన్స్ అమలు చేయాలి. కేంద్ర ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఎన్‌హెచ్‌ఎం సెల్, గ్రీవెన్స్ కమిటీలను రాష్ట్రంలో వెంటనే ఏర్పాటు చేయాలి. పరస్పర ఒప్పంద బదిలీలకు అవకాశం కల్పించాలి' అని కమిషనర్‌కు ఎన్‌హెచ్‌ఎం రాసిన లేఖలో పేర్కొంది. ఈ సమావేశంలో ఎపిఎఎస్‌జిసిఒఇఎఫ్ జెఎసి ఛైర్మన్ ఎవి నాగేశ్వరరావు, ఎన్‌హెచ్‌ఎం జెఎసి ఛైర్‌పర్సన్ దయామణి, కన్వీనర్ సిహెచ్ ప్రభాకరరెడ్డి, కోశాధికారి జి సింహాచలం పాల్గొన్నారు.

మతోన్మాద ప్రభుత్వాన్ని గద్దెదించాలి

- 29న విజయవాడలో మహాధర్నా
- దళిత రక్షణ యాత్రలో శివనాగరాణి

ప్రజాశక్తి - పశ్చిమగోదారి యంత్రాంగం

నరసాపురం సభలో ప్రసంగిస్తున్న శివనాగరాణి

మతోన్మాద విధానాల ను నిరసిస్తూ ఈ నెల 29న విజయవాడలో చేపట్టనున్న మహా ధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహిళా కన్వీనర్ వి.శివనాగరాణి కోరారు. కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పశ్చిమగోదావరి జిల్లాలో చేపట్టిన దళిత రక్షణ యాత్ర రెండో రోజు శుక్రవారం భీమవరం రూరల్, నరసాపురం, యలమంచిలి, పాలకొల్లు మండలాల మీదుగా సాగింది. యలమంచిలి మండలం చించినాడలో మహాధర్నా వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వి.శివనాగరాణి మాట్లాడుతూ... ప్రజల మధ్య అసమానతలు సృష్టిస్తూ రాజకీయాలు చేస్తోన్న బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించాలన్నారు. రాష్ట్రంలో అసైన్డ్ భూముల చట్టాన్ని సవరించి పేదల చేతుల్లో ఉన్న భూములను లాగేసుకుంటున్నారని విమర్శించారు. గ్రామాల్లో పనుల్లేక వ్యవసాయ కార్మికులు వలసలు వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మిగులు భూములను దళితులకు పంచాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బత్తుల విజయకుమార్, కె.క్రాంతిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాతిరెడ్డి జార్జి, జక్కంశెట్టి సత్యనారాయణ, జిల్లా నాయకులు కౌరు పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌పై కేంద్రం కుట్రలను ప్రతిఘటించాలి

కొనసాగిన ఉక్కు రక్షణ బైక్ యాత్ర

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై కేంద్రం పన్నుతోన్న కుట్రలను ప్రతి ఒక్కరూ ప్రతిఘటించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం కోరారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం సిపిఎం చేపట్టిన ఉక్కు రక్షణ బైక్ యాత్ర శ్రీకాకుళం జిల్లాలో కొనసాగింది. రెండో రోజు శుక్రవారం శ్రీకాకుళం నగరం, నరసన్నపేట, టెక్కలి, పలాస, సోంపేట ప్రాంతాల్లో సాగింది. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ.. ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలకమైన ఉక్కు పరిశ్రమను మోడీ సర్కార్ ప్రయివేటీకరణ చేయాలని చూస్తోందని తెలిపారు. విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించకుండా అన్యాయంగా వ్యవహరిస్తోందన్నారు. స్టీల్‌ప్లాంట్ విషయంలో బిజెపి దుర్మార్గంగా వ్యవహరిస్తోన్నా రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన పార్టీ నోరెత్తకపోవడం సరికాదన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో ఒకరినొకరు దూషించుకుంటూ సమయాన్ని వృథా చేస్తున్న అధికార, ప్రతిపక్ష పార్టీలకు స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ అంశంపై మాట్లాడటానికి తీరిక లేకుండా పోయిందని దుయ్యబట్టారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా మూడు సంవత్సరాలుగా పోరాడుతున్నా రాష్ట్ర ఎంపిలు పార్లమెంట్‌లో ప్రస్తావించకపోవడం దారుణమన్నారు. నరసన్నపేటలో నిర్వహించిన సభలో ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ ఎ.అజశర్మ మాట్లాడుతూ విద్యార్థులకు ఉద్యోగాలు, సామాజిక న్యాయం దక్కాలంటే విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాల్సిన అవసరముందని పేర్కొన్నారు. ఇందుకోసం అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు పోరాటాలు చేయాలని కోరారు. బైక్ యాత్రలో భాగంగా తొలుత శ్రీకాకుళంలో అంబేద్కర్ విగ్రహానికి, డే అండ్ నైట్ కూడలిలో సర్దార్ గౌత్ లచ్చన్న విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. టెక్కలిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు బైక్ యాత్రకు స్వాగతం పలికారు. బైక్ యాత్ర సాగిన ప్రాంతాల్లో ప్రజా, కార్మిక, రైతు, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు. యాత్రలో సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.జగన్, శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ఎస్ఐ పరీక్షలకు గడువు పొడిగించండి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎస్ఐ పోస్టుల భర్తీకి అక్టోబరు 14, 15 తేదీల్లో జరిగే మెయిన్స్ పరీక్షల గడువును పొడిగించాలని డివైఎఫ్ఐ కోరింది. అభ్యర్థులు సన్నద్ధం అయ్యేందుకు సమయం సరిపోదని పేర్కొంది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ పోలీస్ రిక్రూట్‌మెంటు బోర్డు ఛైర్మన్ అతుల్ సింగ్‌కు శుక్రవారం డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి రామన్న, ఉపాధ్యక్షులు ఎన్ నాగేశ్వరరావు, నాయకులు పి కృష్ణ, గణేష్ వినతిపత్రం అందజేశారు. దేహదారుఢ్య, శారీరక సామర్థ్య పరీక్షలు ఈ నెల చివరి వరకూ వున్నందున వారు మెయిన్స్ పరీక్షలకు సరిగ్గా సిద్ధం కాలేరని తెలిపారు. పరీక్ష రాసేందుకు తక్కువ సమయం వున్నందున సమయాన్ని పెంచాలని కోరారు. 2016 నోటిఫికేషన్‌లో దేహదారుఢ్య పరీక్షల తర్వాత మెయిన్స్‌కు రెండు నెలలు గడువు వుండేదని, ఇప్పుడు కనీసంగా మూడు నెలల గడువు ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు.

ఆర్థిక వ్యవస్థ పురోగతిలో

ఎంఎస్‌ఎంఇలదే కీలకపాత్ర

ఫ్యాప్సీ సదస్సులో వక్తలు

సదస్సులో మాట్లాడుతున్న మెర్సీ ఎపాఓ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

దేశ ఆర్థిక వ్యవస్థ పురోగతిలో ఎంఎస్‌ఎంఇలదే కీలకపాత్ర అని కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థల మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ మెర్సీ ఎపాఓ వెల్లడించారు. విశాఖలోని దసపల్లా హోటల్‌లో ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫ్యాప్సీ) ఆధ్వర్యంలో షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్‌పై అంతర్జాతీయ సదస్సు శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంఎస్‌ఎంఇలకు బ్యాంకర్ల రుణ మద్దతు లభిస్తే జిడిపిపై ఆ ప్రభావం ఉంటుందన్నారు. ఎగుమతులు, దిగుమతుల పరిమాణం పెరిగి ఉపాధి చేకూరుతుందని తెలిపారు. ఎంఎస్‌ఎంఇ ఔత్సాహికులకు బ్యాంకుల రుణాలు, సాంకేతిక సహకారం, మౌలిక వసతులు, నైపుణ్య శిక్షణ, మార్కెట్ సహకారం లభిస్తే ఆర్థిక వ్యవస్థపై మంచి ప్రభావం ఉంటుందని వెల్లడించారు. జిడిపి వృద్ధి చెందుతుందని తెలిపారు. నేషనల్ అసోసియేషన్ ఆఫ్ కంటైనర్ ఫ్రైట్ స్టేషన్ ఉపాధ్యక్షులు, శ్రావణ్ షిప్పింగ్ సర్వీసెస్ ఎమ్‌డి జి.సాంబశివరావు మాట్లాడుతూ విశాఖ వంటి చోట్ల అద్భుతమైన అభివృద్ధికి అవకాశాలున్నాయన్నారు.

రోడ్డు, రైల్వే, ఎయిర్‌వే కనెక్టివిటీ, ఇతర సామర్థ్యాలను ఆధునీకరించుకుని వ్యయ ప్రభావాలను తగ్గించుకునే మౌలిక వసతులకు ప్రాధాన్యమివ్వాలన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా కస్టమ్స్ ప్రొసీజర్స్ డిజిటల్ డాక్యుమెంటేషన్ పెంచాల్సి ఉందని పేర్కొన్నారు. ఫ్యాప్సీ అధ్యక్షులు కరేణేంద్ర ఎస్ జాస్తి మాట్లాడుతూ ఎపి తీర ప్రాంతం వ్యూహాత్మక వ్యాపారానికి కీలకంగా ఉందన్నారు. ఎగుమతుల వ్యాపారానికి లాజిస్టిక్స్ అత్యంత ముఖ్యమని తెలిపారు. 2023 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర సరుకుల ఎగుమతులు 19.32 బిలియన్ డాలర్లకు చేరుకోవడంలో సముద్ర ఉత్పత్తుల వ్యాపారం తోడ్పడిందన్నారు. ఉపాధ్యక్షులు కంకటాల మల్లికార్జునరావు మాట్లాడుతూ షిప్పింగ్, లాజిస్టిక్స్ రంగాన్ని మరింత ఉన్నత స్థాయికి చేర్చేందుకు వ్యూహాత్మక ప్రణాళికలు రూపొందించాల్సి ఉందని పేర్కొన్నారు. ఎపి మారిటైం బోర్డు డిప్యూటీ సిఇఒ లెఫ్టినెంట్ బిఎం రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. పరిశ్రమలకు, వ్యాపారులకు తమ సహకారం ఉంటుందన్నారు. సదస్సులో జెఎస్‌డబ్ల్యు ఇండస్ట్రియల్ పార్క్ లిమిటెడ్ సిఇఒ ఆర్.కనకారావు పాల్గొన్నారు.

కర్నూలులో లోగోను ఆవిష్కరిస్తున్న వెంకటేశ్వర్లు,తదితరులు

ఎన్‌ఇపిని రద్దు చేయాలి

- జాతాలో యుటిఎఫ్ నాయకులు
- కర్నూలులో గోల్డెన్ జూబ్లీ లోగో ఆవిష్కరణ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్, విజయనగరం టౌన్

ప్రభుత్వ విద్యారంగాన్ని భ్రష్టుపట్టించే జాతీయ నూతన విద్యావిధానం (ఎన్‌ఇపి)ను రద్దు చేయాలని యుటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. అనంతపురం జిల్లా నుంచి ప్రారంభమైన జాతా కర్నూలు, ఇచ్ఛాపురం నుంచి ప్రారంభమైన జాతా పార్వతీపురం మన్యం మీదుగా విజయనగరం జిల్లాలో కొనసాగింది. అక్టోబర్ 1న విజయవాడలో జరిగే యుటిఎఫ్ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను పురస్కరించుకొని కర్నూలు సి.క్యాంపులో ఉత్సవాల లోగోను ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు, రాష్ట్ర సహాధ్యక్షులు కె. సురేష్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి ఎన్.నాగమణి ఆవిష్కరించారు. ఆ సంఘం జిల్లా పూర్వ అధ్యక్షులు జి.పుల్లయ్య జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. సిపిఎస్‌ను రద్దుచేసి ఉద్యోగ ఉపాధ్యాయులకు ఒపిఎస్ విధానాన్ని అమలు చేయాలని, నూతన విద్యా విధానాన్ని కూడా రాష్ట్రంలో అమలు చేయవద్దని డిమాండ్ చేశారు. రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి నాగమణి, కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎం.జయరాజు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. పత్తికొండ, కోడుమూరు మీదుగా నంద్యాలలోకి జాతా ప్రవేశించింది.

శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో ప్రారంభమైన యాత్ర పార్వతీపురం మన్యం జిల్లాలోని సీతంపేట మండలంలోకి ప్రవేశించింది. పార్వతీపురం మీదుగా విజయనగరం జిల్లాలో బొబ్బిలి, గజపతినగరం, విజయనగరానికి చేరుకుంది. ఆయా కేంద్రాల్లో ఏర్పాటుచేసిన సభలనుద్దేశించి యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడారు. మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన జాతీయ విద్యావిధానాన్ని బిజెపి పాలిత రాష్ట్రాల్లో అమలు చేయకపోయినా, ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేయడమేమిటని ప్రశ్నించారు. విద్యారంగంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో పేద విద్యార్థులు విద్యకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. సిపిఎస్ రద్దు చేస్తామని హామీనిచ్చిన సిఎం జగన్‌మోహన్‌రెడ్డి.. జిపిఎస్‌అమలుకు పూనుకోవడం దారుణమన్నారు. ఎన్‌ఇపి రద్దు కోసం, ఒపిఎస్ సాధనకు, విద్యారంగ సంస్కరణలకు వ్యతిరేకంగా పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు.

రాజకీయంగా ఎదుర్కోలేకే కేసులు

- మాజీ మంత్రులు కాలవ శ్రీనివాసులు, అఖిల ప్రియ

ప్రజాశక్తి-రాయదుర్గం, నంద్యాల కలెక్టరేట్

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జైలు నుంచి విడుదలయ్యే వరకు నిరవధిక నిరాహార దీక్షను కొనసాగిస్తామని మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు, మాజీ మంత్రి భూమా అఖిల ప్రియ తెలిపారు. అనంతపురం జిల్లా రాయదుర్గం పట్టణంలోని ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద శుక్రవారం కాలవ శ్రీనివాసులు దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబును అంతం చేసేందుకు సిఎం జగన్ కుట్ర పన్నారని ఆరోపించారు. రాజకీయంగా టిడిపిని ఎదుర్కొనలేక కేసులు బనాయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నంద్యాలలో అఖిల ప్రియ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష రెండో రోజుకు చేరుకుంది. ఈ దీక్షలకు టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు కోట్ల జయసూర్యప్రకాశ్ రెడ్డి, మాజీ మంత్రి ఏరాసు ప్రతాప్‌రెడ్డి తదితరులు దీక్షలకు సంఘీభావం తెలిపారు. కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ.. చంద్రబాబు నాయుడుకు, లోకేష్‌కు ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకనే చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయించారని విమర్శించారు. చంద్రబాబు నాయుడును జైలు నుంచి విడుదల చేసేంత వరకు నిరవధిక నిరాహార దీక్ష కొనసాగిస్తామని తెలిపారు.

వివేకా హత్యకేసు విచారణ అక్టోబర్ 4కు వాయిదా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు విచారణ వచ్చే నెల నాలుగుకు వాయిదా పడింది. కేసు విచారణ సందర్భంగా శుక్రవారం నాంపల్లిలోని సిబిఐ కోర్టుకు ఎంపి అవినాష్‌రెడ్డితో సహ మిగతా నిందితులు హాజరయ్యారు. నిందితుల హాజరు నమోదు చేసిన న్యాయమూర్తి.. కేసు తదుపరి విచారణను అక్టోబర్ నాలుగుకు వాయిదా వేశారు. కాగా, ఇదే కేసులో ఎస్కార్ట్ బెయిల్ పొందిన నిందితుడు వైఎస్ భాస్కర్‌రెడ్డి చంచల్‌గూడ జైలు నుంచి శుక్రవారం విడుదలయ్యారు. అనారోగ్య కారణాల దృష్ట్యా ఆయనకు సిబిఐ కోర్టు 12 రోజులపాటు బెయిల్ మంజూరు చేసింది. హైదరాబాద్ విడిచి వెళ్లవద్దని షరతు విధించిన సంగతి తెలిసిందే. జైలు నుంచి విడుదలైన అనంతరం భాస్కర్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి గచ్చిబౌలిలోని ఎఐజి ఆస్పత్రికి వెళ్లారు.

నిరవధిక సమ్మెకు సిద్ధం

- మున్సిపల్ కార్మికులను వెంటనే పర్మినెంటు చేయాలి
- శ్రామిక మహిళా రాష్ట్ర కన్వీనరు ధనలక్ష్మి

ప్రజాశకి-అమరావతి బ్యూరో

మున్సిపల్ కార్మికులను పర్మినెంటు చేస్తామని, సమాన పనికి సమాన వేతనం చెల్లిస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీల సాధన కోసం నిరవధిక సమ్మెకు మున్సిపల్ కార్మికులు సిద్ధపడుతున్నారని శ్రామిక మహిళా రాష్ట్ర కన్వీనరు కె ధనలక్ష్మి తెలిపారు. శుక్రవారం విజయవాడ ధర్నా చౌక్‌లో మున్సిపల్ కార్మికులు రెండోరోజు రిలే నిరాహార దీక్షలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఉద్యోగులు, కార్మికులతో తమ ప్రభుత్వం స్నేహపూర్వకంగా ఉంటుందని చెప్పిన జగన్ ఆచరణలో అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఉమమహేశ్వరరావు మాట్లాడుతూ.. అసెంబ్లీ సమావేశాలను ప్రజా సమస్యలకు వేదికలుగా కాకుండా, వ్యక్తిగత ధూషణలకు నిలయాలుగా మార్చి రూ.కోట్లలో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారన్నారు. అవుట్‌సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంటు చేయాలని డిమాండ్ చేశారు.

మున్సిపాల్టీల్లో క్లాప్ ఆటోలు కాంట్రాక్టు వ్యవస్థను ప్రవేశపెట్టి క్లాప్ డ్రైవర్లకు కేవలం రూ.9 వేల నుంచి రూ.13 వేలు మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. ఫెడరేషన్ కోశాధికారి ఎస్ జ్యోతిబసు మాట్లాడుతూ.. కార్మికులకు వసతులు, సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. రిలే దీక్షల్లో రాష్ట్ర నాయకులు టి తిరుపతమ్మ, గార్లపాటి లక్ష్మి, ఎ జాన్‌బాబు, చంద్రకళ, కె వెంగమ్మ, సరళ, విజయలక్ష్మి, రాజు, బాలరాజు, వరమ్మ, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు సైకత శిల్పం ఏర్పాటుపై కేసు నమోదు

ప్రజాశక్తి-బాపట్ల

చంద్రబాబు సైకత శిల్పం ఏర్పాటుపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా తెలుగుదేశం పార్టీ బాపట్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వేగేశన నరేంద్రవర్మ ఆధ్వర్యంలో బాపట్ల జిల్లాలోని పాండురంగాపురం సముద్రతీరంలో సైకత శిల్పం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.. దీనిపై నరేంద్రవర్మతోపాటు మరో 14 మంది టిడిపి నేతలు, కళాకారులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎఎస్ఐ కె.శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రబాబు నాయుడు అరెస్టు నేపథ్యంలో 30 సెక్షన్ అమలులో ఉన్నందున సైకత శిల్పం ఏర్పాటు చేసినందుకు టిడిపి నేతలపై 188, 143, ఆర్/డబ్ల్యూ149 సెక్షన్ల కింద కేసులు నమోదు చేశామన్నారు. ఈ కేసుకు సంబంధించి మరికొంతమందిపై కేసు నమోదు చేస్తామని తెలిపారు.

సిపిఎం ఖండన

చంద్రబాబు సైకత శిల్పం ఏర్పాటు చేశారని కొంతమంది కళాకారులపై బాపట్ల పోలీసులు కేసులు పెట్టడాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య శుక్రవారం ఒక ప్రకటనలో ఖండించారు. ఈ చర్య భావ ప్రకటనా స్వేచ్ఛను హరించడమేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఉద్యమాలను అణచివేసే నిరంకుశ వైఖరిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. వెంటనే కేసులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

సంపాదకీయం

నీట్ ప్రహసనం

మెరిట్‌తో పనేంటి? మనీ ఉంటే చాలంటోంది కేంద్ర ప్రభుత్వం. దేశంలో వైద్య విద్య పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష (ఎన్ఇఇటి-నీట్) కటాఫ్ మార్కులను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇటీవల సున్నాకు తగ్గించేసింది. దీనినే జీరో పర్సంటైల్ కటాఫ్ అంటున్నారు. ఇందుకు సంబంధించి మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ (ఎంసిసి) ఈ నెల 20న ఒక నోటిఫికేషన్ జారీ చేసింది. జీరో పర్సంట్ కటాఫ్ అంటే నీట్ పిజి పరీక్షలో మైనస్ 40 మార్కులు వచ్చిన అభ్యర్థి కూడా ట్యూషన్ ఫీజు చెల్లించి ప్రయివేటు వైద్య కళాశాలలో విద్యార్థిగా చేరిపోయి..వైద్య వృత్తిలోకి ప్రవేశం పొందవచ్చు. ట్యూషన్ ఫీజుగా కోట్ల రూపాయలు కుమ్మరించేవారికే సీటు దక్కుతుంది. అంటే వైద్య విద్యను గంపగుత్తగా కోటీశ్వరులకు రిజర్వ్ చేయడమే. సున్నా మార్కులు వచ్చినా సీటు ఇచ్చేస్తే ప్రవేశ పరీక్షలను, ప్రతిభావంతులైన విద్యార్థులను అవమానించడం కాదా? ఇది వైద్య విద్యను పూర్తిగా వ్యాపారమయం చేయడం కాదా? అంటూ వైద్య విద్యార్థులు, వైద్యులతో పాటు వైద్యారోగ్య రంగానికి సంబంధించిన సమస్త భాగస్వామ్య పక్షాలు సంధిస్తున్న ప్రశ్నాస్త్రాలకు కేంద్రం నుంచి బదులు రావడం లేదు. బడుగు, బలహీన తరగతులకు రిజర్వేషన్లను పటిష్టంగా అమల్జేయాలంటూ ఉద్యమిస్తే.. ఆధిపత్య సామాజిక తరగతులకు చెందిన కొందరు పాలకపక్ష నేతలు, కార్పొరేట్ అనుకూల మేధావులు అక్కసు వెళ్లగక్కేదేమిటి? 'ఉన్నత విద్యల్లో రిజర్వేషన్లు ఏంటండి? మెరికల్లాంటి ప్రతిభావంతులైన విద్యార్థులకే ప్రవేశాలు కల్పించాలి. అప్పుడే మేధో సమాజం తయారవుతుంది' అంటూ గొంతు చించుకునే వాదనలు పదేపదే వింటుంటాం. ఆ అపర మేధావులెవ్వరూ ఇప్పుడు నోరు మెదపడం లేదు. మోడీ సర్కార్ నిర్ణయం ఎవరి ప్రయోజనాల కోసమో వీరి మౌనమే తేల్చిపారేస్తోంది.

వైద్య విద్యను వ్యాపారంగా మార్చేసి పేదలను ఉన్నత చదువులకు దూరం చేసే నయవంచక విధానాల పరంపరే మోడీ సర్కార్ తాజా ఎత్తుగడ. ప్రయివేటు వైద్య విద్యా కళాశాలల్లో ప్రవేశాలను ఇష్టారాజ్యం చేసిన కేంద్రం తాజా నిర్ణయంతో మరింత దోపిడికి లాకులు ఎత్తింది. నిర్దిష్ట కటాఫ్ విధించకుండా కౌన్సిలింగ్‌కు అనుమతిస్తే దేశంలో వైద్య విద్య కోటీశ్వరులకే పరిమితమై పేద, మధ్య తరగతి ప్రజలకు పూర్తిగా దూరమైపోవడం ఖాయం. ఇదే జరిగితే దాని ప్రభావం ప్రజారోగ్యంపైనా పడుతుంది. ఆరోగ్య సంరక్షణ రంగంలో నాణ్యతా ప్రమాణాలు పడిపోతాయి. వైద్య విద్య పిజి కోర్సులకు రూ.కోట్లాది సొమ్ము ధారపోస్తే ఆ సొమ్మునంతా తిరిగి ప్రజల నుంచే పిండుకుండారు. దేశ వైద్యారోగ్య రంగాన్ని మోడీ సర్కార్ తీసుకున్న ఇలాంటి వినాశకర విధానాలు నిర్వీర్యం చేస్తాయి.

వైద్య విద్యలో ఎంబిబిఎస్ తర్వాత పిజి కోర్సులకు నీట్ తప్పనిసరి. నీట్‌లో అర్హత సాధించడం ఆషామాషీ కాదు. ప్రత్యేక శిక్షణ కేంద్రాల్లో రూ.లక్షలు ధారపోసి నిద్రాహారాలు మాని అహర్నిశలు అకుంఠిత దీక్షతో ప్రయత్నిస్తే కానీ ఉత్తీర్ణత సాధించడం కష్టం. హిందీ, ఆంగ్ల మాధ్యమాల్లోనే నిర్వహిస్తుండటంతో దక్షిణాది ప్రాంత విద్యార్థులకు అన్యాయం జరుగుతోందంటూ తమిళనాడు తదితర రాష్ట్రాల పోరాటం కూడా ఈ సందర్భంగా ప్రస్తావనార్హం. మరోవైపు విదేశాల్లో గ్రాడ్యుయేషన్ చేసినవారి కోసం నీట్ తరహాలోనే ఎఫ్ఎంజిఇ రాయడం తప్పనిసరి. దేశంలో వైద్య వృత్తిని చేపట్టాలన్నా, పిజి కోర్సుల్లో ప్రవేశించాలన్నా విదేశీ గ్రాడ్యుయేషన్ పొందినవారికి ఎంఎఫ్‌జిఇలో 50 శాతం కటాఫ్ మార్కులు తప్పనిసరి. ప్రతి యేటా ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తున్నవారి సంఖ్య తగ్గిపోతోంది. కేవలం 10 శాతం మాత్రమే గట్టెక్కుతున్నారు. నీట్ కటాఫ్‌ను జీరో పర్సంటైల్ చేయడం అంతే సమానమైన ఎఫ్ఎంజిఇకి 50 శాతం కటాఫ్ కొనసాగించడం అక్షరాలా వివక్షాపూరితమనే వాదన కూడా వినిపిస్తోంది. వినాశకర సంస్కరణల విషయంలో మోడీ సర్కార్‌ను అనుసరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం కూడా వైద్య విద్య కోర్సుల్లో సెల్ఫ్ ఫైనాన్సింగ్‌కు సీట్లను రిజర్వు చేసి పేద విద్యార్థుల ఆశలపై నీళ్లు కుమ్మరించింది. వైద్య విద్యా రంగాన్ని పూర్తిగా గందరగోళంలోకి నెట్టేసి కార్పొరేట్ వైద్య విద్యా సంస్థల దోపిడికి ఊడిగం చేసే ఇలాంటి వినాశకర విధానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే వెనక్కి తీసుకోవాలి.

పాబ్లో నెరుడా 50వ వర్ధంతి నేడు

ఆఖరు క్షణం వరకూ తనను వేటాడిన సామ్రాజ్యవాదులు కూడా అంగీకరించక తప్పని అత్యున్నత విశ్వ విప్లవ కవితా శిఖరం పాబ్లో నెరుడా. కొన్ని తరాలుగా ఆయన పేరు వినని నిజమైన సాహితీ ప్రియులు గాని, ప్రగతిశీల వాదులు గాని వుండరంటే అతిశయోక్తి కాదు. ఇప్పటికీ విశ్వ సాహితీ వీధుల్లో అత్యంత ప్రసిద్ధుడు ఆయనే. కేవలం కవిగానే గాక శాంతి యోధుడుగా సామ్యవాద మేధావిగా, కమ్యూనిస్టు నేతగా, దౌత్యవేత్తగా, ప్రజా ప్రతినిధిగా, సామ్రాజ్యవాదంపైనా చిలీ సైనిక నియంతృత్వంపైన కడదాకా పోరాడిన యోధుడుగా నెరుడాతో పోల్చదగిన మహావ్యక్తులు చాలా అరుదు.

మోడీ పాలనలో తగ్గిన ఎగుమతులు!

విశ్లేషణ

ఎం. కోటేశ్వరరావు

ప్రపంచంలో మాంద్యం కారణంగా భారత ఎగుమతులు తగ్గాయి అన్నది ఒక విశ్లేషణ. మన ఎగుమతులు సంగతి ఎలా ఉన్నా దిగుమతులు పెరగటం మన ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా ఉంది అనేందుకు నిదర్శనం కాదా అని కేంద్ర మంత్రులు, బిజెపి నేతలు మనల్ని నిలదీస్తారు. అంతే కాదు ప్రపంచ దేశాల్లో 2022 సౌదీ అరేబియా తప్ప జి-20 దేశాల్లో 6.7 శాతంతో మన దేశమే అగ్రస్థానంలో ఉంది. మరి అలాంటపుడు మన దిగుమతులు కూడా ఎందుకు తగ్గినట్లు? తాజాగా వాణిజ్య మంత్రిత్వశాఖ కార్యదర్శి సునీల్ బరత్వాల్ వెల్లడించిన సమాచారం ప్రకారం వర్తమాన ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు మన ఎగుమతులు 11.9 శాతం తగ్గి 172.95 బిలియన్ డాలర్లుండగా మన దిగుమతులు 12 శాతం తగ్గి 271.83 బి.డాలర్లుగా ఉన్నాయి. గత ఏడాదితో పోల్చితే మన వాణిజ్య లోటు 112.85 నుంచి 98.88 బి.డాలర్లకు తగ్గింది. అంటే పద్నాలుగు బిలియన్ డాలర్ల మేర మన విదేశీమారక ద్రవ్యం మిగిలింది. కానీ సెప్టెంబరు 16వ తేదీ సమాచారం ప్రకారం గడచిన పదకొండు వారాలలో ఐదు బిలియన్ డాలర్లు తగ్గి మన నిల్వలు 593,9 బి.డాలర్లకు చేరాయి.

గుజరాత్ తరహాలో దేశమంతటినీ అభివృద్ధి చేస్తామన్నారు. నల్లధనాన్ని వెలికి తీసి ఆర్థిక వ్యవస్థను పటిష్టపరుస్తామని చెప్పారు. ఎగుమతులతో చైనాను వెనక్కు నెట్టేసేందుకు గాను మేడిన్ ఇండియా, మేకిన్ ఇండియా, ఆత్మనిర్భరత పథకాలను ప్రకటించారు. పరిస్థితి ఇంకా దిగజారింది తప్ప మెరుగుపడలేదు. కొన్ని సంక్షేమ కార్యక్రమాలు తప్ప కేంద్రం ప్రకటించిన ఆర్థిక విధానాలనే రాష్ట్రాలు అమలు జరుపుతున్నాయి. మెజారిటీ రాష్ట్రాలు బిజెపి ఏలుబడిలోనే కొనసాగుతున్నాయి. గ్లోబల్ ఫైనాన్స్ అనే పత్రికలో 2023 జూన్ ఎనిమిదవ తేదీన ప్రచురించిన ఒక విశ్లేషణ ప్రకారం 2018 నుంచి 2022 వరకు ఐదు సంవత్సరాల కాలంలో మన సగటు వృద్ధి రేటు 4.1 శాతం కాగా, దిగజారిందీ, తీవ్ర ఆర్థిక సమస్యలతో ఉందని చెబుతున్న చైనాలో 5.5 శాతం ఉంది. వికీపీడియా సమాచారం ప్రకారం 2022లో ఎగుమతులలో ప్రథమ స్థానంలో ఉన్న చైనా వస్తు, సేవల విలువ 3,71,582.7 కోట్ల డాలర్లు కాగా, అమెరికా 3,01,185.9 కోట్లతో రెండవ స్థానంలో ఉంది. మన దేశం 76,771.7 కోట్లతో పదవ స్థానంలో ఉంది. పదిహేనవదిగా ఉన్న హాంకాంగ్ ఎగుమతుల విలువ 69,829.3 కోట్ల డాలర్లు. చైనా తన ఉత్పత్తులు కొన్నింటిని హాంకాంగ్ పేరుతో ఎగుమతి చేస్తున్న సంగతి బహిరంగమే. ప్రపంచ జిడిపిలో దేశాన్ని నరేంద్రమోడీ ఐదవ స్థానంలోకి తీసుకుపోయినట్లు ఉబ్బి తబ్బిబ్బు అవుతున్నవారు ఎగుమతుల్లో ఎందుకు తీసుకుపోలేదన్నది ప్రశ్న. ప్రపంచబ్యాంకు విశ్లేషణ ప్రకారం 2004లో యుపిఎ అధికారంలోకి వచ్చినపుడు మన జిడిపిలో వస్తు, సేవల ఎగుమతుల విలువ 17.9 శాతం కాగా 2013 నాటికి 25.3కు పెరిగింది. మరుసటి ఏడు 23 శాతంగా ఉంది. నరేంద్ర మోడీ అధికారానికి వచ్చిన తరువాత అది క్రమంగా తగ్గుతూ 2019లో 18.7కు దిగజారింది. తరువాత 2022లో 22.4 శాతం ఉంది. 1960 నుంచి 1990 వరకు మన జిడిపిలో ఎగుమతుల విలువ 4.5 నుంచి 7.1 శాతం మధ్య ఉంది. నూతన ఆర్థిక సంస్కరణల పేరుతో ఆర్థిక విధానాల్లో మార్పుల తరువాత అది 1998 నాటికి 11 శాతానికి చేరింది. బిజెపి నేత అటల్ బిహారీ వాజ్‌పేయి అధికారంలో ఉన్న 1998-2004 కాలంలో పైన చెప్పుకున్నట్లు 17.9 శాతానికి పెరిగింది. నరేంద్ర మోడీ ఏలుబడిలోనే తొలిసారిగా పదేళ్ల కాలంలో పతనమైంది. ఎగుమతులను పెంచేందుకు ప్రతి దేశమూ చర్యలు తీసుకుంటున్నపుడు మన కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్నవాటిని తప్పు పట్టాల్సిన అవసరం లేదు. ఒక నిర్దిష్ట విధానం, నిలకడ, స్పష్టత లేని, సరైనవి కాని విధానాలను అమలు జరిపినపుడు అవి జయప్రదం కావు. మన దేశంలో జరిగిందీ, జరుగుతున్నదీ అదే. జనానికి ఏం చెప్పారు, ఆచరణలో ఏం చేస్తున్నారన్నదే ప్రశ్న.

> గుజరాత్ తరహాలో దేశమంతటినీ అభివృద్ధి చేస్తామన్నారు. నల్లధనాన్ని వెలికి తీసి ఆర్థిక వ్యవస్థను పటిష్టపరుస్తామని చెప్పారు. ఎగుమతులతో చైనాను వెనక్కు నెట్టేసేందుకు గాను మేడిన్ ఇండియా, మేకిన్ ఇండియా, ఆత్మనిర్భరత పథకాలను ప్రకటించారు. పరిస్థితి ఇంకా దిగజారింది తప్ప మెరుగుపడలేదు. గ్లోబల్ ఫైనాన్స్ అనే పత్రికలో 2023 జూన్ ఎనిమిదవ తేదీన ప్రచురించిన ఒక విశ్లేషణ ప్రకారం 2018 నుంచి 2022 వరకు ఐదు సంవత్సరాల కాలంలో మన సగటు వృద్ధి రేటు 4.1 శాతం కాగా, దిగజారిందీ, తీవ్ర ఆర్థిక సమస్యలతో ఉందని చెబుతున్న చైనాలో 5.5 శాతం ఉంది. వికీపీడియా సమాచారం ప్రకారం 2022లో ఎగుమతులలో ప్రథమ స్థానంలో ఉన్న చైనా వస్తు, సేవల విలువ 3,71,582.7 కోట్ల డాలర్లు కాగా, అమెరికా 3,01,185.9 కోట్లతో రెండవ స్థానంలో ఉంది. మన దేశం 76,771.7 కోట్లతో పదవ స్థానంలో ఉంది.

చైనాతో సరిహద్దు ఉన్న గాల్వన్ లోయలో 2020లో జరిగిన ఉదంతంలో మన సైనికుల మీద చైనా మిలిటరీ దాడి చేసి చంపినదానికి ప్రతీకారం అంటూ నాడు చైనా యాప్‌ల మీద నిషేధం, చైనా నుంచి పెట్టుబడులు రాకుండా ఆంక్షల విధింపు హడావుడి చేసిన అంశాన్ని గుర్తుకు తెచ్చుకోవాలి. దాంతో అనేక మంది చైనా ఉత్పత్తులు బహిష్కరిస్తే అది మన కాళ్ల దగ్గరకు వస్తుందని, నరేంద్ర మోడీ అందుకు సమర్ధులని ప్రచార ఆర్భాటం చేశారు. సరిహద్దు వివాదం, 1962లో యుద్ధం జరిగినప్పటికీ తరువాత కాలంలో రెండు దేశాలూ వివాదాలకు దౌత్య సంబంధాలకు, వాణిజ్యానికి ముడి పెట్టకూడదన్న అవగాహనకు వచ్చాయి. దాని ఫలితం, పర్యవసానమే నరేంద్ర మోడీ-సీ జిన్‌పింగ్ ఇద్దరూ కలసి ఊహాన్-మహాబలిపురాల్లో ఉయ్యాలలూగేందుకు దోహదం చేసింది. గాల్వన్ ఉదంతాలు తీవ్ర విచారకరమైనవి. కానీ వాటికి-వాణిజ్యానికి లంకె పెట్టి హడావుడి చేసిన పెద్దలు ఇప్పుడు గుట్టుచప్పుడు కాకుండా తమ మాటలను తామే దిగమింగి పెద్ద ప్రచారం లేకుండా చైనా సంస్థలకు తిరిగి స్వాగతం పలుకుతున్నారు. ఇది రక్షణకు ముప్పు లేదని అంగీకరించటమే కదా ! మన దేశంతో సరిహద్దులు కలిగి ఉన్న దేశాల నుంచి వచ్చే పెట్టుబడులకు కేంద్ర ప్రభుత్వ అనుమతిని తప్పనిసరి చేస్తూ కేంద్రం నిర్ణయించింది. చైనా మినహా మిగిలిన దేశాలన్నీ మన నుంచి పెట్టుబడులను తీసుకొనేవే తప్ప పెట్టుబడులు పెట్టే సత్తా వాటికి లేదన్నది తెలిసిందే. అందుకే ఆ నిబంధన చైనాను కట్టడి చేసేందుకే అన్నది స్పష్టం.

మన దేశంలో షియోమీ ఫోన్లను సరఫరా చేసే డిక్సన్ టెక్నాలజీస్ భాగస్వామ్యంతో సెల్ ఫోన్ అసెంబ్లింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు ముందుకు పోతున్నట్లు బ్లూమ్‌బెర్గ్ న్యూస్ తెలిపింది. నాలుగు వందల కోట్ల రూపాయల పెట్టుబడితో రానున్న మూడు సం

వత్సరాల్లో మూడు లక్షల చదరపు అడుగుల్లో స్మార్ట్ ఫోన్ల యూనిట్‌ను అభివృద్ధి చేయనున్నట్లు, వచ్చే నెలలో ప్రారంభించనట్లు వార్తలో పేర్కొన్నారు. ఇదే విధంగా మన దేశంలోని అప్టిమస్ ఎలక్ట్రానిక్స్ సంస్థకు బ్లూటూత్ నెక్‌బాండ్ ఇయర్ ఫోన్ల తయారీ కాంట్రాక్టును కూడా అదే కంపెనీ అప్పగించింది. ఇటీవలి కాలంలో షియోమీ కంపెనీ మీద విధించిన ఆంక్షలు, ఇతర కారణాలతో మన దేశంలో దాని ఉత్పత్తుల విక్రయం తగ్గింది. ఈ ఒప్పందాలతో ఆటంకాలను అధిగమించి తిరిగి మార్కెట్ వాటాను పెంచుకోవచ్చని భావిస్తున్నారు. చట్టబద్దంగా, మన చట్టాలకు అనుగుణంగా పని చేసే చైనాతో సహా ఏ దేశానికి చెందిన ఏ సంస్థనైనా అనుమతిస్తామని ఐటి, ఎలక్ట్రానిక్స్ కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. చైనా సరఫరా వ్యవస్థ నుంచి వైదొలగాలని అమెరికా, ఇతర ఐరోపా దేశాల గీతానికి మన దేశం కోరస్‌గా గొంతు కలిపింది. అయితే చైనా మీద ఆధారపడకుండా మనుగడ కష్టమని గడచిన మూడు సంవత్సరాల అనుభవతత్వం బోధపడటం, మన దేశంలోని కార్పొరేట్ సంస్థల ఒత్తిడి, ఇతర దేశాలకు చెందిన కంపెనీలు ముందుకు రాకపోవటం, చైనా నుంచి కంపెనీలు వియత్నాంలో తమ కార్యకలాపాలను విస్తరించేందుకు పూనుకోవటం వంటి పరిణామాలతో చైనా కంపెనీల గురించి కేంద్ర ప్రభుత్వం వైఖరిని మార్చుకోవాల్సి వచ్చిందన్నది స్పష్టం.

ప్రతి దేశం తన స్వంత పరిశ్రమలు, వాణిజ్యాన్ని కాపాడుకొనేందుకు రక్షణాత్మక చర్యలు తీసుకుంటున్నది. దానికి మన దేశం కూడా మినహాయింపు కాదు. నరేంద్రమోడీ సర్కారు కూడా ఆర్థిక ఆయుధాలను ప్రయోగించి పరీక్షిస్తున్నది. చైనా విషయంలో అవి పని చేయటం లేదన్నది గత పది సంవత్సరాల అనుభవం చెబుతున్నది.

మార్కెట్లో చైనా ఆధిపత్యాన్ని తగ్గించేందుకు ఉత్పాదక ఎగుమతి బోనస్‌గా చెల్లించేందుకు కేంద్ర ప్రభుత్వం 33 బిలియన్ డాలర్లను పక్కన పెట్టి ఒక పథకాన్ని రూపొందించింది. అందుకోసం పద్నాలుగు రంగాలను గుర్తించింది, వాటిలో ఎక్కువగా చైనా కంపెనీల ఆధిపత్యమే కొనసాగుతున్నది. చివరకు ఇప్పుడు ఆ చైనా కంపెనీల పెట్టుబడులకే అనుమతులు ఇచ్చి ఉత్పత్తులు చేయించేందుకు, సబ్సిడీలు ఇచ్చి ఎగుమతు చేయించేందుకు పూనుకుంది. స్థానిక కంపెనీలతో కలసి సంయుక్త సంస్థలను ఏర్పాటు చేయాలనే షరతు విధించింది. గతంలో నిషేధం విధించిన షి ఇన్ కంపెనీ మన అంబానీ రిలయన్స్‌తో ఒప్పందం చేసుకోవటంతో కేంద్ర ప్రభుత్వం దానికి అనుమతించింది. ఎందుకు అంటే సదరు కంపెనీ ఇప్పుడు సింగపూర్‌లో ఉందని చెబుతున్నారు. ఎక్కడున్నా అది చైనా కంపెనీయే, లాభాలు వెళ్లేది చైనాకే కదా!

గతేడాది మన దేశం దిగుమతి చేసుకున్న ఉక్కు ఉత్పత్తుల్లో జూన్ నెలలో చైనా నుంచి 26.1, వియత్నాం నుంచి ఒక శాతం ఉండగా ఈ ఏడాది జూన్ నాటికి అవి 37.1, 4.8 శాతాలకు పెరిగాయి. చైనా ఉక్కు ఉత్పత్తుల దిగుమతి కారణంగా తమకు నష్టం జరుగుతోందని అందువలన వాటి మీద సబ్సిడీ వ్యతిరేక పన్ను విధించాలని మన ఉత్పత్తిదారులు చేసిన వినతిని కేంద్ర ప్రభుత్వం ఇటీవలనే తిరస్కరించింది. దానికి తగిన ఆధారాలు లేవంది. ఇది చైనాను ప్రసన్నం చేసుకొనే చర్యగా ఆ రంగానికి చెందినవారు భావిస్తున్నారు. రాజకీయం, వివాదాస్పదం చేయటం, తిరిగి అదే చైనాకు అనుమతులు ఇవ్వటమెందుకు అంటారా! ఇవ్వకుంటే కార్పొరేట్ల లాభాలకు గండి పడుతుంది, అప్పుడు వాటి కన్నెర్రకు గురికావాల్సి వస్తుంది, చివరికి అధికారానికే ఎసరు వస్తుంది గనుక! ★

అక్రమంగా జైళ్లలో మగ్గుతున్న వారి మాటేమిటి?

విమర్శ

ఆర్. రఘు

ఎ.పి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రస్తుతం రాజమండ్రి సెంట్రల్ జైల్లో వున్నారు. గత కొద్ది నెలల క్రితం తమిళనాడు మంత్రి సెంథిల్ బాలాజీ, అంతకుముందు ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా కూడా జైలుకు వెళ్లారు. తెలంగాణలో ముఖ్యమంత్రి కుమార్తె, ఎమ్మెల్సీ కవిత విషయంలోనూ అరెస్టు హైడ్రామా నడుస్తోంది. నిజానికి ఇటువంటి రాజకీయ కక్షలు, కేసులు పెట్టుకోవడం, కోర్టుల చుట్టూ తిప్పడం, మన దేశానికి, రాష్ట్రానికి కొత్తేమీ కాదు. అధికారంలో ఉన్న పార్టీలు ప్రతిపక్షాలలో ఉన్న ప్రముఖ నాయకుల మీద కేసులు పెట్టడం, కేంద్రంలో అధికారంలోకి వచ్చిన వారు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నవారిపై లేక ప్రధాన ప్రత్యర్థులుగా ఉన్న పార్టీల నాయకులపై తమ చేతుల్లో ఉన్న నిఘా సంస్థల ద్వారా కేసులు పెట్టడం కూడా గతంలో చూశాం. అయితే కేంద్ర బిజెపి సర్కారు పాలనలో ఇది మరింత తీవ్రంగా వుంది. కేంద్రంలో బిజెపి ప్రభుత్వానికి లొంగిపోతే ఫర్వాలేదు. కాని ఏమాత్రం వ్యతిరేకంగా వున్నా వారిపై ఇ.డి, సిబిఐ, ఐ.టి...ఇలా ఎన్నో దాడులు. నయా ఉదారవాద విధానాలు వచ్చాక పొలిటీషియన్-బ్యూరోక్రాట్-క్యాపిటలిస్టుల మధ్య విడదీయరాని బంధం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రత్యర్థులను వేటాడడానికి, లొంగదీసుకోవడానికీ బిజెపి పాలకులు కేంద్ర దర్యాప్తు సంస్థలను యథేచ్ఛగా వాడుకుంటున్నారు. ఏది ఏమైనా ఏ కేసులూ (లాలూ ప్రసాద్ యాదవ్ వంటివి తప్ప) దాదాపు నిలబడవు. అసలు కేసులే ఏళ్ల తరబడి నడుస్తుంటాయి. తీర్పులు వచ్చే నాటికి పరిస్థితి మారిపోతుంది. వాటిపై ప్రజల ఆసక్తి తగ్గిపోతుంది.

రాజ్యం నిజ స్వరూపం

ఈ గందరగోళం మధ్య రాజ్యం నిజ స్వరూపం తెలుసుకోవడం కష్టం. పాలక పార్టీల కోరిక, ప్రయత్నం కూడా అదే. ఈ క్రమంలో చట్టాల గురించి, న్యాయస్థానాల గురించి మధ్యతరగతి, ఉన్నత వర్గాలలో పెద్ద చర్చే జరుగుతుంటుంది. తప్పు చేసిన వాడు ఎన్నటికీ తప్పించుకోలేడని, చట్టం ముందు అందరూ సమానులేనని, కింది కోర్టులో కాకపోతే పైకోర్టులో తప్పక న్యాయం జరుగుతుందని, న్యాయస్థానాలు స్వతంత్రంగా వ్యవహరిస్తుంటాయని, రాజకీయ ప్రలోభాలకు లోనుకావని... ఇలా అనేక వాదనలు ముందుకు తేబడుతూ ఉంటాయి. రాజ్యం యొక్క అసలు వర్గ స్వభావం గురించి చర్చ కనపడనివ్వరు. ఈ రోజు భారతదేశంలో కనీసం ఒక వంద మంది ప్రముఖులు-న్యాయవాదులు, సామాజిక కార్యకర్తలు, పత్రిక విలేకరులు, సాంఘిక మాధ్యమంలో ప్రముఖులు, కార్మిక నాయకులు, విద్యార్థి నాయకులు, కవులు, రచయితలు, కళాకారులు వంటి వారు-ఏళ్ల తరబడి జైళ్లలో మగ్గుతున్నారు. 90 శాతం వికలాంగుడైన ప్రొఫెసర్ సాయిబాబా, ప్రముఖ న్యాయవాది సుధా భరద్వాజ్, కవి రచయిత వరవరరావు, విద్యావేత్త స్వయానా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ మనవడు ఆనంద్ తెల్తుంబ్డే, రోనా విల్సన్, గౌతమ్ నవలఖ, సాగర్ గోర్కే, మీరన్ హైదర్ వంటి వారి మీద పెట్టిన కేసులు చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. ఇక్కడే రాజ్యం పక్షపాత వైఖరి అర్థమవుతుంది. ప్రభుత్వాలను కూలదోసేవారుగా, ప్రజాస్వామ్య యుతంగా ఎన్నుకోబడ్డ ప్రభుత్వాలను తుపాకీతో స్వాధీనం చేసుకుంటారని వారిపై ప్రధాన అభియోగం. రాజకీయ నాయకుల మీద పెట్టిన అభియోగాలు వేల కోట్ల రూపాయల ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేశారని. కానీ అణగారిన, దళిత, గిరిజన, మైనారిటీ, మహిళల గురించి మాట్లాడే వాళ్లు, రాసేవాళ్లు, పాడేవాళ్లు, ఉద్యమించే వాళ్లు మాత్రం ప్రభుత్వాన్ని కూలదోయటానికి కుట్రలు చేసేవారుగా రాజ్యం ముద్ర వేస్తుంటుంది.

> 90 శాతం వికలాంగుడైన ప్రొఫెసర్ సాయిబాబా, ప్రముఖ న్యాయవాది సుధా భరద్వాజ్, కవి రచయిత వరవరరావు, విద్యావేత్త స్వయానా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ మనవడు ఆనంద్ తెల్తుంబ్డే, రోనా విల్సన్, గౌతమ్ నవలఖ, సాగర్ గోర్కే, మీరన్ హైదర్ వంటి వారి మీద పెట్టిన కేసులు చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. ఇక్కడే రాజ్యం పక్షపాత వైఖరి అర్థమవుతుంది. ప్రభుత్వాలను కూలదోసేవారుగా, ప్రజాస్వామ్యయుతంగా ఎన్నుకోబడ్డ ప్రభుత్వాలను తుపాకీతో స్వాధీనం చేసుకుంటారని వారిపై ప్రధాన అభియోగం. రాజకీయ నాయకుల మీద పెట్టిన అభియోగాలు వేల కోట్ల రూపాయల ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేశారని.

బిజెపి అధికారంలోకి వచ్చిన అనంతరం ఏడేళ్లలో 'ఉపా' చట్టం కింద అరెస్టు చేయబడ్డవారు 10,552 మంది. ఇందులో దోషులుగా కోర్టులు నిర్ధారించింది కేవలం 98 మందిని మాత్రమే. కానీ వేలాదిమంది బెయిల్ రాక నెలలు, సంవత్సరాలు జైళ్లలో మగ్గారు, ఇంకా మగ్గుతున్నారు. మహమ్మద్ ఇలియాస్, మహమ్మద్ ఇర్ఫాన్ ఇద్దరు 30 ఏళ్ల యువకులు. వీరికి లష్కర్ ఏ తోయిబా అనే ఉగ్రవాద సంస్థతో సంబంధాలు ఉన్నాయని మహారాష్ట్ర యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ 2012లో అరెస్టు చేసింది. తొమ్మిదేళ్ల తర్వాత విచారణలో వారికి అటువంటి సంబంధాలు ఏమీ లేవని తేల్చి విడుదల చేసింది. అలాగే మహమ్మద్ అమీర్ ఖాన్ అనే ఢిల్లీ యువకుడిని పాకిస్తాన్ ఏజెంట్ అని ముద్రవేసి 23 సంవత్సరాలు జైల్లో పెట్టి చివరికి నిర్దోషి అని విడుదల చేసింది. ఇలా అనేకమంది యువకులను బిజెపి పాలిత రాష్ట్రాలలో కానీ, మరీ ముఖ్యంగా జమ్మూ కాశ్మీర్లో కానీ తల తోక లేని కేసులు పెట్టడం, ఏళ్ల తరబడి బెయిల్ ఇవ్వకుండా, అసలు విచారణే లేకుండా జైల్లో దుర్భరమైన పరిస్థితులకు వారి జీవితాలకు బలి చేయడం ఒక ధోరణిగా సాగుతున్నది. విలువైన వారి యవ్వన జీవితమంతా నాశనం చేయబడుతున్నది. కానీ వారి గురించి చర్చ ఎక్కడా కనపడదు. అలాగే పాత్రికేయులు కూడా అన్యాయంగా బలవుతున్నారు. ఉత్తరప్రదేశ్‌లో ఆ ప్రభుత్వం, పోలీస్ శాఖ ఒక దళిత మహిళను అంతం చేసిన తీరును కవర్ చేసినందుకు సిద్ధికి కప్పన్ ఎంత భయానకమైన పరిస్థితిని ఎదుర్కొనేలా చేసిందో మనం చూస్తున్నాం. ఇదంతా చూస్తుంటే ఆర్థిక నేరగాళ్లకు, అందులో వారు పాలక వర్గాల మనుషులైతే వారిని రాజ్యం చూసే తీరుకు, ప్రభుత్వం మీద అణగారిన ప్రజల కోసం, సాంఘిక న్యాయం కోసం, లౌకిక తత్వాన్ని కాపాడటం కోసం, పోరాడే ఉద్యమకారులను పరిగణించే తీరుకు ఉన్న తేడా విదితమవుతుంది. రాజ్యం వర్గ ధోరణిని వ్యక్తం చేస్తుంది.

చట్టం కొందరికి చుట్టమే...

ఈ చట్టం ఎవరికీ చుట్టం కాదు అనేది ఒక నానుడి మాత్రమే. పాలక పార్టీలు తిట్టుకోవడానికి ఉపయోగ పడే నినాదం మాత్రమే. చట్టం లేక రాజ్యం పాలకవర్గానికి కచ్చితంగా చుట్టమేనని దేశంలో జరుగుతున్న పై వివరాలను బట్టి అర్థం చేసుకోవచ్చు. 'ఉపా' చట్టం పరిధిలో 2019లో 1948 మందిని అరెస్టు చేస్తే శిక్ష పడింది 34 మందికే. 2020లో 1321 మందికి అరెస్టు చేస్తే 80 మందికి మాత్రమే శిక్ష పడింది. 2021 లో 1621 మందిని అరెస్టు చేస్తే కేవలం 62 మందికి మాత్రమే శిక్ష పడింది. 2022-23 సంవత్సరాలలో కూడా బహుశా ఇదే ధోరణి కొనసాగుతూ ఉన్నది. 2019లో విచారణ పెండింగ్‌లో ఉన్న 2224 మందిలో 238 మంది మూడు నుండి ఆరు నెలల మధ్య జైళ్లలో ఉన్నారు. మూడు నుండి ఐదు సంవత్సరాల మధ్య 416 మంది, ఒకటి నుండి మూడు సంవత్స రాల మధ్య దాదాపు 1200 మంది జైళ్లల్లో ఉన్నారు. అదే 2021 నాటికి విచారణ ఎదుర్కొంటున్న 2,800 మందిలో మూడేళ్లకు పైగా జైల్లో ఉన్నవారు 1113 మంది. చట్టం పాలకుల చుట్టమేనని పదే పదే నిరూపితం అవుతున్నది.

/ వ్యాసకర్త సిపియం కృష్ణా జిల్లా పూర్వ కార్యదర్శి,
సెల్: 9490098422 /

సందర్భం

భారతీయ సైన్ లాంగ్వేజ్ అభివృద్ధి ఎప్పుడు?

సెప్టెంబర్ 23 అంతర్జాతీయ సైన్ లాంగ్వేజ్ డే. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా 7.2 కోట్ల మంది బధిరులు ఉన్నారు. 80 శాతం మంది అభివృద్ధి చెందిన దేశాల నుంచే వున్నారు. అంతర్జాతీయంగా 300 కంటే ఎక్కువ సైన్ లాంగ్వేజ్‌లు ఉన్నాయి. కేవలం 2 శాతం మంది సైగల భాష ఉపయోగిస్తున్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో బధిరులు సైతం సకలాంగులతో సమానంగా పోటీ పడుతున్నారు. ఒకప్పుడు సమాజంలో చులకనగా, హేళనగా చూడబడిన చెవిటి వారు... అంతర్జాతీయంగా వినికిడి విజ్ఞానం అభివృద్ధి కావడంతో అన్ని రంగాల్లోనూ ముందుకు వెళు తున్నారు.

మన దేశంలో ప్రత్యేక పాఠశాలల ఏర్పాటు పట్ల నిర్లక్ష్యం ఉంది. ఇప్పటికీ అమెరికన్ సైన్ లాంగ్వేజ్‌నే మన దేశంలో వినియోగిస్తున్నారు. ప్రపంచంలో అనేక దేశాలు స్వతహాగా తమ జాతీయ స్థాయిలో సైగల భాషను అభివృద్ధి చేసుకున్నాయి. 76 ఏళ్ల స్వాతంత్ర్య భారత దేశంలో మాత్రం ఇతర దేశాల సైగల భాషపై ఆధారపడడం బధిరుల విద్య పట్ల మన పాలకులకున్న చిత్తశుద్ధికి నిదర్శనం. 2021 ఆగష్టులో మన దేశ సైగల భాషను అధికారికంగా గుర్తిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటికైనా మన సైన్ లాంగ్వేజ్‌ను అభివృద్ధి చేయడంపై పాలకులు శ్రద్ధ పెట్టాలి. అనేక దేశాల్లో బధిరుల కోసం ప్రాథమిక విద్య నుండి యూనివర్శిటీ చదువుల వరకు సైగల భాష లోనే బోధిస్తున్నారు. మన దేశంలో ప్రభుత్వ రంగంలో బధిరులు చదువుకునేందుకు విద్యాసంస్థలు తగినన్ని లేవు. సాధారణ పాఠశాలల్లో ప్రత్యేక ఉపాధ్యాయులను నియమించాలని విద్యాహక్కు చట్టంలో ఉన్నప్పటికీ అమలుకు నోచుకోవడం లేదు.

ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం మన దేశంలో 10-20 శాతం మంది వినికిడి సమస్యతో బాధపడుతున్నారు. 50 ఏళ్లు పైబడిన వారిలో 40 శాతం, 70 ఏళ్లు పైబడిన వారిలో 70 శాతం మందికి వినికిడి సమస్యతో బాధపడుతున్నారు. 2050 నాటికి ప్రతి నలుగురిలో ఒక్కరికి వినికిడి సమస్య ఉండొచ్చని 2021లో డబ్ల్యుహెచ్‌ఓ ప్రకటించింది. ఎ.పి లో గ్రామీణ ప్రాంతంలో 6.4 శాతం, పట్టణ ప్రాంతంలో 4.9 శాతం మంది బధిరులు నివసిస్తున్నారు. నేషనల్ స్టాటిస్టికల్ ఆఫీస్ (ఎన్ఎస్ఓ) నివేదిక ప్రకారం పురుషుల కంటే మహిళా వికలాంగుల సంఖ్య ఎక్కువగా ఉంది. 2016 ఆర్.పి.డి చట్టం గుర్తించిన 21 రకాల వైకల్యాల ప్రకారం వీరి సంఖ్య రెట్టింపు అవుతుంది. సామూహిక ప్రాంతాలన్నీ మూగ, చెవిటి వారితోపాటు వికలాంగులు వినియోగించుకునే విధంగా ఉండాలని 2016 ఆర్.పి.డి చట్టం పేర్కొంది. 2015లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాక్సెసిబుల్ ఇండియా క్యాంపైన్ ద్వారా 2020 నాటికి ప్రధాన నగరాల్లో 50 శాతం అందుబాటు లోకి రావాలి. దేశవ్యాప్తంగా 1182 స్థలాలు గుర్తిస్తే 482 మాత్రమే అందుబాటు లోకి వచ్చాయి. బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, విమానాశ్రయాలు, ప్రభుత్వ కార్యాలయా లన్నింటిలో సైగల భాష సౌకర్యాలు అందుబాటులో ఉండాలి. ఇవేవీ అమలులో లేవు. బధిరులు వినియోగించే పరికరాలు అందుబాటులో లేకపోవడం ద్వారా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వినికిడి పరికరాలను ఉచితంగానే సరఫరా చేయాలి. విద్యార్థులకు 4జి ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు అందించడం ద్వారా ఉన్నత విద్య అభ్యసించేందుకు అవకాశం ఏర్పడుతుంది. వినికిడి సమస్యను గుర్తించేందుకు శాస్త్రీయ పద్ధతిలో చికిత్స అందించాలి. దీని కోసం ప్రభుత్వ ఆసుపత్రులన్నింటిలో ఆడియాలజిస్టు, స్పీచ్ లాంగ్వేజ్ పాథాలజిస్టులను నియమించాలి. వినికిడి సమస్య ఉన్న వారికి, ఇంప్లాంట్ చికిత్స చేయాల్సిన వారికి ప్రభుత్వం ఉచితంగా చేయాలి. తీవ్రతను బట్టి ప్రభుత్వ పథకాల్లో ప్రాధాన్యత ఇవ్వాలి. వినికిడి సమస్య నివారణ కోసం శాస్త్రీయ పద్ధతుల్లో ప్రభుత్వం కృషి చేయడం ద్వారా వినికిడి లోపాన్ని సహజంగా తీర్చిదిద్దగలం. అందుకోసం ప్రభుత్వాలపై పోరాడి హక్కులు సాధించుకోవాల్సిన అవసరముంది.

- యం. అడివయ్య,
ఎన్‌పిఆర్‌డి జాతీయ ఉపాధ్యక్షులు.

మీ వ్యాసాలు 5000 క్యారెక్టర్లు లేదా 700 పదాలు వుండాలి. పంపాల్సిన మెయిల్ : editpageps@ gmail.com

తప్పని డోలీ మోత

ప్రజాశక్తి- ముంచింగిపుట్టు

అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచింగిపట్టు మండలంలోని ఏనుగురాయి పంచాయతీ కిమ్మాలమామడి గ్రామంలో గర్భిణీ పెట్టియా శైలజకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు డోలీలో రెండు కిలోమీటర్ల దూరం మోసుకొని ప్రధాన రహదారి వద్దకు చేర్చారు. కూత వేటు దూరంలో కిమ్మల మామిడి ఉన్నప్పటికీ కనీస రోడ్డు సౌకర్యం లేదు. గురువారం అర్ధ రాత్రి 2 గంటలకు డోలి మోత తో గర్భిణీ స్త్రీనీ మోసుకొని హాస్పిటల్ కు తరలించారు. 108 అంబులెన్స్ అందుబాటులో లేక పోవడంతో కుటుంబ సభ్యులు అనేక అవస్థలకు గురై ఆటోలో ముంచింగి పుట్టు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. అధికారులు, పాలకులు స్పందించి తుమ్మలమామిడి గ్రామానికి రహదారి నిర్మాణ పనులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

నంద్యాలలో భారీ వర్షం

- ఉప్పొంగిన వాగులు
- రాకపోకలకు అంతరాయం
- పంటలు మునిగి కొన్నచోట్ల రైతులకు నష్టం

ప్రజాశక్తి- నంద్యాల విలేకరులు

నంద్యాల జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం భారీ వర్షం కురిసింది, వాగులు, వంకలు పొంగిపొర్లాయి. రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఆత్మకూరు మండలంలో శుక్రవారం తెల్లవారుజామున 3.30 గంటల నుండి6 గంటల వరకు ఎడతెరిపి లేని వర్షం కురిసింది. మండలంలో 77.4 మిల్లీమీటర్ల వర్షం నమోదయింది. ఆత్మకూరు పట్టణంలో ఈ వర్షం వల్ల పలు కాలనీలోని డ్రైనేజీ కాలువలో ఉన్న మురికి నీరు అంతా రోడ్డుపై చేరాయి. వర్షపు నీరు, మురికి నీటి మధ్య పాదసంచారకులు తీవ్ర ఇబ్బందులకు గురి కావలసిన పరిస్థితి ఏర్పడింది. లోతట్టు కాలనీలో వర్షపు నీరు రోడ్లపై నిలిచిపోయాయి. మండలంలో ఎండిపోయే దశలో ఉన్న పంట పొలాలకు ఈ వర్షం జీవం పోసినట్లు అయిందని పలువురు రైతులు ఆనందాన్ని వ్యక్తపరిచారు. మహానంది మండలంలోని బోయలకుంట్ల మహానంది క్షేత్రానికి వెళ్లే రహదారిలోని పాలేరు వాగు గురువారం రాత్రి కురిసిన వర్షానికి ఉప్పొంగి నిండుకుండలా ప్రవహిస్తోంది. దీంతో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు, రైతులు, ఈ దారిలో మహానందికి వెళ్లే భక్తులు ప్రయాణంలో అక్కడే ఉండిపోవాల్సి వస్తోంది. పాలేరు వాగు వరద ప్రవాహంతో గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. వాగు వంతెనపై నుంచి వరద ప్రవహించడంతో రాకపోకలు నిలిచాయి. ఈ దారిన రాకపోకలు సాగించే యాత్రికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. సంజామల మండలంలో గురువారం రాత్రి నాలుగు గంటల పాటు ఏకధాటిగా వర్షం కొరియడంతో వాగులు వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో మిరప, జొన్న తదితర పంటలు నీట మునగాయి. తీవ్రం నష్టం వాటిల్లినట్టు రైతులు శేన్ బాషా, కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు తెలిపారు. పాలేరు వాగు ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో మండలంలోని వసంతాపురం, కమలాపురి, ముదిగేడు, ఎగ్గొని సంజామల గ్రామాల్లోని రైతులు పాలేరు వెంబడి వరి పైరు వేశారు. దీనితో పాలే లేరు వాగు వెంబడి ఉన్న వరి పైరు పూర్తిగా నీట మునిగింది. రుద్రవరం మండలంలో కురిసిన భారీ వర్షానికి వాగులు వంకలు పొంగి ప్రవహించాయి. రబీ సీజన్లో రైతులు సాగు చేసిన జొన్న పంట నీట మునిగగా.. కొన్నచోట్ల కోత కోసిన మొక్కజొన్న పంట తడిసిపోయింది. మండల పరిధిలో దాదాపు 10 సెంటీమీటర్ల దాకా వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఏడాదిగాను ఇప్పుడు కురిసిన వర్షం పెద్ద వర్షం కావడంతో వంకలు వాగుల్లో నీరు సమృద్ధిగా పారింది. ఎరుగుడిదిన్నె, పేరూరు ,చిలకలూరు, గ్రామాల సమీపంలో ఉన్న వక్కిలేరు వాగు పొంగి ప్రవహించడంతో మూడు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఆర్ కొత్తూరు సమీపంలో గత వారం రోజుల క్రితం సాగుచేసిన జొన్న పంట వర్షపు నీరు చేరి పంట పూర్తిగా దెబ్బతినే పరిస్థితి నెలకొంది. దీంతో రైతులు సేద్యపు, విత్తనాల ఖర్చులు నష్టపోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఖరీఫ్ సీజన్లో సాగుచేసిన మొక్కజొన్న పంట కోత కోసి రోడ్డుపై ఆరబెట్టడంతో వర్షం కారణంగా కొన్నిచోట్ల తడిసిపోయింది. సిరివెళ్ల రుద్రవరం గ్రామాల మధ్య ఉన్న వాగులు పొంగి ప్రవహించడంతో ఆర్‌టిసి బస్సులు వాహనాలు నిలిచిపోయాయి. దీంతో నంద్యాల వైపు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షం నమోదు కావడంతో పంటలకు ఊపిరి పోసినట్లు అయింది. భూగర్భ జలాలు కూడా పెరిగేందుకు అవకాశం ఏర్పడింది. పగిడ్యాల మండలంలో శుక్రవారం తెల్లవారుజామున కురిసిన వర్షం 40. 6 మిల్లీమీటర్లుగా నమోదైనట్టు తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది తెలిపారు.

పనులు కాకుండానే ప్రారంభం

- అర్ధాంతరంగా చెరువులకు నీళ్లు నింపే కార్యక్రమం
- పూర్తికాని ప్రాజెక్టుకు సిఎం శ్రీకారం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

పనులు పూర్తి కాకుండానే ఓ ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారు. హంద్రీనీవా ద్వారా 77 చెరువులకు నీళ్లు నింపే కార్యక్రమాన్ని సిఎం ప్రారంభించగా పనులు మాత్రం పూర్తి కాలేదు. హంద్రీనీవా సుజల స్రవంతి ద్వారా ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 77 చెరువులకు మంగళవారం సిఎం నీటిని విడుదల చేశారు.కృష్ణగిరి మండలం ఆలంకొండ వద్ద రూ.253.72 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన ఎత్తిపోతల పథకం ద్వారా కర్నూలు, నంద్యాల జిల్లాల పశ్చిమ ప్రాంత 77 చెరువులకు హంద్రీ నీవా సుజల స్రవంతి ప్రధాన కాలువ నుండి 10363 ఎకరాల ఆయకట్టు సాగు కానుంది. అధికారిక లెక్కల ప్రకారం డోన్ నియోజకవర్గానికి సంబంధించి డోన్ మండలంలో 28 చెరువులకు గాను 2464.50 ఎకరాల ఆయకట్టు, ప్యాపిలి మండలంలో 18 చెరువులకు 1796.80 ఎకరాల ఆయకట్టు, పత్తికొండ నియోజకవర్గానికి సంబంధించి కృష్ణగిరి మండలంలో 4 చెరువులకు 1472.07 ఎకరాల ఆయకట్టు, వెల్దుర్తి మండలంలో 13 చెరువులకు 2001.8 ఎకరాల ఆయకట్టు, పత్తికొండ మండలంలో 3 చెరువులకు 212.60 ఎకరాల ఆయకట్టు, తుగ్గలి మండలంలో 13 చెరువులకు 1386.62 ఎకరాల ఆయకట్టు, మద్దికెర మండలంలో 2 చెరువులకు 699.50 ఎకరాల ఆయకట్టు సాగు కానుంది. అలాగే ఆలూరు శాసనసభ నియోజక వర్గానికి సంబంధించి దేవనకొండ మండలంలో 3 చెరువులకు 171.5 ఎకరాల ఆయకట్టు, పాణ్యం శాసనసభ నియోజకవర్గానికి సంబంధించి, కల్లూరు మండలం లో 2 చెరువులకు 157.60 ఎకరాల ఆయకట్టు సాగు మొత్తం 10363 ఎకరాల ఆయకట్టు సాగు కానుంది. స్వయంగా ముఖ్యమంత్రే ఈ ప్రాజెక్టును ప్రారంభించినా పనులు మాత్రం పూర్తి కాలేదు. హంద్రీనీవా ప్రధాన కాలువ నుంచి ఆలంకొండ వద్ద పంపుహౌస్ ఏరాప్రటు చేసి 5.60 కిలోమీటర్ల దూరంలో కటారుకొండపై డెలివరీ ఛాంబర్ ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి మూడు పైప్‌లైన్ల ద్వారా చెరువులకు నీటిని అందించేందుకు చర్యలు చేపట్టారు. అయితే ఎంపిక చేసిన చెరువుల్లో ఒక్క చెరువునూ బాగు చేయలేదు. పూడికతీత, కట్టల బలోపేతం, కరకట్టకు రాతిపరుపు, గేట్లు, అలుగుల వద్ద లైనింగ్ వంటి పనులు చేయాల్సి ఉండగా ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. కటారుకొండ నుంచి చెరువులకు నీటిని తరలించేందుకు 110 కిలోమీటర్ల పొడవున పైప్‌లైన్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే వీటిలో సగం కూడా పనులు పూర్తి కాలేదు. ప్యాపిలి మండలంలో 18 చెరువులకు నీరందించాల్సి ఉండగా నాలుగు చోట్ల మాత్రమే అరకొర పనులు చేశారు. పైప్‌లైన్ పనులు సాగుతున్నాయి. డోన్ మండలంలో 28 చెరువులకు నీరందించాల్సి ఉండగా 27 చోట్ల పనులు పూర్తయ్యాయి. తుగ్గలి మండలంలో 13 చెరువులకు నీరు అందించాల్సి ఉండగా ఏడు చోట్ల మాత్రమే పైప్‌లైన్ పనులు పూర్తి చేశారు. పత్తికొండ మండలంలో చక్రాళ్ల, చందోళి, పత్తికొండ చెరువులకు నీరందించాల్సి ఉంది. చక్రాళ్ల, చందోళి చెరువులకు పైప్‌లైన్ పనులు పూర్తి చేశారు. పత్తికొండలో పైప్‌లైన్ పనులు పూర్తి కాలేదు. పనులు పూర్తి కాకుండానే ప్రారంభం చేయడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలి

నాలుగేళ్ల తరువాత కూడా అసంపూర్తిగానే చెరువులకు నీటిని నింపే పనులు ఉండగా రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కేవలం రాజకీయ లబ్ధి కోసం ప్రారంభం తతంగాన్ని నిర్వహించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వం కాలం పూర్తయ్యే లోపే పనులు పూర్తి చేయాలి. ఇప్పటికైనా ప్రభుత్వం, ముఖ్యమంత్రి పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

కేసు పూర్వాపరాలు తెలుసుకోలేదు : అచ్చెన్న

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

స్కిల్‌డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు క్వాష్ పిటిషన్ కొట్టివేసిన హైకోర్టు న్యాయమూర్తి కేసు పూర్వాపరాలను పరిగణనలోకి తీసుకోలేదని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు అన్నారు. కేసులో అవినీతి జరిగిందని గానీ, జరగలేదని గానీ ఎక్కడా ప్రస్తావించలేదని పేర్కొన్నారు. క్వాష్ పిటిషన్‌లోనే రిమాండ్ అంశం చేర్చారు కాబట్టి పిటిషనే తిరస్కరించినప్పుడు రిమాండ్ రిజక్ట్ చేసే అంశం ప్రత్యేకంగా పరిశీలనకు రాదని అన్నారని పేర్కొన్నారు. టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. హైకోర్టు తీర్పుపై తమ పార్టీ న్యాయవిభాగం సమగ్రంగా విశ్లేషిస్తోందన్నారు. కచ్చితంగా ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించి న్యాయపరంగా ముందుకెళ్తామని చెప్పారు. ఈ తీర్పుతో వెనకడుగు వేయబోమని, క్షేత్రస్థాయిలో ప్రభుత్వ అరాచకాలపై పోరాటం కొనసాగిస్తామని అన్నారు.

చంద్రబాబును అరెస్టు చేసి జైలుకు పంపితే టిడిపి డీలా పడిపోతుందనే పిచ్చి భ్రమలో వైసిపి ఉందని పేర్కొన్నారు. ప్రతి నాయకుడు, కార్యకర్తా ఒక చంద్రబాబు నాయుడే అని అన్నారు. చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసిన సిఐడి మరలా ఆయనను కస్టడీకి అడుగుతుందన్నారు. ఇది కేవలం ఆయనను ఇబ్బంది పెట్టడానికే అని విమర్శించారు. బెయిల్ ఆలస్యం చేయడానికే ఒక ప్రణాళికాబద్ధంగా సిఐడి, ప్రభుత్వం కేసును నడిపిస్తున్నాయని ఆరోపించారు. స్కిల్‌డెవలప్‌మెంట్ కేసులో ప్రభుత్వం తరపున హైకోర్టులో వాదనలు వినిపించిన ముకుల్ రోహత్గీ కర్ణాటక మాజీ సిఎం యడ్యూరప్ప కేసులో 17(ఎ) యాక్ట్ వర్తిస్తుందని చెప్పారని టిడిపి ఎమ్మెల్యేలు డోలా బాల వీరాంజనేయస్వామి, ఏలూరి సాంబశివరావు, మంతెన రామరాజు అన్నారు.

చలో కలెక్టరేట్‌కు టిఎన్‌యుఎస్ మద్దతు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వం ప్రతిపాదించిన జిపిఎస్‌ను వ్యతిరేకిస్తూ పాతపెన్షన్ విధానం (ఒపిఎస్) అమలు కోసం ఈ నెల 25న ఫ్యాప్టో, ఎపిసిపిఎస్ఇఎ ఉమ్మడిగా చేపట్టనున్న చలో కలెక్టరేట్ ఆందోళనలకు తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం (టిఎన్‌యుఎస్) మద్దతు ప్రకటించింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మన్నం శ్రీనివాస్, శ్రీరామశెట్టి వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులపై జిపిఎస్‌ను బలవంతంగా రుద్దడం సరికాదని అన్నారు. చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని అన్ని జిల్లాల్లో విజయవంతం చేయాలని కోరారు.

దక్షిణమధ్య రైల్వే
మమ్మల్ని @SCRailwayindia ద్వారా అనుసరించవచ్చు. ద.మ.రైల్వేలోని టెండరు ప్రకటనల వివరాలు మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in లో చూడవచ్చు.

తేది: 22.09.2023, ఇ-టెండర్ నోటీసు నం.డివై.సిఇ/జిఎస్/ఎస్‌సి/30/2023/ఓటి. PUB/1069

భారత రాష్ట్రపతి మరియు దిగువసంతకందారుడు తరపున 25.10.2023, 14.00గం. వరకు క్రింద పేర్కొన్న పనుల కొరకు ఇ-టెండర్‌లు ఆహ్వానిస్తున్నారు.

క్ర.సం.: 01. ఇ-టెండర్ నం.: 30-జిఎస్-ఎస్‌సి-23-ఓటి, పని పేరు : సికింద్రాబాద్ డివిజన్/గాటి శక్తి యూనిట్ : అమృత భారత్ స్టేషన్ పథకం క్రింద భద్రాచలం రోడ్డు, మహబూబాబాద్, మదిర, జనగాన్, జహీరాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, యాదాద్రి (అనగా.. 08 సంఖ్యలు) వద్ద 12 మీ. వెడల్పు ఎఫ్‌ఓబితో రాంప్ నియామకం. సుమారు టెండర్ విలువ రూ.లో : 796559489.39/-, ఇఎమ్‌డి రూ.: 41,32,800/-, పూర్తి వ్యవధి నెలల్లో: 10 నెలలు, నిర్వహణ వ్యవధి నెలల్లో : 36 నెలలు.

1. టెండరర్లు ఇ-టెండరింగ్ ద్వారా మాత్రమే పాల్గొనాలి మరియు మాన్యువల్ ఆఫర్లు ఏవీ పరిగణించబడవు. 2. భావి టెండరర్లందరూ ఆన్‌లైన్ చెల్లింపులు ద్వారా మాత్రమే ఇఎమ్‌డి చెల్లించాలని అభ్యర్థించడమైనది.
3. ఏ విధమైన కారణం చెప్పకుండానే టెండర్‌ను రద్దు చేసే హక్కు రైల్వే కు ఉంది.
4. భావి టెండరర్లందరూ జిఎస్‌టిఐఎన్ గుర్తింపు నం.లు. పొందాలని మరియు వారి ఆఫర్‌తో పాటు సమర్పించాలని సూచించబడ్డారు.

డివై. చీఫ్ ఇంజనీర్/గాటి శక్తి/ సికింద్రాబాద్

తేది: 21.09.2023 టెండర్ నం.జిటిఎల్-ఇఎమ్-14-2023-24. PUB/1071

భారత రాష్ట్రపతి మరియు సీనియర్ డివిజినల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/నిర్వహణ/గుంతకల్లు తరపున క్రింది పనుల కొరకు తాత్కాలిక బాధ్యతలు నిర్వహించేందుకు ఇ-టెండర్లను ఆహ్వానించడమైనది.

టెండర్ నం.: జిటిఎల్-ఇఎమ్-14-2023-24, పని వివరణ : గుంతకల్లు డివిజన్ : (షెడ్యూల్-ఎ) కృష్ణాపురం నదిని కడప స్టేషన్‌కు కలుపుతూ ప్రయాణికులకు నీటి సరఫరా కోసం ప్రస్తుతం ఉన్న నీటి పైప్‌లైన్‌ను మార్చేందుకు విద్యుత్ ఏర్పాట్లు. (షెడ్యూల్-బి)- వెండోడు-విద్యుత్ ఏర్పాట్లు పాత శిథిలావస్థలో ఉన్న స్టేషన్ భవనం. (షెడ్యూల్-సి)- డిఆర్‌ఎమ్ కార్యాలయంలో రూఫ్ లీకేజీలు, ఫాల్స్ సీలింగ్‌లు, టాయిలెట్లలో ఫ్లోరింగ్, శానిటరీ ఫిట్టింగ్‌లు, దోమల మెష్, పర్సనల్ బ్రాంచ్, ఆపరేటింగ్ డిపార్ట్‌మెంట్, మహిళా విశ్రాంతి గది, హిందీ విభాగం మొదలైన వాటిలో పాత కిటికీల భర్తీకి విద్యుత్ ఏర్పాట్లు. ప్రకటన విలువ : రూ.63,28,058.10/-, ఇఎమ్‌డి : రూ.1,26,600/-
ముగింపు తేది మరియు సమయం : 13.10.2023, 15.00 గం.

టెండర్ బిడ్డింగ్ మరియు ఇతర వివరాల కొరకు http://www.ireps.gov.in లాగిన్ అవ్వండి. టెండర్ యొక్క ఏదైనా సవరణ ఆన్‌లైన్ లో మాత్రమే జారీ చేయబడతాయి. టెండర్ డాక్యుమెంట్లను టెండర్‌దారులు http://www.ireps.gov.in నుండి ఉచితంగా డౌన్లోడ్ చేసుకోవచ్చు.
గమనిక : ఈ ఇ-టెండర్‌లో పాల్గొనడానికి / బిడ్ చేయడానికి, టెండరర్ చెల్లుబాటు అయ్యే డిఎస్‌సి (డిజిటల్ సిగ్నేచర్ సర్టిఫికేట్) కలిగి ఉండాలి.

ఎస్ఆర్.డివిజినల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, (ఎమ్), గుంతకల్లు.

తేది : 20.09.2023, టి.నోటీసు నం.: జి/ఇ.29/ టిఆర్./టెండర్ నోటీసు/15/2023-24. PUB/1072

భారత రాష్ట్రపతి మరియు సీనియర్ డివిజినల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/ట్రాక్షన్/గుంతకల్లు తరపున క్రింది విధమైన పనుల కొరకు తాత్కాలిక బాధ్యతలను నిర్వహించేదుకు ఇ-టెండర్లను ఆహ్వానించడమైనది.

టెండర్ నం.: జిటిఎల్-టిఆర్‌డి-29-ఇ టిఎన్-26-2023-24, పని పేరు : గుంతకల్లు డివిజన్-యాదగిరి వద్ద డిఎస్‌డిసి నడుస్తున్న దృష్ట్యా 632.85 కిమీ. వద్ద ఆర్‌ఓబి 1216ఎ క్రింద ఇన్సులేటింగ్ షీట్ ఏర్పాటు. సుమారు విలువ రూ.: 84,02,024/-, ఇఎమ్‌డి రూ.: 1,68,100/-
ముగింపు తేది మరియు సమయం : 13.10.2023, 15.00 గం.

గమనిక :
1. టెండర్‌దారులు టెండర్ డాక్యుమెంట్లను www.ireps.gov.in నుండి ఉచితంగా డౌన్లోడ్ చేసుకోవచ్చు.
టెండర్ బిడ్డింగ్ మరియు ఇతర వివరాల కొరకు http://www.ireps.gov.in లాగిన్ అవ్వండి. ఏదైనా సవరణ ఉంటే ఆన్‌లైన్ ద్వారా మాత్రమే జారీ చేయబడుతుంది.

ఎస్ఆర్.డివిజినల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, ట్రాక్షన్, గుంతకల్లు

తేది : 21.09.2023, ఇ-టెండర్ నోటీసు నం.: ఎస్ అండ్ టి/15/2023. PUB/1073

భారత రాష్ట్రపతి మరియు సీనియర్ డివిజినల్ సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజనీర్ (నిర్వహణ) సౌత్ సెంట్రల్ రైల్వే గుంతకల్లు 13.10.2023, 15.00 గం. వరకు క్రింది విధమైన పనుల కొరకు ఇ-టెండర్ల (ఓపెన్) ను ఆహ్వానించడమైనది.

టెండర్ నం.: 01-ఎస్ఎన్‌టి-15-2023, పని వివరణ (సిగ్నల్ అండ్ టెలికాం పని) : గుంతకల్లు డివిజన్ యొక్క టిపిటివై-కెపిడి లో బొమ్మసముద్రం (బియుఎమ్) స్టేషన్ వద్ద అదనపు లూప్ లైన్ నియామకం తో కనెక్షన్ లో సిగ్నలింగ్ అండ్ టెలికాం ఏర్పాట్లు. పని యొక్క ప్రకటన టెండర్ విలువ: రూ.12345409.78/-, ధరావత్తు డిపాజిట్ మొత్తం : 211700.00/-, పూర్తి వ్యవధి : 09 నెలలు.

ఆఫర్ యొక్క చెల్లుబాటు ప్రారంభ తేదీ నుండి 45 రోజులు ఉండాలి. ఆన్‌లైన్ ద్వారా మాత్రమే అవసరమైతే పై టెండర్ నోటీసు కోసం సవరణ జారీ చేయబడుతుంది.

ఎస్ఆర్.డివిజినల్ సిగ్నల్ అండ్ టెలికాం ఇంజనీర్, (ఎమ్) గుంతకల్లు.

తేది : 20.09.2023, ఇ-టెండర్ నం.డివై.సిఇ-జిఎస్-బిజెడ్ఎ-22-2023. PUB/1074

భారత రాష్ట్రపతి మరియు డివై. చీఫ్ ఇంజనీర్ గాటి శక్తి, దక్షిణ మధ్య రైల్వే, విజయవాడ తరపున టెండరింగ్ యొక్క ఓపెన్ టెండర్/సింగల్ ప్యాకెట్ సిస్టమ్ లో క్రింది విధమైన పనుల కొరకు ఇ-టెండర్లను ఆహ్వానించడమైనది.

ఎస్.నం.: 01, టెండర్ నం.: డివై.సిఇ-జిఎస్-బిజెడ్ఎ-22-2023, తేది : 17.09.2023, పని వివరణ : ఎస్‌డబ్ల్యూ-1 : బిజెడ్ఎ డివిజన్-నరసింగపల్లి- డిఎన్ లైన్ వైపు కొత్త అదనపు లూప్ లైన్ ప్రతిపాదించబడింది మరియు యుపి లైన్ వైపు 720.00మీ పొడవు వరకు ప్రధాన లైన్లు మరియు లూప్ లైన్ల ప్రతిపాదిత పొడిగింపు. ఎస్‌డబ్ల్యూ-2 : బిజెడ్ఎ డివిజన్ - నర్సింగపల్లి- నరసింగపల్లి యార్డ్ వద్ద కొత్త స్టేషన్ భవనం లిఫ్టెవర్ పనుల ప్రతిపాదిత పూర్తి. టెండర్ విలువ : రూ.62556414.94/-, ఇఎమ్‌డి : రూ.462800/-, పూర్తి వ్యవధి : (09) తొమ్మిది నెలలు, టెండర్‌ఫారం ఖరీదు : లేదు, ముగింపు తేది మరియు సమయం : 09.10.2023, 15.00 గం.

1. బిడ్ డాక్యుమెంట్ మరియు ఇతర వివరాల కొరకు దయచేసి వెబ్‌సైట్ http://www.ireps.gov.in లాగిన్ అవ్వండి.
2. ధరవాత్తు డిపాజిట్ మొత్తం మరియు టెండర్ డాక్యుమెంట్ ఖరీదు చెల్లింపులు ఐరెప్స్‌లో నెట్ బ్యాంకింగ్/గేట్‌వే సౌకర్యం ద్వారా మాత్రమే ఆన్‌లైన్‌లో అందుబాటులో కలవు.
3. టెండర్లు తమ ఆఫర్లను ఆన్‌లైన్‌లో సమర్పణ/ బిడ్డింగ్ టెండర్ వ్యవధి కాలం ముగింపుకు పదిహేను రోజుల ముందు సమర్పించాలి.
4. ఏదైనా సవరణ కొరకు (ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడుతుంది) టెండర్ సమర్పణ/బిడ్డింగ్ వ్యవధి ప్రారంభం వరకు టెండర్‌దారులు చూసుకోవాలి.

డివై.చీఫ్ ఇంజనీర్, గాటి శక్తి, విజయవాడ

టెండర్ నోటీసు నం.:సిఆర్ఎస్/ఇ.07/ 2023-24 PUB/1076

భారత రాష్ట్రపతి మరియు ఎడిఇఇ/సిఆర్ఎస్/టిపిటివై తరఫున క్రింద పేర్కొన్న టెండర్ నం.కు వ్యతిరేకంగా దిగువ పేర్కొన్న ముగింపు తేది 15.00 గం. వరకు తాత్కాలిక బాధ్యతలు నిర్వహించేందుకు ఇ- టెండర్లను ఆహ్వానించడమైనది. బిడ్డర్లు తమ అసలు/సవరించిన బిడ్‌లను ముగింపు తేదీ మరియు సమయం వరకు మాత్రమే సమర్పించగలరు. ఈ టెండర్‌కు వ్యతిరేకంగా మాన్యువల్ ఆఫర్‌లు అనుమతించబడవు మరియు స్వీకరించబడిన ఏదైనా మాన్యువల్ ఆఫర్ తిరస్కరించబడుతుంది.

క్ర.సం.01 : పని వివరణ : టెండర్ నం.: సిఆర్ఎస్-ఇ-07-2023-24 సిఆర్ఎస్/ టిపిటివై- తిరుపతిలోని క్యారేజ్ రిపేర్ షాప్ యొక్క రైలు లైటింగ్ షాప్‌లో 20 ఎహెచ్‌బి కోచ్‌ల కోసం అధిక సామర్థ్యం గల ఐవి కప్లర్ (500ఎ) మరియు 150 చ.మీ.లు. ఫీడర్ కేబుల్ ఏర్పాటు. సుమారు విలువ : రూ.15,83,280/-, బిడ్ సెక్యూరిటీ : రూ.31,700/-, పూర్తి వ్యవధి : 36 నెలలు, ముగింపు తేది : 12.10.2023, 15.00 గం.

వెబ్‌సైట్ వివరాలు : www.ireps. gov.in
టెండర్ యొక్క పూర్తి వివరాలను చూడగలిగే నోటీసు బోర్డు స్థానం : అసి.డివిజినల్.ఎలక్ట్రికల్ ఇంజనీర్ యొక్క కార్యాలయం, కారేజ్ రిపేర్ షాప్, తిరుపతి.
తదుపరి టెండర్ షరతులు/వివరాల కొరకు (టెండర్ డాక్యుమెంట్‌లో అందుబాటులో ఉన్నాయి) మరియు టెండర్ డాక్యుమెంట్ల డౌన్లోడ్, సవరణ కొరకు దయచేసి మా వెబ్‌సైట్ https://www.ireps.gov.in ను సందర్శించండి.

అసిస్టెంట్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, సిఆర్ఎస్, తిరుపతి.

A1483

తదుపరి టెండర్ నియమాలు/వివరాలు మరియు టెండర్ డాక్యుమెంట్ల డౌన్‌లోడ్ కోసం దయచేసి వెబ్‌సైట్ https:www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.inని సందర్శించండి.

స్వాధీనతా ప్రకటన DCB BANK

(సెక్యూరిటీ ఇంట్రస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్ 2002 యొక్క రూల్ 8(1) తో చదువుతూ సెక్షన్ 13(4) క్రింద అనుబంధం - IV ప్రకారం)

ఋణగ్రహీతలు/హామీదారుల పేరు & చిరునామా: మెస్సర్స్ అయ్యప్ప ఫుడ్ ప్రొడక్ట్స్, ప్రొప్రయిటర్ : శ్రీ రమేష్ నారిశెట్టి, **నివాస చిరునామా:** డి.నెం.4/14, సాయి మోడల్ గ్రామం, రామవరప్పాడు, విజయవాడ - 521108. **ఆఫీస్ చిరునామా:** 2వ అంతస్తు, శ్రీ సాయి యూనిక్ అపార్ట్‌మెంట్స్, సూరతు వారి వీధి, నందమూరి నగర్, అజిత్ సింగ్ నగర్, విజయవాడ - 520015.

NPA తేది. 26-06-2022 **డిమాండ్ నోటీసు తేది : 27-06-2022**
డిమాండ్ నోటీసు నందు పేర్కొన్న బకాయి : తేది.26-06-2022 నాటికి రూ.12,14,937/- + తదుపరి వడ్డీ, కాస్ట్స్, ఇతర ఖర్చులు.
స్వాధీనత నోటీసు తేది: 19-09-2022
స్వాధీనత నోటీసు నందు పేర్కొన్న బకాయి: రూ.12,39,867/-, + తదుపరి వడ్డీ, కాస్ట్స్, ఇతర ఖర్చులు.

స్థిరాస్తి వివరములు:
డిమాండ్ నోటీసు తేది.27.06.2022 ప్రకారం గల ఆస్తి : కృష్ణాజిల్లా, గుణదల సబ్ రిజిస్ట్రీ, రామవరప్పాడు గ్రామ పంచాయితీ ఏరియా, అసెస్మెంట్ నెం.2841, ఆర్.ఎస్.నెం.128/13 లోని 8903.00 చ॥గ॥లు లేదా 7444.73 చ॥మీ॥ల మొత్తం విస్తీర్ణంలో 24.64 చ॥గ॥లు లేదా 20.60 చ॥మీ॥ల అవిభాజ్యపు ఉమ్మడి వాటా విస్తీర్ణం గల ఆస్తి.,
కృష్ణాజిల్లా, గుణదల సబ్ రిజిస్ట్రీ, రామవరప్పాడు గ్రామ పంచాయితీ ఏరియా, సాయి మోడల్ గ్రామం అపార్ట్‌మెంట్ నందు 430 చ॥అ॥ల ప్లింత్ ఏరియా కలిగిన డోర్ నెం.4-113/డి-ఎఫ్ఎఫ్ 13 తో గల ఫ్లాట్ నెం.డిఎఫ్ఎఫ్-13 ఆస్తి. **స్థలం హద్దులు : తూర్పు:** చాగంటిపాటి రామదాసు మొ॥ వారు ఇతరులకు అమ్మిన ఆస్తి, **దక్షిణం:** మల్లెంపూడి సీతయ్య గారు ఇతరులకు అమ్మిన ఆస్తి, **పడమర:** ఎన్. లలిత ప్రసాద్ మొ॥ వారి ఆస్తి కొంతమేర, కె. సత్యనారాయణ మొ॥ వారి ఆస్తి, **ఉత్తరం :** జాతీయ రహదారి. **ఫ్లాట్ హద్దులు : ఉత్తరం :** ఓపెన్ టు స్కై, **దక్షిణం :** కారిడార్ & దారి, **తూర్పు :** ఫ్లాట్ నెం.డిఇఎఫ్-14, **పడమర :** ఫ్లాట్ నెం.డిఇఎఫ్-12.

రిజర్వుధర: రూ.11,40,000/- **ధరావత్తు ధర : రూ.1,14,000/-** **బిడ్ పెంపుదల మొత్తం: రూ.10,000/-**

వేలం తేది మరియు సమయం: తేది.20-10-2023, ఉ॥ 11.00 గం॥ల నుండి మ॥ 12.00 గం॥ల వరకు మరియు https://www.mstcecommerce.com/auctionhome/ ibapi ప్లాట్‌ఫాం నందు వేలం పూర్తి అయ్యే వరకు ప్రతి 5 ని॥లకు ఒక సారి ఆటోటైమ్ ఎక్స్‌టెన్షన్ ఉండును.

ధరావత్తు చెల్లించువిధానం : ఆసక్తి గల బిడ్డర్లు / కొనుగోలుదారులు వారి మొబైల్ నెంబర్ మరియు ఇ-మెయిల్ ఐడి ఉపయోగించి https://www.mstcecommerce.com/auctionhome/ibapi పోర్టల్ నందు నమోదు చేసుకొనవలెను. తదుపరి అవసరమైన కెవైసి పత్రాలను అప్‌లోడ్ చేయవలసిందిగా కోరడమైనది. కెవైసి పత్రాలను ఇ-వేలం సర్వీస్ ప్రొవైడర్ ధృవీకరించిన తర్వాత (2 పని రోజులు పట్టవచ్చు), ఆసక్తి గల బిడ్డర్లు/ కొనుగోలుదారులు సదరు గ్లోబల్ ధరావత్తు వాలెట్ ఖాతా నందు ఆన్‌లైన్ విధానం ద్వారా ధరావత్తు మొత్తాన్ని **19-10-2023, సాయంత్రం 4.00** గంటలలోపు బదిలీ చేయవలెను. ఆసక్తి గల బిడ్డర్లు చెల్లుబాటు అయ్యే ఇ-మెయిల్ చిరునామాను కలిగి ఉండవలెను మరియు పైన పేర్కొన్న సర్వీస్ ప్రొవైడర్ యొక్క వెబ్‌సైట్ నందు లాగిన్ అవ్వడం ద్వారా వారి పేరు / ఖాతాను నమోదు చేసుకొనవలెను.

బ్యాంకుకు తెలిసిఉన్నంత వరకు ఎలాంటి జంఝాటములు (ఎన్‌కంబరెన్స్) : లేదు
ఆస్తుల తనిఖీ తేది మరియు సమయం : ముందుగా బ్యాంకు వారి అనుమతి తీసుకొని బ్యాంకు పనివేళలలో తేది.25-09-2023 నుండి
ఆన్‌లైన్ ద్వారా ధరావత్తుతో కలిపి బిడ్స్ సమర్పించుట: తేది: 25-09-2023 నుండి
ఆన్‌లైన్ ద్వారా ధరావత్తుతో కలిపి బిడ్స్ దాఖలు చేయు చివరి తేది.19-10-2023, సా॥ 4.00 గం॥ల వరకు
* (ప్రభుత్వ స్థానిక పన్నులు (ఆస్తులకు సంబంధించిన స్థానిక పన్నులు, ప్రోపర్టీ టాక్స్, వాటర్, డ్రైనేజ్ నిర్వహణ ఛార్జీలు, ఎలక్ట్రికల్ బిల్స్ మొదలగునవి) పాల్గొనదలిచిన బిడ్డర్ల ద్వారా నిర్ధారించబడాలి. సఫలీకృతులైన బిడ్డరుదారులే భరించాలి.
*** చట్టబద్ధ బకాయిలు కన్నా బ్యాంక్ బకాయిలకు ప్రాధాన్యత ఉంటుంది.**

అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కోసం, సర్వీస్ ప్రొవైడర్ యొక్క వెబ్‌సైట్ : (1) https://www.ibapi.in , (2) https://www.mstcecommerce.com/auctionhome/ibapi లేదా బ్యాంక్ వెబ్‌సైట్ : www.iob.in మరిన్ని వివరముల కొరకు : బ్రాంచి మేనేజర్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, చిరునామా : రామవరప్పాడు బ్రాంచ్, శుభమ్ కళ్యాణ మండలం, విజయవాడ, ఆంధ్రప్రదేశ్ - 521108. ఫోన్ : (866) 2844748 (జనరల్), మొబైల్ నెం.: 9426245267 లేదా సర్వీస్ ప్రొవైడర్ : మెస్సర్స్ ఎమ్ఎస్‌టిసి లిమిటెడ్, రిజిస్టర్డ్ ఆఫీస్ : 225-సి, ఎ.జె.సి.బోస్ రోడ్డు, కోల్‌కత్త-700020, (టోల్ ఫ్రీ ఫోన్ నెం.: 033-22901004, హెల్ప్ డెస్క్ పనిచేయు సమయం : ఉ॥ 8.00 గం॥ల నుండి రా॥ 8.00 గం॥ల వరకు) వారిని సంప్రదించగలరు.

తేది : 19-09-2023, ప్రదేశం : విజయవాడ సం/- అధీకృత అధికారి, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్

ఎన్నికల ముంగిట పథకాల వరద

- నాలుగు రాష్ట్రాల్లో వీటి విలువ రూ.37 వేల కోట్లు
- తెలంగాణలో అధికం.. ఛత్తీస్‌గఢ్‌లో అత్యల్పం

షెడ్యూల్ ప్రకారం దేశంలో ఈ ఏడాది చివర్లో తెలంగాణ సహా ఐదు రాష్ట్రాల ఎన్నికలు జరగనున్నాయి. అధికారాన్ని నిలబెట్టుకోవటానికి అధికార పార్టీలు, అధికారం సాధించేందుకు ప్రతిపక్ష పార్టీలు ఎత్తులు పైయెత్తుల్లో తలమునకలై ఉన్నాయి. ఓటర్లను ఆకట్టుకోడానికి తాయిలాలు ప్రకటిస్తున్నాయి. ఉచిత బస్సు ప్రయాణాలు, మహిళలకు నగదు పంపిణీ, యువతులకు ఫోన్లు, స్కూటర్లు, తక్కువ ధరలకే గ్యాస్ సిలిండర్లు, ఇండ్ల నిర్మాణం కోసం ఆర్థిక సాయం.. ఇలా ఒకటేమిటీ.. పెద్ద సంఖ్యలో హామీలు, సంక్షేమ పథకాలు, కార్యక్రమాలతో అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నాయి. ఈ విషయంలో తెలంగాణ అగ్రస్థానంలో వుంది.

న్యూఢిల్లీ : తెలంగాణతో పాటు ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరిగే రాష్ట్రాలు మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మిజోరం. ఈశాన్య రాష్ట్రమైన మిజోరం మినహా మిగతా నాలుగు రాష్ట్రాల్లో అధికార పార్టీలు పెద్ద మొత్తంలో సంక్షేమ పథకాలు, హామీల వర్షం కురిపిస్తున్నాయి. ఇందుకోసం ఈ నాలుగు రాష్ట్ర ప్రభుత్వాలు రూ.37,000 కోట్ల వ్యయమయ్యే సంక్షేమ పథకాలను ప్రకటించాయి. ఈ ఐదు రాష్ట్రాల్లో పథకాలు, కార్యక్రమాల మీద ఖర్చు చేసే విషయంలో తెలంగాణ అగ్రస్థానంలో ఉండగా, ఛత్తీస్‌గఢ్ అట్టడుగున ఉన్నది.

మధ్యప్రదేశ్‌లో మహిళలపై దృష్టి

ఈ ఏడాది జనవరి నుంచి మధ్యప్రదేశ్‌లోని శివరాజ్ సింగ్ చౌహాన్ నేతృత్వంలోని బిజెపి సర్కారు రాష్ట్రంలోని మహిళలు, యువత ఓటర్లను ఆకట్టుకోవడానికి పలు పథకాలను ప్రవేశపెట్టింది. లాడ్లీ బెహనా పథకం వీటిలో ముఖ్యమైనది. ప్రస్తుత సంవత్సరంలో ఈ కార్యక్రమానికి కేటాయింపులు రూ.8,000 కోట్లకు పెంచింది. మొత్తం 230 అసెంబ్లీ స్థానాలున్నాయి. ఇందులో కనీసం 18 స్థానాల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 5.4 కోట్ల మంది ఓటర్లలో 2.6 కోట్ల మంది మహిళలు ఉన్నారు. అలాగే, 12వ తరగతి టాపర్‌లకు ఉచిత స్కూటర్లు, స్టైఫండ్‌తో యువకులకు వత్తి శిక్షణా కార్యక్రమాన్ని ప్రకటించింది. ఈ ఏడాది బడ్జెట్‌లో ఈ కార్యక్రమాల కోసం ప్రభుత్వం వరుసగా రూ.135 కోట్లు, రూ.1,000 కోట్లు కేటాయించింది. వీటితో పాటు ఇతర ఉచిత, సంక్షేమ పథకాలకు అధికార పార్టీ హామీలిచ్చింది.

రాజస్థాన్‌లో ఫోన్‌లు, ఎల్‌పిజి సిలిండర్లు, విద్యుత్

రాజస్థాన్‌లో అధికార కాంగ్రెస్ హామీల ప్రకటనతో ముందుకెళ్తున్నది. ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ ఉచిత మొబైల్ ఫోన్‌ల నుంచి ఎల్‌పిజి, విద్యుత్‌పై సబ్సిడీల వరకు పలు తాయిలాలు ప్రకటించారు. రాష్ట్ర ఖజానాపై రూ. 12,700 కోట్ల భారం పడనున్నదని అంచనా. అదనంగా, రాష్ట్ర బడ్జెట్‌లో విద్యావంతులైన పారిశ్రామికవేత్తలకు వారి వ్యాపారాలను స్థాపించడంలో ఆర్థిక సహాయం అందించే లక్ష్యంతో రూ.100 కోట్లతో యువ ఉద్దం యోజన పథకం ప్రకటించారు.

అత్యధిక వ్యయంతో అగ్రస్థానంలో తెలంగాణ

దేశంలో కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కేసీఆర్ సర్కారు అనేక రకాల ఉచితాలు, సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టింది. రైతు బంధు ద్వారా రైతులకు, కేసీఆర్ కిట్ ద్వారా తల్లులు, నవజాత శిశువులకు ఆర్థిక సహాయం వంటివి అమలు చేసింది.

నిరుపేదలకు డబుల్‌బెడ్రూమ్ ఇండ్లను ప్రకటించింది. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా పేద కుటుంబాల వధువులకు కానుకలు ఇవ్వనుంది. షెడ్యూల్డ్ కులాల కుటుంబాలకు రూ. 10 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించే దళిత బంధు పథకాన్ని తీసుకొచ్చింది. ఇక, వికలాంగులు, వృద్ధులు, వితంతువులకు ఆసరా పెన్షన్ కార్యక్రమం కింద ఆర్థిక సాయాన్ని అందిస్తున్నది.

2023-24 బడ్జెట్‌లో, రైతు బంధుకు రూ. 15,075 కోట్లు, దళిత బంధు కోసం రూ. 17,700 కోట్లు, డబుల్ బెడ్రూమ్ ఇండ్ల పథకం కోసం రూ. 7,890 కోట్లు కేటాయించింది. ఇక కళ్యాణలక్ష్మి, షాదీముబారక్‌లకు రూ.3,210 కోట్లు కేటాయించారు. అదనంగా, పెన్షన్ పంపిణీకి రూ.12,000 కోట్లు, రైతుల రుణమాఫీ కోసం రూ.6,385.20 కోట్లు కేటాయించింది.

అంతేకాదు, మహిళా ఓటర్లు, మైనార్టీ వర్గాలను ఆకట్టుకునేందుకు మూడు కొత్త పథకాలను ప్రవేశపెట్టింది. గ్రామీణ ప్రాంతాల్లో వార్షిక ఆదాయం రూ.2 లక్షల లోపు ఉన్న మతపరమైన మైనారిటీ వర్గాలకు చెందిన కుటుంబాలకు రూ.1 లక్ష ఆర్థిక సాయం అందించేందుకు రూ.400 కోట్లు కేటాయించింది. సంప్రదాయ చేతివృత్తులకు చెందిన వెనుకబడిన తరగతుల లబ్ధిదారులకు మరో రూ.400 కోట్లు కేటాయింపులు చేసింది. గృహలక్ష్మి పథకం కూడా ప్రకటించింది.

తెలంగాణలో దాదాపు 55 శాతం జనాభా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. రాష్ట్రంలో దళితులు గణనీయమైన సంఖ్యలో ఉన్నారు. 119 అసెంబ్లీ స్థానాల్లో 19 ఎస్సీలకు రిజర్వ్ చేయబడ్డాయి. ఇక మైనారిటీలు రాష్ట్ర ఓటర్లలో 12.5 శాతం ఉన్నారు. 30 అసెంబ్లీ నియోజకవర్గాలపై వారు ప్రభావం చూపనున్నారు. తెలంగాణ ఓటర్లలో దాదాపు సగం మంది మహిళలు ఉన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో వెనుకంజ

ఛత్తీస్‌గఢ్ ఈ విషయంలో వెనుకంజలో ఉంది. నిరుద్యోగ భృతి కార్యక్రమంపైనే దృష్టిపెట్టింది. యువతకు నెలకు రూ. 2,500 అందించే ఈ కార్యక్రమానికి బడ్జెట్‌లో రూ.250 కోట్లు కేటాయించింది. కొత్త గృహనిర్మాణ పథకం, గ్రామీణ ఆవాస్ న్యాయ్ యోజన (గ్రామీణ గహనిర్మాణ పథకం) కోసం మరో రూ.100 కోట్లు కేటాయించింది. ముఖ్యమంత్రి కన్యా వివాహ యోజన కింద ఇచ్చే సహాయాన్ని రూ.25,000 నుంచి రూ. 50,000కి పెంచింది. రాష్ట్ర ఖజానాపై దీని భారం రూ. 89 కోట్లు. ఇంకా అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు నెలవారీ గౌరవ వేతనం రూ.6,500 నుంచి రూ.10 వేలకు, రూ.3,250 నుంచి రూ.5,000లకు పెరిగింది. ఈ మార్పులకు అనుగుణంగా రూ.250 కోట్ల బడ్జెట్ కేటాయింపు జరిగింది.

'తిక్కథీర్' ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న ప్రకాశ్‌కరత్, తమిళనాడు మంత్రి మనోతంగరాజ్ తదితరులు

'తిక్కథీర్' ఎడిషన్ కేంద్రం ప్రారంభం

చెన్నై: ప్రముఖ తమిళ దినపత్రిక 'తిక్కథీర్' ఐదో ఎడిషన్ కేంద్రాన్ని తిరునల్వేలిలో శుక్రవారం సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్ కరత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పత్రిక ప్రత్యేక సంచిక తొలి కాపీని తమిళనాడు రాష్ట్ర మంత్రి మనో తంగరాజ్ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి కె.బాలకృష్ణన్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ నూర్ మహ్మద్, మత్తుకూరు రామలింగం, కె.కనగరాజ్, ఎన్.పాండి, దేశాభిమాని పత్రిక మాజీ చీఫ్ ఎడిటర్ పి.ఎం.మనోజ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో పత్రిక పాఠకులు, శ్రేయోభిలాషులు హాజరయ్యారు. కన్యాకుమారి, తెన్‌కాసి, తూత్తుకుడి జిల్లాల పార్టీ కార్యదర్శులు, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు. తిక్కథీర్‌కు ఇప్పటికే చెన్నై, మధురై, కోయంబత్తూర్, తిరుచిరపల్లిల్లో ఎడిషన్ కేంద్రాలు ఉన్నాయి.

చంద్రుడిపై విక్రమ్, ప్రజ్ఞాన్ పునరుద్ధరణ రేపటికి వాయిదా



బెంగళూరు: చంద్రుడిపై స్లీప్ మోడ్‌లో ఉన్న చంద్రయాన్-3కు సంబంధించిన విక్రమ్ ల్యాండర్, రోవర్ ప్రజ్ఞాన్‌ను పునరుద్ధరించే ప్రణాళికలను శనివారానికి వాయిదా వేసినట్లు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) తెలిపింది. తొలుత శుక్రవారం సాయంత్రం ల్యాండర్, రోవర్‌ను తిరిగి యాక్టివేట్ చేయాలని భావించినట్లు స్పేస్ అప్లికేషన్స్ సెంటర్ డైరెక్టర్ నీలేష్ దేశాయ్ తెలిపారు. కొన్ని కారణాల వల్ల దీనిని ఈ నెల 23న చేపడతామని చెప్పారు. ఇస్రో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూన్ ప్రాజెక్ట్ చంద్రయాన్-3 విజయవంతమైన సంగతి తెలిసిందే. ఆగస్ట్ 23న చంద్రుడి దక్షిణ ధృవంపై విక్రమ్ ల్యాండర్ సాఫ్ట్ ల్యాండ్ అయ్యింది. దీంతో అక్కడ అడుగుపెట్టిన తొలి దేశంగా భారత్ చరిత్ర సృష్టించింది. ల్యాండర్ నుంచి చంద్రుడి ఉపరితలంపైకి దిగిన రోవర్ సుమారు 105 మీటర్ల దూరం వరకు కదిలింది. మరోవైపు చంద్రుడిపై లూనార్ నైట్ ప్రారంభం కావడంతో సెప్టెంబర్ 2న రోవర్‌ను, 4న ల్యాండర్‌ను స్లీప్ మోడ్‌లో ఇస్రో ఉంచింది. శుక్రవారం నుంచి చంద్రుడిపై తిరిగి లూనార్ డే ప్రారంభమైంది. దీంతో నిద్రావస్థలో ఉన్న ల్యాండర్, రోవర్‌ను తిరిగి యాక్టివ్ చేసే చర్యలను శనివారానికి ఇస్రో వాయిదా వేసింది. లూనార్ నైట్ సందర్భంగా చంద్రుడి దక్షిణ ధృవం వద్ద ఉండే మైనస్ 200 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు, అక్కడి వాతావరణ పరిస్థితులను తట్టుకుని ఇవి తిరిగి పని చేస్తాయా అన్నది సందిగ్ధం. విక్రమ్ ల్యాండర్, ప్రజ్ఞాన్ రోవర్ తిరిగి పని చేస్తే మరో చరిత్ర సష్టించినట్లు అవుతుంది.

ఇవిఎం సోర్స్‌కోడ్‌పై పిల్.. విచారణకు సుప్రీం నిరాకరణ

న్యూఢిల్లీ: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల్లో ఉపయోగించిన సాఫ్ట్‌వేర్‌పై ఆడిట్ చేయాలని దాఖలైన పిటిషన్‌ను విచారించేందుకు భారత సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. నిబంధనలు ఉల్లంఘించినట్లు చూపించే ఆధారాలేవీ పిటిషనర్ సమర్పించలేదని పేర్కొంది. ఇవిఎం సోర్స్‌కోడ్‌పై ఆడిట్ నిర్వహించాలని కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం పరిశీలించింది. అనంతరం సదరు పిటిషన్‌ను కొట్టివేసింది. 'ఎన్నికల నియంత్రణను కేంద్ర ఎన్నికల కమిషన్‌కు అప్పగించారు. ఎన్నికల సంఘం నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడిందని చెప్పడానికి ఎటువంటి ఆధారాలను పిటిషనర్ కోర్టుకు అందించలేదు. ముఖ్యంగా ఇవిఎంలపై అనుమానాలు కలిగించే ఏ సమాచారాన్ని ఇవ్వలేదు' అని సుప్రీం ధర్మాసనం వ్యాఖ్యానించింది.

ఎన్‌డిఎలోకి జెడిఎస్ : జెపి నడ్డా

బెంగళూరు: మాజీ ప్రధాని దేవెగౌడ పార్టీ జనతాదళ్ సెక్యులర్ (జెడిఎస్) బిజెపి నేతత్వంలోని నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్ (ఎన్‌డిఎ)లో చేరింది. శుక్రవారం జెడిఎస్ నేత కుమారస్వామి హోంమంత్రి అమిత్ షాను ఆయన నివాసంలో కలిశారు. బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డా కూడా ఈ సమావేశంలో ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల దష్ట్యా కర్ణాటకలో సీట్ల పంపకంపై ముగ్గురు నేతల మధ్య చర్చ జరిగినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. సమావేశం అనంతరం జెపి నడ్డా మాట్లాడుతూ.. ఎన్‌డిఎలో జెడిఎస్ చేరిందని తెలిపారు. ఈ విషయాన్ని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఎన్‌డిఎలోకి కుమారస్వామిని మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నామని, న్యూ ఇండియా, స్ట్రాంగ్ ఇండియా అనే ప్రధాని మోడీ విజన్ ను ఈ చేరిక మరింత బలోపేతం చేస్తుందని పేర్కొన్నారు. ఎన్‌డిఏతో పొత్తు కుదిరిందని.. సీట్ల పంపకంపై చర్చిస్తామని హెచ్‌డి కుమారస్వామి చెప్పారు.

శాస్త్రవేత్త స్వాతి నాయక్‌కు బోర్లాగ్ అవార్డు

వాషింగ్టన్ : అంతర్జాతీయ వరి పరిశోధన సంస్థ (ఐఆర్ఆర్ఐ)కు చెందిన భారతీయ శాస్త్రవేత్త డాక్టర్ స్వాతి నాయక్‌కు ప్రతిష్టాత్మక నార్మన్ బోర్లాగ్ అవార్డు లభించింది. వరల్డ్ ఫుడ్ ప్రైజ్ ఫౌండేషన్ అందించే ఈ ప్రతిష్టాత్మక అవార్డు కోసం ఈ ఏడాది ఒడిశాకు చెందిన స్వాతిని నాయక్‌ను ఎంపిక చేసింది. ఆమె న్యూఢిల్లీలోని ఐఆర్ఆర్ఐ కేంద్రంలో విత్తన పరిశోధన విభాగాధిపతిగా విధులు నిర్వహిస్తున్నారు. వరిపంట సాగుచేసే చిన్న రైతులకు అందించిన సేవలకు గాను ఆమెకు ఈ అవార్డు ప్రకటించినట్లు వరల్డ్ ఫుడ్ ఫౌండేషన్ ట్విటర్ ద్వారా తెలిపింది. ఆమె "అత్యుత్తమ యువ శాస్త్రవేత్త" అని ప్రశంసించింది. స్వాతి నాయక్ ఈ అవార్డును అక్టోబర్ 24-26 తేదీలలో స్వీకరించనున్నారు.

అప్రమత్తంగా ఉండండి

- విదేశీ ఎంబసీలకు అమెరికా సూచన

వాషింగ్టన్ : తమ భూభాగంలో విదేశీ రాయబార కార్యాలయాలపై దాడుల పట్ల అప్రమత్తంగా వుండాలంటూ అమెరికా విదేశాంగ శాఖ సూచనలు జారీ చేసింది. సిక్కు వేర్పాటువాద నేత హర్దీప్ సింగ్ నిజ్జార్ హత్యకు సంబంధించి భారత్, కెనడా మధ్య తలెత్తిన దౌత్య సంక్షోభం నేపథ్యంలో ఈ సూచనలు వెలువడ్డాయి. మీడియా అడిగిన ఒక ప్రశ్నకు అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి స్పందిస్తూ, "అమెరికాలో విదేశీ దౌత్యవేత్తలపై లేదా దౌత్య కార్యాలయాలపై విధ్వంసం లేదా హింసకు పాల్పడితే అది క్రిమినల్ నేరంగా పరిగణిస్తారు. సిబ్బందిపై లేదా కార్యాలయాలపై దాడులు లేదా బెదిరింపులను మేం చాలా తీవ్రంగా పరిగణిస్తాం." అని పేర్కొన్నారు. సెప్టెంబరు 25కల్లా భారత దౌత్య కార్యాలయాలను మూసివేయాలంటూ భారత రాయబార కార్యాలయాలకు పలు హెచ్చరికలు, బెదిరింపులు అందిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి.

కెనడాలో భారత్ దౌత్యవేత్తలపై నిఘా

కెనడాలో భారత దౌత్యవేత్తలపై ఉంచిన నిఘా వల్లే ఖలిస్తానీ నేత నిజ్జార్ హత్యవెనక భారత్ పాత్ర గురించి తెలిసిందని కెనడా అధికారి ఒకరు వ్యాఖ్యానించారు. భారత్ అధికారులు, కెనడాలోని భారత్ దౌత్యవేత్తల మధ్య సాగిన కమ్యూనికేషన్లు, అలాగే ఇంటెలిజెన్స్ షేరింగ్ అలయన్స్- ఫైవ్ ఐస్‌లో ఒక సభ్య దేశం ఇచ్చిన ఇంటెలిజెన్స్ సమాచారం కూడా తమకు దోహదపడిందని ఆ అధికారి పేర్కొన్నారు. అధికారుల మధ్య జరిగిన కమ్యూనికేషన్ వివరాలు, అలాగే ఏ దేశం ఆ నిఘా సమాచారం ఇచ్చిందనే వివరాలను ఆయన వెల్లడించలేదు.

భారత్ - కెనడా విమాన టికెట్ ధరలకు రెక్కలు

ఢిల్లీ/టొరంటో: భారత్-కెనడా మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతల నేపథ్యంలో విమాన టికెట్ ధరలు 25 శాతం మేర పెరిగాయి. చాలా మంది ప్రయాణికులు తమ ప్రణాళికల్లో మార్పులు చేయడంతో ఈ పరిస్థితి తలెత్తినట్లు ట్రావెల్ ఏజెన్సీలు అభిప్రాయపడుతున్నాయి. గురువారం భారత్‌కు వచ్చే కెనడా పౌరులకు వీసాల జారీని కేంద్రం తాత్కాలికంగా నిలిపివేయడంతో ఢిల్లీ నుంచి టొరంటో విమాన టికెట్ బుకింగ్స్‌కు చివరి నిమిషంలో డిమాండ్ పెరిగిందని వెల్లడించాయి. భారత్ - కెనడాల మధ్య ఎయిర్ ఇండియా, ఎయిర్ కెనడాలు విమాన సర్వీసులను నిర్వహిస్తున్నాయి. వారానికి 48 విమానాలు ఇరు దేశాల మధ్య రాకపోకలు సాగిస్తున్నాయి.

ఉదయనిధి స్టాలిన్‌కు సుప్రీంకోర్టు నోటీసులు

న్యూఢిల్లీ : డిఎంకె నేత, తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్‌కు సుప్రీంకోర్టు శుక్రవారం నోటీసులు జారీ చేసింది. 'సనాతన ధర్మం' వివాదంపై దాఖలైన పిటిషన్‌ను విచారణకు స్వీకరించింది. ఇటీవల తమిళనాడులో జరిగిన ఓ కార్యక్రమంలో ఉదయనిధి మాట్లాడుతూ.. "సనాతన ధర్మం' డెంగీ, మలేరియా లాంటిది. దాన్ని నిర్మూలించాలి' అంటూ చేసిన వ్యాఖ్యలు దేశ వ్యాప్తంగా చర్చకు దారితీశాయి. ఉదయనిధిపై చర్యలు తీసుకోవాలంటూ దేశ సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన కోర్టు.. ఉదయనిధితోపాటు తమిళనాడు ప్రభుత్వం, సిబిఐ, తమిళనాడు పోలీసులు సహా 14 మందికి నోటీసులు జారీ చేసింది.

ఢిల్లీ అల్లర్ల దర్యాప్తు స్థితిపై పిటిషన్ విచారణకు అనర్హం

న్యూఢిల్లీ : ఈశాన్య ఢిల్లీలో 2020లో జరిగిన అల్లర్లకు కుట్ర వుందని ఆరోపిస్తూ కొంతమంది వ్యక్తులు దాఖలు చేసిన పిటిషన్లపై ప్రాసిక్యూషన్ గురువారం తన వాదనలు ముగించింది. ఈ కేసులో దర్యాప్తు ఏ స్థితిలో వుందో తెలుసుకోగోరుతున్న వారి పిటిషన్లు విచారణా సాధ్యం కాదని ప్రాసిక్యూషన్ పేర్కొంది. దీనిపై నిందితుల తరపు న్యాయవాది వాదనల కోసం అక్టోబరు 3కి విచారణను వాయిదా వేశారు.

ఈ పిటిషన్ ముసుగులో నిందితులకు హక్కు ఇవ్వనపుడు వారు కొత్త పద్ధతిని రూపొందించలేరు, అందువల్ల, ఈ పిటిషన్‌కు విచారణా యోగ్యత లేదని ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ అమిత్ ప్రసాద్ పేర్కొన్నారు. ఈ పిటిషన్ విచారణకు అర్హమైనదని వారు చెప్పగలిగే వరకు వారు ఇంతకుమించి చేయడానికి ఏమీ లేదని, అందువల్లే ఈ దశలో ఇంతకుమించి వాదించేది ఏమీ లేదని ఆయన పేర్కొన్నారు. అసలు ఈ కేసు తదుపరి విచారణకు అనువైనదా కాదా అన్న అంశానికి సంబంధించి, అభియోగాలపై కోర్టులో వాదనలు ప్రారంభమైతే ప్రాసిక్యూషన్ ఇదే విషయాన్ని కోర్టులో చెబుతుందని ప్రసాద్ పేర్కొన్నారు.

వైవాహిక అత్యాచారంపై వచ్చే నెలలో విచారణ : సిజెఐ

న్యూఢిల్లీ : వైవాహిక అత్యాచారాలను నేరంగా పరిగణించాలని కోరుతూ దాఖలైన పిటీషన్లను వచ్చే నెల అక్టోబర్ మధ్యలో సుప్రీంకోర్టు విచారించనుంది. ఈ విషయాన్ని శుక్రవారం ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ వెల్లడించారు. ఈ పిటిషన్లను అత్యవసరంగా విచారించాలని న్యాయవాదులు ఇందిరాజైసింగ్, కరుణ నుండి చేసిన విజ్ఞప్తులకు పైవిధంగా ప్రధాన న్యాయమూర్తి స్పందించారు. ఈ పిటిషన్లపై కర్ణాటక, ఢిల్లీ హైకోర్టులు విభిన్నమైన తీర్పులు ఇవ్వడంతో ఈ అంశం సుప్రీకోర్టు వద్దకు వచ్చింది. వైవాహిక అత్యాచారాలను కర్ణాటక హైకోర్టు నేరంగా పరిగణిస్తూ తీర్పు ఇచ్చింది. అయితే గత ఏడాది మేలో ఢిల్లీ హైకోర్టులో ఇద్దరు న్యాయమూర్తుల బెంచ్ విభజన తీర్పు ఇచ్చింది. బెంచ్‌కు నేతృత్వం వహించిన జస్టిస్ రాజీవ్ శక్దర్ వైవాహిక అత్యాచారాన్ని నేరంగా పరిగణించాలని తీర్పు ఇవ్వగా, మరోక జడ్జి జస్టిస్ సి హరిశంకర్ వైవాహిక అత్యాచారాన్ని నేరంగా పరిగణించాలన్న అభ్యర్థనను తిరస్కరించారు.

భారత వృద్ధి 6.5 శాతమే..!

- 2023-24లో ఆర్థిక శాఖ అంచనా
- గతేడాదితో పోల్చితే పతనం

న్యూఢిల్లీ : భారత వృద్ధి రేటు భళా అని.. బిజెపి ప్రభుత్వం ప్రచారం చేసుకుంటుండగా, ఆర్థిక గణాంకాలు అందుకు భిన్నంగా ఉంటున్నాయి. ఏడాదికేడాదికి జిడిపి పతనమవుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జిడిపి 6.5 శాతానికి పరిమితమై.. వృద్ధి మరింత పడిపోయే అవకాశముందని ఆర్థిక మంత్రిత్వ శాఖ తాజా రిపోర్ట్ స్పష్టం చేస్తోంది. ఈ ఏడాది వర్షాభావంతో ఖరీఫ్, రబీ కాలంలో పంటల దిగుబడుల్లో తగ్గుదల ఉండొచ్చని.. చమురు ధరల పెరుగుదల వృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపుతుందని ఆర్థిక శాఖ తన సమీక్షలో పేర్కొంది. 2022-23లో స్థూల దేశీయోత్పత్తి (జిడిపి) 7.2 శాతంగా నమోదయ్యింది. 2021-22లో 9.1 శాతం వృద్ధి చోటు చేసుకుంది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో తయారీ రంగం ఉత్పత్తుల విలువ పెరుగుదల 1.3 శాతానికి పరిమితమయ్యింది. ఇంతక్రితం ఏడాది ఈ రంగం 11.1 శాతం వృద్ధిని కనబర్చింది. ప్రజల కొనుగోలు శక్తికి కొలమానం అయినా తయారీ రంగం పేలవ ప్రదర్శన కనబర్చడం ఆర్థిక వ్యవస్థలోని బలహీనతలకు నిదర్శనం. "ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రయివేటు రంగ పెట్టుబడుల్లో తగ్గుదల చోటు చేసుకోవచ్చు. బ్యాంక్‌ల రుణాల జారీ, నిర్మాణ రంగంలో పెద్ద పురోగతి ఉండకపోవచ్చు. వర్షాభావం వల్ల పలు ఉత్పత్తుల ధరలు పెరిగి.. ద్రవ్యోల్బణానికి ఆజ్యం పోశాయి. అంతర్జాతీయ ప్రతికూల అంశాలతో స్టాక్ మార్కెట్లు దిద్దుబాటుకు గురయ్యే అవకాశాలున్నాయి. బ్యాంకింగ్ రంగంలో మొండి బాకీలు తగ్గి.. లాభాదాయకతలో మెరుగుదలను ప్రదర్శిస్తున్నాయి." అని ఆర్థిక శాఖ రిపోర్ట్‌లో పేర్కొంది. దేశంలో భారీగా పెరిగిన ధరలు ప్రజల ఆదాయాలు, పొదుపును దెబ్బతీస్తున్నాయి. ఇది తయారీ, ఇతర రంగాల డిమాండ్‌ను ప్రభావితం చేస్తున్నాయి.

యుపిలో మళ్లీ ఎన్‌కౌంటర్

లక్నో: ఉత్తర ప్రదేశ్‌లో రైలులో మహిళా పోలీస్‌పై దాడి చేసినట్లు భావిస్తున్న వ్యక్తి పోలీస్ ఎన్‌కౌంటర్‌లో మరణించాడు. ఆగస్ట్ 30న అయోధ్య సమీపంలో సరయూ ఎక్స్‌ప్రెస్ కంపార్ట్‌మెంట్‌లో మహిళా పోలీస్ కానిస్టేబుల్ రక్తపు మడుగులో కనిపించారు. ప్రస్తుతం ఆమె లక్నో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. యుపి ప్రభుత్వంతోపాటు రైల్వే పోలీసులకు నోటీసులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో అయోధ్య పోలీసులు ఈ సంఘటనపై దర్యాప్తు జరిపారు. తనపై దాడి చేసిన వ్యక్తి అనీస్ ఖాన్‌గా ఫొటో చూసి బాధిత మహిళా కానిస్టేబుల్ గుర్తించారు. అనీస్ ఖాన్ ఆచూకీని సాంకేతిక ఆధారాల ద్వారా పోలీసులు తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో అయోధ్య పోలీసులు, ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ సంయుక్తంగా రైడ్ చేశారు. లొంగిపోవాలని నిందితుడ్ని హెచ్చరించారు. అతడు కాల్పులు జరపడంతో పోలీసులు ప్రతిగా కాల్పులు జరిపారు. తీవ్రంగా గాయపడిన అనీస్ ఖాన్‌ను ఆసుపత్రికి తరలించగా మరణించినట్టు లా అండ్ ఆర్డర్ ప్రత్యేక డిజి ప్రశాంత్ కుమార్ తెలిపారు. కాల్పుల్లో గాయపడిన అతడి సహాయకులు ఆజాద్, విషంభర్ దయాల్‌లను అరెస్టు చేసినట్లు చెప్పారు. ఎదురుకాల్పుల్లో ఒక పోలీస్ కూడా గాయపడినట్లు తెలిపారు.

కార్మిక వ్యతిరేక బిల్లుపై పెల్లుబికిన ఆగ్రహం

సమ్మెలు, ర్యాలీలతో హోరెత్తిన గ్రీస్

గ్రీస్ రాజధాని ఏథెన్స్ వీధుల్లో కదంతొక్కిన కార్మికులు

ఏథెన్స్ : రోజుకు 13 గంటల పని దినంతోసహా తమను ఆధునిక బానిసత్వంలోకి నెట్టే కార్మిక వ్యతిరేక బిల్లును నిరసిస్తూ గురువారం గ్రీస్ రాజధాని ఏథెన్స్‌తో సహా అన్ని ప్రధాన నగరాల్లోనూ కార్మికులు పెద్దయెత్తున వీధుల్లోకి వచ్చారు. ఏడు గంటల పని దినం కావాలని, పెరిగిన ధరలకనుగుణంగా జీతాలు పెంచాలని, సమిష్టిగా బేరమాడే హక్కును కాపాడాలని వారు బిగ్గరగా నినదించారు.కన్జర్వేటివ్ న్యూ డెమొక్రసీ (ఎన్‌డి) ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్మిక వ్యతిరేక బిల్లును నిరసిస్తూ గ్రీస్ కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపుమేరకు సార్వత్రిక సమ్మె బ్రహ్మాండంగా విజయవంతమైంది. ఏథెన్స్‌తోబాటు థెస్సాలోనికి, లారిస్సా, పత్రాస్, ఐయోనినా, కార్ఫు, కతేరిని వంటి నగరాల్లో భారీ నిరసన ప్రదర్శనలు జరిగాయి. ఆనాడు కార్మికుల రక్తతర్పణ ఫలితంగా 8 గంటల పనిదినం సాధించుకున్నాం. ఇప్పుడు అదే స్ఫూర్తితో ఈ కార్మిక వ్యతిరేక బిల్లును తిప్పికొడతామని వారు ప్రతిన బూనారు. యాజమాన్యాలు ఎన్ని ఒత్తిళ్లు చేసినా, బెదిరింపులకు దిగినా లెక్కచేయకుండా ప్రభుత్వ, ప్రైవేట్ రంగ కార్మికులందరూ సమ్మెలో పాల్గొన్నారు. ఆల్ వర్కర్స్ మిలిటెంట్ ఫ్రంట్ (పిఎఎంఇ), వివిధ రంగాలకు చెందిన ఇతర యూనియన్లు ఈ పోరాటంలో భాగస్వాములయ్యాయి. ఒక వైపు కార్మికుల ఆదాయాలు, నిజవేతనాలు పడిపోతున్నాయి. మరో వైపు రోజుకు 13 గంటలు పనిచేయిస్తూ కార్మికుల మూల్గలను పీల్చిపిప్పిచేసేలా ప్రభుత్వం ఈ బిల్లును తీసుకొచ్చింది. దీనికి వ్యతిరేకంగా గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ (కెకెఇ) పార్లమెంటు వెలుపల వేలాది మందితో ప్రదర్శన నిర్వహించగా, పార్లమెంటులో కమ్యూనిస్టు పార్టీ ఎంపీలు బిల్లులో క్రూరమైన నిబంధనలను, అబద్ధాలను, మోసాలను బట్టబయలు చేశారు. ఈ అనాగరిక బిల్లును సహించేది లేదని కార్మిక సంఘాలు తెగేసి చెప్పాయి. బిల్లును ఉపసంహరించుకునేంతవరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశాయి.

నిరసన తెలియజేసిన కార్మిక లోకానికి గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ (కెకెఇ), కమ్యూనిస్టు యూత్ ఆఫ్ గ్రీస్ (కెఎన్ఇ) తన పూర్తి మద్దతును, సంఘీభావాన్ని ప్రకటించాయి. ఈ సమ్మెలో పాల్గొనేందుకు అధికారికంగా పిలుపు ఇవ్వనందుకు జనరల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ గ్రీక్ వర్కర్స్ (జిఎస్ఇఇ) నాయకత్వంపై విమర్శలు వెల్లువెత్తాయి.

బానిసత్వ సాధనంలా కొత్త బిల్లు!

ప్రస్తుతమున్న పని గంటలను 8 నుంచి 13కి పెంచాలని, అవసరమైతే ఆరు రోజుల పని వారాన్ని అమలు చేసేందుకు యజమానులకు అవకాశం కల్పించాలని కార్మిక మంత్రిత్వ శాఖ ప్రవేశపెట్టిన కొత్త బిల్లు పేర్కొంటోంది. ఎలాంటి ముందస్తు హెచ్చరిక లేదా వేతనం లేకుండానే మొదటి ఏడాదిలోనే ఉద్యోగిని తొలగించవచ్చు, పని ఆపేసినా, సమ్మెలు చేసినా జరిమానాలు విధించడంతో పాటు ఆరు మాసాల పాటు జైలు శిక్ష కూడా విధిస్తారని బిల్లు నిబంధనలు పేర్కొంటున్నాయి. కార్మిక లోకం యావత్తూ ఈ బిల్లును తీవ్రంగా నిరసిస్తోంది. గత రెండు మాసాలుగా పెద్ద ఎత్తున సంభవించిన వరదలు, ప్రాణాంతకంగా పరిణమించిన కార్చిచ్చులతో ప్రజలు సతమతమవుతున్న ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం క్రూరమైన ఈ బిల్లును తీసుకురావడంపై కార్మికుల్లో ఆగ్రహం కట్టలుతెంచుకుంది. ఏథెన్స్‌లో జరిగిన ర్యాలీ పాల్గొన్న కెకెఇ ప్రధాన కార్యదర్శి దిమిత్రిస్ కొత్సూమ్‌పాస్ మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వానికి, బడా కార్పొరేట్ యజమానులకు, రాజీపడిన జిఎస్ఇఇ నాయకత్వానికి వ్యతిరేకంగా కార్మికులు, కార్మిక సంఘాలు ఈ ఉద్యమం ద్వారా గట్టి సమాధానం ఇచ్చారని అన్నారు.

గ్రీస్ కార్మిక లోకానికి సిఐటియు అభినందనలు !

గ్రీస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా, తమ హక్కుల పరిరక్షణ కోసం నికరంగా పోరాడుతున్న గ్రీస్ కార్మిక లోకానికి సిఐటియు తన సంఘీభావాన్ని, అభినందనలను తెలియజేసింది. కార్మికుల ఉపాధి భద్రతను గాల్లోకి నెట్టేసి, వారి పనిగంటలను, పని వారాన్ని పెంచేలా రూపొందించిన ఈ రాక్షస బిల్లును తీవ్రంగా నిరసించింది. కార్మికుల వేతనాలు, పెన్షన్లను స్తంభింపచేయడంతోపాటు పొదుపు చర్యల పేరుతో కార్మికుల సంక్షేమానికి ఈ బిల్లు తూట్లు పొడుస్తోంది. పలు రంగాల్లో ప్రస్తుతం అమలులో ఉన్న వారానికి ఐదు రోజుల పనిదినాల విధానాన్ని రద్దు చేయాలని చూస్తోంది. అంతేకాదు, సమ్మె చేసే హక్కును నేరంగా పరిగణించే నిబంధనను బిల్లులో పొందుపరిచారు. సమ్మెకు ప్రజల నుంచి అపూర్వమైన మద్దతు లభించింది. ఏథెన్స్, లావ్‌రియో, లెస్‌వోస్ సహా పలు నగరాల్లో కార్మికులు సాగిస్తున్న పోరాటానికి సిఐటియు తన మద్దతును తెలియచేసింది. మొత్తంగా గ్రీస్ కార్మిక లోకాన్ని, ముఖ్యంగా పిఎఎంఇని అభినందించింది. గ్రీస్ కార్మిక లోకం చేపట్టే చర్యలకు సంఘీభావం తెలియచేయాల్సిందిగా దేశ విదేశాల్లోని సోదర కార్మిక సంఘాలను, తను అనుబంధ సంఘాలను, సభ్యులను సిఐటియ కోరింది.

అసెంబ్లీ సమావేశాలను బహిష్కరిస్తున్నాం

(మొదటిపేజి తరువాయి)

పాటు చంద్రబాబుపై ప్రభుత్వం కక్షతో పెట్టిన తప్పుడు కేసులపై కూడా చర్చిద్దామన్నారు. ఈ సమావేశాలకు అవసరమైతే చంద్రబాబును తాము ఒప్పించి తీసుకొస్తామన్నారు.

వ్యక్తిగత విద్వేషాలతో చంద్రబాబుకు కష్టం కలిగించారు : పయ్యావుల

వ్యక్తిగత విద్వేషాలతో చంద్రబాబుకు కష్టం కలిగించారని టిడిపి ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ విమర్శించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు మొదలు, తదనంతర పరిణామాలపై మీడియాకు వివరించారు. సీమెన్స్ సంస్థతో కలిసి పనిచేసిన ఏ దేశానికి, రాష్ట్రానికి కనిపించని అవినీతి జగన్ ప్రభుత్వానికే కనిపిస్తుందని పేర్కొన్నారు. అమెరికాలో 25 ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలు 90:10 శాతం నిష్పత్తి ప్రకారమే సీమెన్స్ సంస్థతో ఒప్పందం చేసుకున్నాయని వివరించారు. ఆ నిష్పత్తి ప్రకారమే దేశంలో గుజరాత్, ఝార్ఖండ్, తమిళనాడు, కర్ణాటక స్కిల్‌డెవలప్‌మెంట్ ప్రాజెక్టు అమలు చేశాయని తెలిపారు. ఆ నిష్పత్తి ప్రకారమే జర్మనీకి చెందిన సీమెన్స్ ఎజి సంస్థ కళాశాలలకు, పాఠశాలలు, స్వచ్ఛంధ సంస్థలు, అనేక ప్రభుత్వాలకు నిధులు అందించిందని వివరించారు. రాష్ట్రంలోని 40 శిక్షణ కేంద్రాల్లో అన్ని రకాల పరికరాలు, సాఫ్ట్‌వేర్ ఉన్నట్లు సిఐడి నివేదిక ఉందని చెప్పారు. శిక్షణ పొందిన రెండు లక్షల మంది యువతకు ఇచ్చిన సర్టిఫికెట్లు ఉన్నాయని, ఉద్యోగాలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన స్కిల్‌డెవలప్‌మెంట్ ప్రాజెక్టును ప్రశంసిస్తూ కెపిఎంజి, నీతి అయోగ్, సెంట్రల్ షిప్పింగ్ పత్రాలు ఇచ్చాయని వివరించారు. ఇవి జగన్ ప్రభుత్వానికి, సిఐడికి కనిపించవని అన్నారు. ఎక్కడా జరగని, జరిగినట్లు చెప్పడానికి ఎలాంటి ఆధారాలు లేని అవినీతి మాత్రమే కనిపిస్తుందన్నారు.

భారత్‌లో క్షీణిస్తున్న హక్కుల పరిస్థితి

- యుఎన్ ప్రత్యేక ప్రతినిధి ఫెర్నాండ్ డి వరెన్నెస్

న్యూఢిల్లీ: భారతదేశంలోని హక్కుల పరిస్థితిపై ఐక్యరాజ్యసమితి (యూఎన్) మైనారిటీ సమస్యలపై ప్రత్యేక ప్రతినిధి ఫెడ్నాండ్ డి వరెన్నెస్ ఆందోళన వ్యక్తం చేశారు. భారత్‌లో "క్షీణిస్తున్న" హక్కుల పరిస్థితి "భారీ, క్రమబద్ధమైన, ప్రమాదకరమైనది" అని అన్నారు. వాషింగ్టన్ డిసిలో యుఎస్ కమీషన్ ఆన్ ఇంటర్నేషనల్ రిలిజియస్ ఫ్రీడం(యూఎస్‌సీఐఆర్ఎఫ్) నిర్వహించిన కార్యక్రమంలో భారతదేశంలో మతపరమైన స్వేచ్ఛ పరిస్థితిపై ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "భారత్ ప్రపంచంలో దురాగతాల ప్రధాన ఉత్పాదక దేశాలలో ఒకటిగా మారే ప్రమాదం ఉన్నది. ప్రధానంగా మతపరరంగా ముస్లింలు, క్రిస్టియన్లు, సిక్కులు, ఇతర మైనారిటీలను లక్ష్యంగా చేసుకుని ఉల్లంఘనలు, దుర్వినియోగాలు భారీ స్థాయిలో ఉంటున్నాయి. ఇవి అస్థిరత, దౌర్జన్యాలు, హింస ప్రధాన జనరేటర్లు. ఇది కేవలం వ్యక్తి లేదా స్థానికమైనది కాదు. ఇది క్రమబద్ధమైనది, మతపరమైన జాతీయవాదానికి ప్రతిబింబం" అని తెలిపారు. యూఎన్ ప్రత్యేక ప్రతినిధి మణిపూర్ ఘటనను చాలాసార్లు గుర్తు చేశారు. మే 4న జరిగిన ఒక సంఘటన వైరల్ వీడియో దేశవ్యాప్తంగా తీవ్ర షాక్‌కు గురి చేసిన విషయం విదితమే. "ఈ వీడియో అంతర్జాతీయ దృష్టికి వచ్చే వరకు అధికారుల నుంచి చర్యలు నిష్క్రియాత్మకంగా ఉన్నాయి" అని అతను చెప్పాడు. 2014 నుంచి 2018 మధ్య మైనారిటీలపై ద్వేషపూరిత నేరాలు 786 శాతం పెరిగాయని అతను ఒక అధ్యయనాన్ని ఉదహరించాడు. అసోంలో ఎన్నార్సీ, జమ్మూకాశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దును ప్రస్తావించారు.

మీకోసం

పాలు, టీ వేడి చేస్తున్నప్పుడు ఆ గిన్నెల మీద స్టీల్ అట్లకాడ లేదా చెక్క గరిటె ఉంచితే పొంగకుండా ఉంటాయి.

జీవన సౌరభం

అత్యున్నత స్థానానికి చేరాలంటే, ఎన్నో అడ్డంకులు దాటవలసి ఉంటుంది. వాటన్నిటినీ నేర్పుతో, ఓర్పుతో అధిగమిస్తే విజయం సొంతం అవుతుంది.

గురువు

గురువు వెలిగే దీపం
గురువు ఒక దివ్య వరం
విజయ మార్గం చూపే
తొలి వెలుగుల దివ్య పథం

గురువు ఒక కల్పతరువు
గురువు నిలువుని పరువు
మనలో జిజ్ఞాస పెంచి
తీర్చు జ్ఞాన దాహపు కరువు

గురువు అందరి దైవం
గురువే ఒక నమ్మకం!
గురువే మన బతుకుకు
అందించును జయం జయం!

గురువే చదువుల రేడు
గురువే బాపును కీడు!
గురువు చూపిన మేలును
మరువబోకు ఏనాడూ!

గురువే అక్షర జ్యోతి
గురువే ఆశాజ్యోతి!
గురువు నిత్యం వెలిగే
ఆరని విజ్ఞాన జ్యోతి!

- రావిపల్లి వాసుదేవరావు,
94417 13136.

చుక్కలు కలపండి

పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన అంకెలను వరుసగా కలిపితే అందమైన బొమ్మ వస్తుంది. ట్రై చేయండి.



నేను గీసిన బొమ్మ

కోడ. వరం,
7వ తరగతి,
జెడ్‌పిహెచ్‌ఎస్
ముత్యాలపేట,
కవిటి మండలం,
శ్రీకాకుళం జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

చెడు అలవాట్లపై చిన్నారి ప్రచారం

'ధూమపానం.. ఆరోగ్యానికి హానికరం.. చుట్ట, బీడీ, తంబాకు.. మిమ్మల్ని మృత్యువుకు దగ్గర చేస్తాయి..' అంటూ టీవీలో ప్రకటన వచ్చినప్పుడు చాలామంది పిల్లలు పెద్దగా పట్టించుకోరు. కానీ, ఓ చిన్నారి మాత్రం దాన్ని గురించి వాళ్ల నాన్నను పదే పదే ప్రశ్నించేది. ప్రపంచాన్ని కుదిపేస్తున్న అతిపెద్ద సమస్యపై ఆలోచించలేని ఆ వయసు పిల్లల్లో రాని కుతూహలం తన కూతురు చూపిస్తుంటే ఆ తండ్రికి తెగ ఆశ్చర్యమేసేది. అందుకే విసుక్కోకుండా తనకు అర్థమయ్యే భాషలో చెప్పేవాడు. ఇదంతా ఒకప్పుడు..

ఇప్పుడు.. ఆ బాలిక ఓ బృహత్తర కార్యక్రమాన్ని భుజాన వేసుకుని ముందుండి నడిపిస్తోంది. హైద్రాబాద్‌కు చెందిన టానియా బేగం (12) తన ఈడు పిల్లల్లో చాలామందికి తెలియని మత్తు పదార్థాల నిరోధక వ్యవస్థపై ఉక్కుపాదం మోపేందుకు తన గళాన్ని వినిపిస్తోంది. 7 ఏళ్ల నుండే 'డ్రగ్ ఫ్రీ వరల్డ్' ఫౌండేషన్ బ్రాండ్ అంబాసిడర్‌గా సేవలు అందిస్తోంది.

'టీవీలో కార్టూన్ బొమ్మలు అందరు పిల్లలూ చూస్తారు. నేను కూడా కార్టూన్‌లు చూస్తాను. డోరోమ్యాన్ కార్టూన్ అంటే నాకు చాలా ఇష్టం. అందులో హీరో (డోరోమ్యాన్)లాగా నేను కూడా ఏదైనా మంచి పని చేయాలనుకునేదాన్ని' అంటున్న టానియా ఇటీవల ఓ రోజు అంబర్‌పేట కూరగాయల మార్కెట్‌కి వెళ్లింది. అందరిలా తను కూడా కూరగాయాలు కొనుక్కోవడానికే వచ్చిందని అక్కడున్నవాళ్లు అనుకున్నారు. కానీ టానియా ఆ గుంపులకు వినపడేలా, 'హాయ్, నా పేరు టానియా. మీలో ఎవరు పొగ తాగుతున్నారు. మత్తు పదార్థాలు తీసుకుంటున్నారు' అంటూ గట్టిగా అడుగుతూ ముందుకు నడుస్తోంది. ఎవరో ఒకరు పొగతాగుతున్నట్లు ఆమె దృష్టికి రాగానే ఎంతో ఉద్వేగభరితమైన, స్ఫూర్తివంతమైన, ప్రభావంతమైన ప్రసంగాన్ని ప్రారంభించింది. ఆమె మాట్లాడుతున్నంతసేపు ఎవ్వరూ కళ్లు, కాళ్లు కదపలేదు. చుట్టుపక్కల ఉన్నవాళ్లు కూడా ఆమె దగ్గరికి వచ్చేశారు.

టానియా తండ్రి సలాలుద్దీన్ షేక్ సామాజిక కార్యకర్త. వ్యసనాలపై అవగాహన కల్పిస్తూ హైద్రాబాద్‌లో పలు మారథాన్‌లు నిర్వహిస్తుంటారు. బాల్యం నుండే వాటిల్లో పాల్గొనేది టానియా. వ్యసనం జీవితాలను ఎంతలా నాశనం చేస్తుందో ఎన్నో ఉదాహరణలను ప్రత్యక్షంగా చూసింది. అవగాహన కల్పించేందుకు తను కూడా నడుం బిగించాలని అప్పుడే నిశ్చయించుకుంది.

తనను అడ్డుకున్నాను

'ఒక సామాజిక కార్యకర్తగా నా పని నేను చేసుకుపోయేవాడిని. టానియా నా కార్యక్రమాల్లో భాగం కావాలని ఎప్పుడూ అనుకోలేదు. ఒక్కోసారి అడ్డుకోవడానికి కూడా ప్రయత్నించేవాడిని. కానీ తను ఎప్పుడూ మాదకద్రవ్యాల విషయాలపై వార్తా కథనాలు, పుస్తకాలు, యూట్యూబ్ వీడియోలను అనుసరించేది. వాటిని లోతుగా అధ్యయనం చేసేది. తన ఆసక్తిని చూసి నాకు చాలా ఆశ్చర్యమేసేది. అందుకే ఆ తరువాత ఎప్పుడూ తనను నిరాశపరచలేదు. ఇప్పుడు ఆమె చేస్తున్న సేవ చూస్తుంటే ఎంతో సంతోషంగా ఉంటోంది' అంటున్నాడు ఆ తండ్రి.

కరపత్రాలు పంచిపెడుతూ ...

టానియా అభిరుచిని తెలిసిన ఓ స్వచ్ఛంధసంస్థ ఆమెకి మద్దతుగా నిలిచింది. మాదకద్రవ్యాల నియంత్రణపై పలు పోస్టర్లు, కరపత్రాలు పంచిపెట్టే పనిని అప్పగించింది. 'సంస్థ ఇచ్చిన పోస్టర్లు తీసుకుని వీధుల్లో అంటించేదాన్ని. రద్దీగా ఉన్న ప్రదేశాల్లో కరపత్రాలు పంచేదాన్ని. అప్పుడు నేను డోర్‌మ్యాన్‌లా భావించేదాన్ని' అంటోన్న టానియాలో చిన్నపిల్లల్లో సాధారణంగా కనిపించే అమాయకత్వం కనిపించింది.

బ్రాండ్ అంబాసిడర్‌గా

'ఒక మంచి పని కోసం చిన్నపిల్ల చేస్తున్న సాయం' అంటూ ఆ సంస్థ సోషల్‌మీడియాలో షేర్ చేసిన వీడియోని చూసిన ప్రపంచ సంస్థ 'డ్రగ్ ఫ్రీ వరల్డ్' టానియాను తమ బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపికచేసింది. అప్పుడామె వయసు ఏడేళ్లు.

'డ్రగ్ ఫ్రీ వరల్డ్' ఇచ్చిన ప్రోత్సాహంతో ఇప్పుడు టానియా స్కూళ్లు, కాలేజీలు, మార్కెట్లు, కార్యక్రమాలు ఎక్కడైతే జనసందోహాలు ఉంటాయో అక్కడ ప్రచారం చేస్తోంది. తన చిన్న గొంతుకతతో ఆమె ఇచ్చే ప్రసంగాన్ని ఎంతోమంది పెద్దలు కన్నార్పకుండా చూస్తారు, వింటారు.

సెలబ్రిటీలే కారణం

'తెలంగాణలో మద్యపానం అతిపెద్ద వ్యసనం. ఇక్కడ చాలామంది మత్తుపదార్థాలకు బానిసలు' అంటున్న టానియా ఈ సమస్యకు పరిష్కారం దిశగా అడుగులు వేస్తోంది. ముందుగా ఆయా మత్తు పదార్థాలు, మద్యం అమ్మకాలకు ప్రచారకర్తలుగా ఉన్న సినీ సెలబ్రిటీలకు ట్విట్టర్ వేదికగా విజ్ఞాపనలు పంపింది. విచిత్రంగా కొన్ని రోజులకే ఆమె ట్విట్టర్ ఎకౌంట్ నిషేధానికి గురైంది. అయినా ఆమె తన ప్రయత్నాన్ని విరమించుకోలేదు. మరో ఖాతా తెరిచి తన పని చేసుకుపోతోంది. 'చాలా మంది యువత ఈ వ్యసనాలకు బానిసలవ్వడానికి కారణం, వారు అభిమానించే నటులు సినిమాల్లో అనుసరిస్తున్న విధానాలు. అందుకే నేను వారికి సోషల్ మీడియా వేదికగా సందేశాలు పంపేదాన్ని. అయితే నాకు మద్దతుగా నిలవాల్సిన మీడియా నన్ను కట్టడ చేసేందుకు ప్రయత్నించింది' అంటూ తనకు ఎదురైన అనుభవం గురించి చెబుతోంది.

'సోషల్ మీడియా వినియోగం బాగా పెరిగిన ఈ రోజుల్లో బడి ఈడు పిల్లలు కూడా మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారు. 'ఈ-సిగరేట్ల'ను వాడుతున్న పిల్లల గురించి తెలిసి చాలా బాధపడ్డాను. అందుకే స్కూళ్లకు వెళ్లి కూడా ప్రచారం చేస్తున్నాను' అంటున్న టానియాలో సమాజం బాగుండాలన్న తపన కనపడుతోంది.

టానియా, 'యునిసన్ ఇంటర్నేషనల్' స్కూల్లో ఐదో తరగతి చదివేటప్పుడు స్కూలుకు దగ్గరగా ఓ మద్య దుకాణం ఉండేది. ఒకరోజు తనతోటి విద్యార్థుల్లో కొంతమందిని అక్కడ చూసింది. అంతే.. ఆ షాపుకు వెళ్లి, ఆ దుకాణాన్ని మూసేయమని షాపు యజమానితో వాదించింది. అతను మాట వినలేదు.. దీంతో కొంతమంది స్నేహితుల సాయంతో షాపుకు వచ్చే వారికి మద్యపానం దుష్ప్రభావాలను చెప్పడం ప్రారంభించింది. టానియా ప్రోత్సాహంతో స్కూలుకు వచ్చి చదువుకుంటున్న పిల్లలు రోజూ దుకాణానికి రావడం, అవగాహన కల్పించడం పనిగా పెట్టుకున్నారు. వారి చర్యలు అక్కడికి వచ్చే పెద్దవారిని ఆలోచనల్లో పడేశాయి. ఫలితంగా మద్యం దుకాణం మూతపడింది. ఇది టానియా తిరుగులేని స్ఫూర్తికి, మాదకద్రవ్య రహిత ప్రపంచాన్ని సృష్టించే అచంచలమైన ఆమె నిబద్ధతకు నిదర్శనం.

మీడియాకి అనుమతి లేదు

'కుటుంబ బంధాలకు విలువనిచ్చే ఈ సమాజంలో తమ నిర్ణయాన్ని మీడియా గౌరవించాలి. ఒక వ్యక్తి చనిపోతే ఎక్కువ నష్టం ఆ కుటుంబానికే ఉంటుంది. మిగతా వారంతా పరామర్శకి వచ్చి వెళ్లే వారు తప్ప వాళ్లు చేసేదేం లేదు. మీడియా కవరేజీ కోసం ఎగబడిన తీరు శోచనీయం. ఇలాంటి సమయంలో మీడియాకి అసలు సంబంధం ఏముంది? విషయం తెలిసిన తర్వాత దాన్ని ప్రజలకు చేరే వేయడమే వారి పని. కానీ అంతకు మించి అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. ఇది తగదు. మీడియాకి, పోలీసులకి అనుమతి ఉన్నా సరే ఇకపై అనుమతించేది లేదు. మీడియా వారంతా ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని వ్యవహరించాలి' అని తమిళ దర్శక నిర్మాత భారతీరాజా అన్నారు. విజయ్ ఆంటోనీ కుమార్తె మీరా ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. అంత్యక్రియల సమయంలో దు:ఖంతో నిండిన కుటుంబ సభ్యుల్ని మీడియా గుచ్చి గుచ్చి ప్రశ్నించడం.. మైకులు పట్టుకుని మీద మీదకి ఎగబాకడం వంటి సన్నివేశాలు బాగా వైరల్ అయ్యాయి. యూట్యూబ్‌లో తంబ్ నైల్స్ పెట్టి మరీ ప్రచారం చేశారు. ఈ పరిణామాలపై నిర్మాతల సంఘం మీడియాపై సంచలన నిర్ణయం తీసుకుంది. మీడియాని బ్యాన్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఇకపై తమిళ సినీ ప్రముఖుల మరణ దృశ్యాలు, వార్తలకు సంబంధించిన అంశంపై అనుమతించేది లేదని ప్రకటించింది. ఈ మేరకు నిర్మాతల సంఘం అధ్యక్షుడు భారతీరాజా ఈ ప్రకటన జారీ చేసారు.

ఆస్కార్‌కి..!

వచ్చే ఏడాది ఆస్కార్ కోసం ఇప్పటివరకు 22 సినిమాలు అధికారిక ఎంట్రీకి వచ్చినట్లు వార్తలు వస్తున్నాయి. అందులో రెండు తెలుగు సినిమాలు కూడా ఉన్నాయి. అవి : 'బలగం', 'దసరా'. ఇంకా 'గదర్-2', 'రాకీ ఔర్ రాణీ కీ ప్రేమ్ కహానీ', 'జ్విగాటో', 'ది స్టోరీ టెల్లర్' 'ది కేరళ స్టోరీ' వంటి సినిమాలు ఎంట్రీకి వెళ్లాయి. ప్రముఖ ఫిల్మ్ మేకర్ గిరీష్ కాసరవల్లి నేతృత్వంలో 17 మంది సభ్యులతో కూడిన ఆస్కార్ కమిటీ చెన్నై వేదికగా ఆస్కార్ ఎంట్రీ కోసం దరఖాస్తు చేసుకున్న సినిమాలను వీక్షిస్తోంది. బలగం, జ్విగాటో, విడుదలై-1 సినిమాల్లో ఒకటి ఆస్కార్ ఎంట్రీ సాధించే అవకాశం అధికంగా ఉన్నట్టు సమాచారం.

సూర్యతో బోయపాటి సినిమా

తమిళ హీరో సూర్యతో దర్శకుడు బోయపాటి శ్రీను త్వరలో ఓ సినిమా తీయబోతున్నారు. శివ దర్శకత్వంలో 'కంగువా'లో ప్రస్తుతం సూర్య నటిస్తున్నారు. దీని తర్వాత బోయపాటి సినిమా ప్రారంభమవుతుందని సమాచారం. గతంలో కొన్ని ఇంటర్వ్యూల్లో మాట్లాడుతూ బోయపాటి తనకు సూర్యతో సినిమా చేయాలని ఉందని చెప్పిన సంగతి తెలిసిందే. దీనినిబట్టి చూస్తే ఇది త్వరలోనే నిజం కానుందని సినీ అభిమానులు సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నారు.

దసరా కానుకగా 'ఘోస్ట్'

డాక్టర్ శివరాజ్ కుమార్ హీరోగా రూపొందుతోన్న చిత్రం ఘోస్ట్. దర్శకుడు శ్రీని, నిర్మాత సందేశ్ నాగరాజ్. సందేశ్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అక్టోబర్ 19న దసరా కానుకగా కన్నడ, తెలుగు, తమిళ, హిందీ, మలయాళం భాషల్లో భారీ స్థాయిలో విడుదల చేయనున్నారు. చెన్నై లయోలా కాలేజ్‌లో 'ఒరిజినల్ గ్యాంగ్ స్టర్ మ్యూజిక్' పాట వీడియోను విడుదల చేశారు. ఈ పాటను అర్జున్ జన్య పాడారు. ప్రముఖ నటులు అనుపమ్ ఖేర్, జయరామ్, ప్రశాంత్ నారాయణ్, అర్చన జాయిస్, సత్య ప్రకాష్, దత్తన్న ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు.

యశ్ కొత్త ప్రాజెక్టు

కెజిఎఫ్‌తో బాగా పాపులర్ అయిన కన్నడ నటుడు యశ్ తరువాతి ప్రాజెక్టును గీతు మోహన్ దాస్ దర్శకత్వంలో చేయనున్నారు. ఈ సినిమాను కె.వి.ఎన్ ప్రొడక్షన్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. ఈ చిత్రానికి యశ్ కూడా సహ నిర్మాతగా ఉంటున్నారని సమాచారం. ఈ సినిమా గోవా బ్యాక్ డ్రాప్‌లో తెరకెక్కుతుందని తెలుస్తోంది. ఇప్పటికే ప్రీ ప్రొడక్షన్ వర్క్ పూర్తి చేసుకోగా త్వరలో సినిమా సెట్స్ మీదకు వెళ్లనుందని వార్తలు వినిపిస్తున్నాయి.

'ప్రీవెడ్డింగ్ ప్రసాద్' షూటింగ్ ప్రారంభం

డెక్కన్ డ్రీమ్ వర్క్స్ బ్యానర్‌పై నబీషేక్ నిర్మాణంలో ప్రొడక్షన్ నెం.3గా రూపొందనున్న సినిమా 'ప్రీవెడ్డింగ్ ప్రసాద్'. జబర్దస్త్ కళాకారుడు అవినాష్ ఈ చిత్రంతో హీరోగా పరిచయమవుతున్నారు. సాయి కుమార్ ప్రధాన పాత్రలోనూ, రియాజ్, రూపా ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. శుక్రవారంనాడు ముహూర్తం సన్నివేశానికి ప్రముఖ దర్శకుడు కోదండ రామిరెడ్డి క్లాప్‌నిచ్చారు. కోన వెంకట్ కెమెరా స్విచ్ ఆన్‌చేశారు. కోదండ రామిరెడ్డి, కోన వెంకట్, సాయి కుమార్ నిర్మాతలకు సినిమాకథ అందించారు. రాకేష్ దుబాసి ముహూర్తపు సన్నివేశానికి స్వయంగా దర్శకత్వం వహించారు. దర్శకుడు సాయి రాజేష్ సినిమా టైటిల్ లోగోని ఆవిష్కరించారు. చేశారు. దర్శకుడు వీరభద్రం చౌదరి, నిర్మాత బెక్కం వేణుగోపాల్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆసియా క్రీడలు నేటినుంచే..

- భారత ఫ్లాగ్ బేరర్లుగా హర్మన్‌ప్రీత్, లవ్లీనా
- 655మంది అథ్లెట్లతో భారీ బృందం

ఆసియా ఖండంలో అతి పెద్ద క్రీడా సంబరం నేటినుంచి ప్రారంభం కానుంది. చైనాలోని హాంగ్జౌ వేదికగా 19వ ఆసియా క్రీడలు 23న ప్రారంభమై.. అక్టోబర్ 8న జరిగే ముగింపు వేడుకలతో ముగియనున్నాయి. భారత్‌నుంచి ఈసారి అత్యధికంగా 655మంది అథ్లెట్లు బరిలోకి దిగనున్నారు. మొత్తం 61 క్రీడాంశాల్లో పోటీపడే అథ్లెట్లకు 481 స్వర్ణ పతకాలు దక్క నున్నాయి. భారత్ నుంచి 41 క్రీడాంశాల్లో అథ్లెట్లు బరిలోకి దిగనున్నారు. ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శించిన వారు 2024 పారిస్ ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధిస్తారు. షెడ్యూల్ ప్రకారం 2022లోనే ఈ పోటీలు జరగాల్సి ఉన్నా.. కోవిడ్-19 కారణంగా ఈ ఏడాది జరుగుతున్నాయి. 2018 జకార్తా వేదికగా జరిగిన ఆసియా క్రీడల్లో భారత్ 70 పతకాలతో 8వ స్థానంలో నిలిచింది. ఈసారి సెంచరీ కొట్టాలని లక్ష్యంగా పెట్టుకుంది.

19th Asian Games
Hangzhou 2022

హాంగ్జు(చైనా): హాంగ్జు వేదికగా శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. సెప్టెంబర్ 23న ప్రారంభమై.. అక్టోబర్ 8న జరిగే ముగింపు వేడుకలతో ముగియనున్నాయి. చైనాలోని 56 వేదికల్లో ఈసారి ఆసియా క్రీడలు జరగనున్నాయి. ప్రారంభోత్సవ వేడుకల్లో భారత బృందానికి పురుషుల హాకీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, మహిళా బాక్సర్ లవ్లీనా బోర్గోహైన్ త్రివర్ణ పతకాన్ని చేబూని అందరికంటే ముందు నడవనున్నారు. ఈ క్రీడల్లో భారత్‌నుంచి తొలిసారి 655మంది అథ్లెట్లు పాల్గొనున్నారు. జావెలిన్ త్రో, హాకీ, క్రికెట్, టెన్నిస్, వెయిట్‌లిఫ్టింగ్, బ్యాడ్మింటన్‌లో ఈసారి భారత్‌కు స్వర్ణ పతకాలు దక్కడం ఖాయం. అధికారికంగా నేటినుంచి అన్ని క్రీడాంశాలు ప్రారంభమవుతున్నా.. వాలీబాల్, క్రికెట్, ఫుట్‌బాల్, బీచ్‌వాలీబాల్ తదితర క్రీడాంశాలు 19నుంచే జరుగుతున్నాయి.

క్రికెట్‌కు తొలిసారి..

క్రికెట్‌కు ఈసారి ఆసియా క్రీడల్లో తొలిసారి చోటు దక్కింది. ఇంతకుముందు పురుషుల క్రికెట్‌కు మాత్రమే ఒకసారి చోటు దక్కగా.. ఈసారి పురుషుల, మహిళల క్రికెట్‌కు చోటు దక్కడం విశేషం. టి20 ఫార్మాట్‌లో జరిగే ఈ పోటీల్లో పురుషుల జట్టుకు రుతురాజ్ గైక్వాడ్, మహిళల జట్టుకు హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ రెండు విభాగాల్లోనూ భారత్‌కు స్వర్ణ పతకాలు దక్కడం ఖాయం. ఇక 21న మలేషియాపై ఘన విజయం సాధించిన మహిళలజట్టు ఇప్పటికే సెమీస్‌కు చేరింది. 25న ఫైనల్ మ్యాచ్ జరగనుంది. ఇక పురుషుల క్రికెట్ పోటీలు సెప్టెంబర్ 27నుంచి ప్రారంభం కానుండగా.. అక్టోబర్ 7న జరిగే ఫైనల్‌తో ముగియనున్నాయి. ఐసిసి టాప్-10 ర్యాంక్‌లో ఉన్న భారత్, పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, ఆఫ్ఘనిస్తాన్ జట్లు నేరుగా క్వార్టర్‌ఫైనల్‌కు చేరగా.. గ్రూప్-ఎ, బి, సి నుంచి ఒక్కో జట్టు లీగ్ దశ ముగిసిన తర్వాత క్వార్టర్‌ఫైనల్లో చోటు దక్కించుకోనున్నాయి.

ట్రాక్ అండ్ ఫీల్డ్‌లోనూ ఫేవరెట్‌గానే..

ఇక ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో 68మంది అథ్లెట్లు భారత్ తరఫున బరిలోకి దిగనున్నారు. ఈసారి అందరికళ్లూ నీరజ్ చోప్రా(జావెలిన్) పైనే ఉన్నాయి. 2018 జకార్తా వేదికగా జరిగిన ఆసియా క్రీడల్లో తొలిసారి స్వర్ణ పతకాన్ని చేజిక్కించుకొని నీరజ్.. నయా చరిత్రకు శ్రీకారం చుట్టాడు. టోక్యో ఒలింపిక్స్‌లోనూ స్వర్ణ పతకం సాధించినా.. ఇటీవల ముగిసిన డైమండ్ లీగ్‌లో రజిత పతకానికే పరిమితమయ్యాడు. స్క్వాష్‌లో దీపిక పల్లికల్, జోష్నా చిన్నప్ప పతకాలు సాధించగల క్రీడాకారులే.

టిటిలో గెలుపు..

టేబుల్ టెన్నిస్ పురుషుల, మహిళల విభాగాల్లో భారత్ శుభారంభం చేసింది. శుక్రవారం జరిగిన గ్రూప్ పోటీల్లో పురుషుల జట్టు 3-0తో యెమెన్, మహిళలజట్టు 3-2తో సింగపూర్‌ను ఓడించాయి. జి. సాథియాన్, హర్మీత్ దేశాయ్‌లతో కూడిన పురుషుల జట్టు తొలి మ్యాచ్‌లోనూ 3-1తో గెలిచింది. దీంతో ప్రి క్వార్టర్స్‌కు ఇరుజట్లు చేరాయి.

అరుణాచల్ ప్రదేశ్ క్రీడాకారులకు వీసా సమస్య

భారత్‌కు చెందిన అరుణాచల్ ప్రదేశ్ క్రీడాకారులకు చైనా వీసాను నిరాకరించింది. దీనిపై భారత్ నిరసన వ్యక్తం చేసింది. దీంతో ప్రారంభ వేడుకలో పాల్గొనకూడదని కేంద్ర క్రీడల మంత్రి అనురాగ్ ఠాకూర్ నిర్ణయించుకున్నారు. అలాగే చైనా పర్యటనను రద్దు చేసుకున్నారు. విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి అరిందమ్ బాగ్చి శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. ఆసియా క్రీడల స్ఫూర్తిని చైనా ఉల్లంఘించిందన్నారు.

టీమిండియా అలవోకగా..

- షమీకి ఐదు వికెట్లు
- ఆస్ట్రేలియాపై ఐదు వికెట్ల తేడాతో గెలుపు

ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ షమీ

మొహాలీ: ఆస్ట్రేలియాతో జరిగిన తొలి వన్డేలో భారత్ ఘన విజయం సాధించింది. ఆస్ట్రేలియా నిర్దేశించిన 277పరుగుల లక్ష్యాన్ని భారత్ 48.4ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి ఛేదించింది. శ్రేయస్ అయ్యర్(3) నిరాశపరచగా.. గైక్వాడ్, శుభ్‌మన్, సూర్య కుమార్, కెఎల్ రాహుల్ అర్ధసెంచరీలతో మెరిసి టీమిండియాను గెలిపించారు. తొలుత టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియాను మహ్మద్ షమీ(5/51) కట్టడి చేశాడు. ఓపెనర్ మిచెల్ మార్ష్(4)ను అవుట్ చేసిన షమీ... ఆ తర్వాత స్టీవ్ స్మిత్(41), స్టొయినిస్ (29), మాథ్యూ షార్ట్ (2), షాన్ అబ్బాట్ (2) వికెట్లు తీశాడు. డేవిడ్ వార్నర్(52) అర్ధసెంచరీకి తోడు లబుషేన్ 39, కామెరాన్ గ్రీన్ 31, జోష్ ఇంగ్లిస్ 45 పరుగులతో రాణించారు. దీంతో ఆసీస్ నిర్ణీత 50 ఓవర్లలో 276పరుగులు చేసింది. బుమ్రా, అశ్విన్, జడేజాకు ఒక్కో వికెట్ దక్కాయి. ఛేదనలో టీమిండియా ఓపెనర్లు గైక్వాడ్(71), శుభ్‌మన్(74) తొలి వికెట్‌కు 142పరుగులు జోడించారు. ఆ తర్వాత శ్రేయస్ నిరాశపరిచినా.. కేఎల్ రాహుల్(58నాటౌట్), సూర్యకుమార్(50) అర్ధసెంచరీలతో మెరిసారు. 48పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద కెప్టెన్ కేఎల్ రాహుల్ ఫోర్, సిక్సర్ కొట్టి మ్యాచ్‌ను ముగించాడు. దీంతో భారత్ 48.4ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 281పరుగులు చేసి గెలిచింది. రెండో వన్డే ఆదివారం ఇండోర్ వేదికగా జరగనుంది.

హోరాహోరీగా పిజిఐటి గోల్ఫ్ టోర్నీ

ప్రజాశక్తి - ఆరిలోవ (విశాఖపట్నం)

విశాఖలోని ముడసర్లోవ వద్దగల ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్‌లో జరుగుతున్న పిజిటిఐ ఇంటర్నేషనల్ గోల్ఫ్ టోర్నమెంట్‌లో హోరాహోరీ పోరు సాగుతోంది. శుక్రవారం జరిగిన పోటీల్లో 53 మంది పాల్గొన్నారు. నాలుగో రౌండ్ లీడర్ బోర్డులో మొదటి పది మందిలో సున్హిత్ బిహనోయ్ (-9), అక్షయ్ శర్మ (-8), శివేంద్ర సింగ్ (-6), త్రిశూల్ చిన్నప్ప (-5), సార్థాక్ చిబ్బేర్ (-4), మహ్మద్ సంజు (-3), ఒఎం ప్రకాష్ చౌహాన్ (-3), హరేంద్ర గుప్తా (-3), సామ్రాట్ ద్వివేది (-2), రోహన్ ధోలె పటేల్ (-2) స్కోర్లుతో ముందంజలో ఉన్నారు. విజేతలకు శనివారం మధ్యాహ్నం బహుమతి ప్రదానం చేస్తామని ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్ కార్యదర్శి ఎంఎస్ఎన్.రాజు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ జవహర్ రెడ్డి, తూర్పు నౌకాదళం చీఫ్ కమాండర్ రాజేష్ పెండత్కర్ హాజరవుతారని క్లబ్ ఉపాధ్యక్షులు వినోద్ బాబు తెలిపారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68